శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 236 | బుధవారం | 18-02-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




## మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను

# సవాల్‌గా తీసుకుంటాం

### బలమైన స్థానాల్లో గెలిచేందుకు సర్వశక్తులూ ఒడ్డుతాం

- జెడ్‌పి, ఎంపిపి స్థానాల్లోనూ ప్రాతినిధ్యం ఉండేలా చూసుకుంటాం
- ఒక్క అసెంబ్లీ సీటుతోనే సరిపెట్టుకోబోం
- పది నియోజకవర్గాలపై దృష్టిసారించి బలాన్ని పెంచుకుంటాం
- భవిష్యత్తులో కాంగ్రెస్‌తో పొత్తు ఆపార్టీ చేతుల్లోనే ఉంది
- కమ్యూనిజం ఎక్కడ ఉన్నది అనేవారికి కొత్తగూడెం మేయర్ ఎన్నిక చెంపపెట్టు
- మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

కమ్యూనిస్టులను, కమ్యూనిస్టు పార్టీలను చిన్నచూపు, తక్కువ చూపు చూసే వారికి, కమ్యూనిజం ఎక్కడ ఉన్నదని అనే వారికి కొత్తగూడెం మేయర్ ఎన్నిక ఒక చెంప పెట్టు లాంటిదని, ఒక గుణపాఠమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్, వరంగల్, ఖమ్మం తదితర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలనూ ఒక సవాల్‌గా తీసుకుని తమకు బలమైన స్థానాల్లో గెలిచేందుకు సర్వశక్తులూ ఒడ్డుతామని, జిల్లాల వారీగా జెడ్‌పి, ఎంపిపి స్థానాలలో కూడా తమ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తామని స్పష్టం చేశారు. ఆలక్ష్యం దిశగానే నగరపాలక సంస్థలలో ప్రజలను సమాయత్తం చేస్తున్నామన్నారు. శాసనసభలో తరువాయి 12లో

### కొత్తగూడెంలో కాంగ్రెస్‌తో పొత్తు రాజకీయ ప్రాతిపదికనే : పల్లా

కొత్తగూడెం కార్పొరేషన్‌లో సిపిఐకి బిఆర్‌ఎస్ మద్దతు ప్రకటించినప్పటికీ రాజకీయ అవగాహన ప్రాతిపదికన జాతీయ, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్‌తో సిపిఐ పొత్తు ఉన్నదని, అందుకే కాంగ్రెస్‌తో కలిశామని పల్లా వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా చొరవ తీసుకోవడంతోనే కొత్తగూడెంలో పొత్తు కుదిరిందన్నారు. ఎన్నికల సమయంలో తాము తరువాయి 12లో

### జీవవిజ్ఞాన రంగానికి హైదరాబాద్‌ను

# ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదాం

- అందరూ భాగస్వాములు కావాలని ప్రపంచ దిగ్గజ కంపెనీలు, శాస్త్రవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా ఉందని వెల్లడి
- తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతిస్తుందని స్పష్టీకరణ
- హైటెక్స్‌లో ప్రతిష్మాత్మకమైన '23వ బయో ఏషియా–2026' అంతర్జాతీయ సదస్సు ప్రారంభం


పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి
విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం : సిఎం
03




ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యాక్సిన్ తయారీలో ప్రపంచ రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను జీవవిజ్ఞాన రాజధానిగా ఎదిగేందుకు భాగస్వాములు కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 'బయో ఏషియా – 2026' సదస్సు వేదికగా జీవవిజ్ఞాన రంగానికి చెందిన ప్రపంచ దిగ్గజ కంపెనీలు, శాస్త్రవేత్తలు, నిపుణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ దేశంలోని మిగతా రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో హైదరాబాద్ పోటీ పడుతోందని, తరువాయి 2లో




09
నేటి నుంచి ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు
నిజామాబాద్‌లో 20 వరకు జరగనున్న సభలు


## కాంగ్రెస్‌కు మరో ఏడు పీఠాలు

- రెండు చోట్ల వరించిన అదృష్టం
- లాటరీ తీయడంతో కాంగ్రెస్ ఖాతాల్లోకి వెళ్లిన జనగామ, తొర్రూరు మున్సిపాలిటీలు
- మూడు మున్సిపాలిటీల్లో చైర్మన్ల ఎన్నిక మళ్లీ వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్


రాష్ట్రంలో మున్సిపాలిటీ చైర్మన్‌ల ఎన్నిక ప్రక్రియ కొనసాగుతోంది. 116 మున్సిపాలిటీలకుగాను 105 మున్సిపాలిటీలకు సోమవారం ఎన్నికలు నిర్వహించిన విషయం తెల్సిందే. వాయిదా 11 మున్సిపాలిటీలకు మంగళవారం నిర్వహించారు. మంగళవారం కూడా చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు సర్వశక్తులా ప్రయత్నాలు చేశాయి. పలుచోట్ల కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీల నేతలు ఆందోళనకు దిగాయి. కోరం లేకపోవడం, తదితర కారణాలతో మళ్లీ 3 చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇల్లందు మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. చైర్మన్‌గా దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్‌గా పెండేల రాజు ప్రమాణ స్వీకారం చేశారు. కాగజ్‌నగర్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బిజెపి మద్దతుతో హస్తం తరువాయి 2లో



## బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ ప్రమాణం

- 49 మందితో మంత్రివర్గం
- 18 నెలల మహ్మద్ యూనుస్ తాత్కాలిక పరిపాలనకు తెర

**ఢాకా:** బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ (బిఎన్‌పి) సారథ్యంలో మెజారిటీ ప్రభుత్వం 50మంది మంత్రివర్గంతో ఏర్పడింది. ప్రధానమంత్రిగా బిఎన్‌పి ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ (60) మంగళవారంసాయంత్రం 4.00 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. నేషనల్ పార్లమెంటు సౌత్ ప్లాజాలో రాష్ట్రపతి మొహమ్మద్ షహబుద్దీన్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో 18 నెలల మహ్మద్ యూనుస్ తాత్కాలిక పరిపాలనకు తెరపడింది. అంతకుముందు ఉదయం 11.30 గంటలకు బిఎన్‌పి పార్లమెంటరీపార్టీ కార్యాలయంలో తరువాయి 2లో



## అధికారం నుండి వైదొలగిన మహ్మద్ యూనుస్

**ఢాకా :** కొత్త ప్రభుత్వంలో మంత్రులు, పార్లమెంటులో ఎంపీలు ప్రమాణ స్వీకారోత్సవానికి ముందుగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా వ్యవహరించిన మహ్మద్ యూనుస్ (85) సోమవారం పదవి నుండి వైదొలగారు. ఆయనతోపాటు వివిధ శాఖలు సలహాదా లుగా పనిచేసిన ఆయన బృందం సభ్యులు రాజీనామాలు చేశారు. గడచిన నాలుగు రోజులుగా వివిధ ప్రభుత్వ శాఖలు, సచివాలయంలో కార్యదర్శులు, ఇతర ప్రముఖులు వరుస వరుసగా యూనుస్‌కు వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. బంగ్లాదేశ్‌లో 2024 ఆగస్టులో విద్యార్థుల ఉద్యమంతో పాటు షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూలదోసిన తర్వాత యూనుస్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా బాధ్యతలు స్వీకరించి 18 నెలల పాటు దేశాన్ని నడిపించారు. విజయవంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు కృషి చేసి చాలా శాంతియుత పద్ధతులలో ప్రజాస్వామ్య ప్రభుత్వానికి అధికారాన్ని బదలాయించడానికి తన వంతు బాధ్యతను సక్రమంగా నిర్వహించారు. తనతరువాత దేశాభివృద్ధిని విధించుకున్న యూనుస్ నోబెల్ బహుమతి పొందారు. తర్వాత ఆగస్టులో దేశానికి తిరిగి వచ్చి అధికార బాధ్యతలు చేపట్టారు.

## ప్రతీకార రాజకీయాలకు తావులేదు

**ఢాకా :** దేశంలో కొత్తగా ఎన్నికైన 13వ పార్లమెంటులో వివిధ పార్టీల తరపున ఎన్నికైన ఎంపీలు భిన్నాభిప్రాయం వ్యక్తం చేస్తున్నప్పటికీ దేశ ప్రయోజనాల రీత్యా సామరస్యమే ప్రధానాంశమని ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తారిఖ్ రెహమాన్ అన్నారు. దేశంలో ప్రతీకార రాజకీయాలకు తావులేదని, రాజకీయ దాడులను ప్రభుత్వం సహించబోదని ఆయన హెచ్చరిక చేశారు. భిన్నాభిప్రాయాలున్నాగానీ రాజకీయపార్టీలన్నీ జాతీయ ఐక్యతకు, సామరస్యానికి కట్టుబడాలని, దేశానికి అదే ఆయువుపట్టు వంటిదని పిలుపు ఇచ్చారు.

## నేపాల్‌లో మార్చి 5న ఎన్నికలు

### 15 రోజులు జోరుగా ఎన్నికల ప్రచారం

**కాఠ్మండు :** జెన్‌జెడ్ ఉద్యమం తర్వాత తాత్కాలిక ప్రభుత్వం సారథ్యంలో మార్చి ఐదో తేదీన నేపాల్ పార్లమెంటుకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల నిమిత్తం అధికారికంగా 15 రోజులపాటు నిర్వహించే ప్రచారం సోమవారం ప్రారంభమైంది. పలు పార్టీలు జోరుగా ప్రచార కార్యక్రమాల్లో తలమునకలై ఉన్నాయి. దేశ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీల కర్కి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. భద్రతా ఏర్పాట్ల గురించి చర్చించారు. మరో 15 రోజుల్లో నేపాల్‌లో పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి. దిగువసభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)కు ఎన్నికల ప్రచారం నిమిత్తం ఈనెల 16 నుండి మార్చినెల 2 వ తేదీ వరకూ మాత్రమే ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, ఈ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేస్తామని రాజకీయపార్టీలకు ఎన్నికల సంఘం తెలియజేసింది.

# క్యూబాకు స్పెయిన్ మానవతా సహాయం

## పలు దేశాల మద్దతు






**మాడ్రిడ్ :** అమెరికా ఆంక్షల కారణంగా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న క్యూబా దేశానికి స్పెయిన్ ఆర్థిక సహాయాన్ని పంపిస్తోంది. అనేక దేశాలు క్యూబాకు మద్దతు ఇస్తూ సహాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ద్వారా ఈ ఆర్థిక సహాయం పంపిస్తున్నట్లు స్పెయిన్ ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా విధించిన ఇంధన దిగ్బంధనం కారణంగా క్యూబా కొద్ది రోజులుగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. క్యూబా విదేశీమంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ మాడ్రిడ్ వెళ్ళి స్పెయిన్ విదేశీమంత్రి జో మాన్యువల్ ఆల్బారెస్‌తో సమావేశమై అత్యవసర పరిస్థితిపై చర్చించారు. రెండు దేశాలమధ్యా ఆర్థిక సహకార విస్తృతిపై చర్చించారు. తర్వాత క్యూబాకు ఆహార ఉత్పత్తులు, ఆరోగ్య ఉత్పత్తులు, ఔషధాలను ఐక్యరాజ్యసమితి ద్వారా పంపుతామని స్పెయిన్ ప్రకటించింది. గతవారంలో మెక్సికో దేశం కూడా మానవతా సహాయం పంపింది. రెండు మెక్సికో నౌకల ద్వారా 800 టన్నుల ఆహారం, మానవతా సహాయాన్ని క్యూబాకు మెక్సికోదేశం పంపించింది. కరీబియన్ దేశం క్యూబాను ఆర్థికంగా ఉక్కిరి బిక్కిరి చేయడం ద్వారా ఆ దేశాన్ని తనకు అనుకూలంగా లొంగదీసుకోవాలని ట్రంప్ చేస్తున్న ఆంక్షల నాటకాన్ని ఆ దేశ నాయకత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. అనేక దశాబ్దాలుగా ఏదోఒక రూపేణా ఆంక్షల్లో నలిగిపోతున్న క్యూబా దేశ ప్రజలు ఐక్యంగా ఉంటూ తమను తాము కాపాడుకోగలరని ఇటీవలనే దేశాధ్యక్షుడు కానెల్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గతనెలారంభంలో వెనిజులా దేశాధ్యక్షుడి నివాసంపై దాడిచేసి నికొలస్ మదురో, అతడి సతీమణిని కిడ్నాప్ చేసి తీసుకుపోయిన తర్వాత వెనిజులా నుండి క్యూబాకు చమురు రవాణా, ఇతర ఆహార వస్తువుల రవాణా నిలిచిపోయింది. ఇప్పటి వరకూ క్యూబాకు వెనిజులా దేశమే ప్రధాన చమురు సరఫరాదారుగా ఉంది.

**ట్రంప్ ఆంక్షల వల్ల అపాయంలో 32వేల మంది గర్భవతులు :** ట్రంప్ విధించిన ఆర్థిక, చమురు ఆంక్షల కారణంగా క్యూబాలో 32,880 మంది గర్భవతులు అపాయంలో పడ్డారు. వారికి తక్షణం ఔషధాలు, ఆరోగ్య సదుపాయాలు అవసరమయ్యాయి. దీంతోపాటు కొత్తగా జన్మించిన బిడ్డలకు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు, మైనర్లకు, డయాబెటిక్‌వ్యాధిగ్రస్తులకు అత్యవసర చికిత్సలు, ఔషధాలు అవసరం అయ్యాయి. క్యూబా ప్రజారోగ్యమంత్రిత్వశాఖ మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. కరోనా మహమ్మారి తర్వాత ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం ఇదే మొదటిసారి. గర్భవతులకు సమయానుగుణంగా డయాగ్నోసిస్ ప్రక్రియలు చేపట్టాల్సి ఉంది. ట్రంప్ ప్రారంభించిన ఆర్థిక ఆంక్షల యుద్ధం వల్ల ప్రజలపై ప్రత్యక్షంగా తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంధన కొరతవల్ల ప్రాధాన్యత రంగాల పనితీరు దెబ్బతింది. ఆరోగ్య రంగం సమస్యల్లో పడింది. సమయానుకూలంగా పిల్లలకు అందించాల్సిన వాక్సినేషన్ మెటీరియల్ కూడా లభ్యం కావడం లేదు. దీనివల్ల ఏడాదిలోపు వయసుగల 61,830 మంది పిల్లలు అపాయంలో పడ్డారు. పలు దేశాల నుండి వాణిజ్య విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనివల్ల కీలకమైన ఉత్పత్తుల రవాణి క్యూబాకు నిలిచిపోయింది.

**ఆఫ్రికన్ దేశాధినేతలకు క్యూబా కృతజ్ఞతలు :** ఆఫ్రికన్ దేశాధినేతలకు క్యూబా కృతజ్ఞతలు తెలియజేసింది. కరీబియన్ దీవి క్యూబాను ఉగ్రవాదుల జాబితాలో చేర్చి, ఆంక్షలు విధించడాన్ని ఖండిస్తూ ఆఫ్రికన్ దేశాల యూనియన్ ఒక తీర్మానం చేయడంపై క్యూబా కమ్యూనిస్టు పార్టీ మొదటి ప్రధాన కార్యదర్శి–దేశాధ్యక్షుడు మిగ్యుల్ డియాస్ కానెల్ బెర్ముడెజ్ ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా మంగళవారం ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. క్యూబా ప్రజలకు ఊపిరి ఆడనీయకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తూ అమెరికా ఆంక్షలు విధించినప్పటికీ తమ ప్రజలు ఎంతో మనోధైర్యంతో పోరాడుతున్నారు'' అని ఆఫ్రికన్ యూనియన్ చేసిన తీర్మానానికి ప్రతిగా కానెల్ తన సందేశంలో పేర్కొన్నారు. క్యూబా విదేశీ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ పారెల్లా కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. అమెరికా వైఖరిని ఖండిస్తూ క్యూబాకు అనుకూలంగా తీర్మానాలు చేసింది. అదేవిధంగా క్యూబా ప్రభుత్వమే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందంటూ అమెరికా చేసిన ఆరోపణలను ఖండిస్తూ ఇప్పటికి వరుసగా మూడుసార్లు ఆఫ్రికన్ యూనియన్ తీర్మానాలు చేసింది. అమెరికా విధించిన ఆంక్షలవల్ల క్యూబా వస్తున్న తీవ్ర పరిణామాలపట్ల ఇథియోపియా, ఆఫ్రికా యూనియన్ దేశాల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని క్యూబా దౌత్యకార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

# 200 కేజీలకు పైగా అనుమానిత రసాయనాలు స్వాధీనం

**అహ్మదాబాద్ :** గుజరాత్‌లో ఇద్దరు ఇరానీయన్ల నుంచి 200 కేజీలకు పైగా అనుమానిత రసాయనాలను ఎటిఎస్ అధికారులు, కోస్ట్ గార్డ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు . వారు సోమవారం రాత్రి పోరుబందర్ తీరానికి 140 నాటికల్ మైళ్ల దూరంలో అనుమానిత బోటును అడ్డుకున్నారు. బోటులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 203 రసాయన పొట్లాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇరాన్ కు చెందినవారిగా గుర్తించామని అధికారులు అన్నారు . నిందితుల నుంచి అనుమానిత రసాయన పౌడర్ తో పాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించామని అన్నారు. తమకు తెలిసిన సమాచారం ప్రకారం రసాయన పొట్లాలు పంజాబ్ కు చెందిన వ్యక్తి నుంచి స్వీకరించినట్లు, తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.



## అమెరికా పౌరహక్కుల నాయకుడు జెస్సీ జాక్సన్ కన్నుమూత



**చికాగో :** అమెరికా పౌరహక్కుల నాయకుడు జెస్సీజాక్సన్ కన్నుమూశారు. ఆయన వయసు 84 సంవత్సరాలు. మార్టిన్ లూథరిన్ కింగ్ జూనియర్‌తో కలిసి 1960వ దశకంలో పౌరహక్కుల కోసం జాక్సన్ గొప్ప పోరాటాలు చేశారు. పశ్చిమదేశాల దిగ్బంధనం నుండి సద్దాం హుస్సేన్‌ను విడుదల చేయాలని పోరాడారు.1984లో ఒకసారి, 1988లో ఒకసారి డెమొక్రటిక్‌పార్టీ తరపున దేశాధ్యక్ష పదవికి ఆయన పోటీ చేశారు. ఆఫ్రికన్–అమెరికన్ పౌరుల జీవితాలను దేశంలో మెరుగుపరచేందుకు రాజకీయపోరాటాలు చేశారు. వారి జీవితాలను మెరుగుపరిచారు. 2025 మే 25న పోలీసులు జాతి వివక్ష చూపించి అత్యంత క్రూరంగా జార్జ్ ఫ్లాయడ్‌ను గొంతు నొక్కి చంపేసిన తర్వాత వేలాదిమంది ఉద్యమించారు. ఆయన మరణవార్త తెలియగానే జెస్సీ జాక్సన్ మిన్నెపొలిస్‌కు వెళ్ళి జార్జ్‌ఫ్లాయడ్‌కు న్యాయం చేయాలని కోరుతూ పోరాటాలలో పాల్గొన్నారు. జాక్సన్ మరణవార్త తెలియగానే మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ కుమార్తె బెర్నైస్ కింగ్ తీవ్ర సంతాపం తెలియజేశారు. ఆయన గొప్ప మానవహక్కుల యోదుడని, మానవహక్కులకోసం కట్టుబడిన మధ్యవర్తి అని ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ఆయనకు పార్కిన్‌సన్ వ్యాధి సోకింది. ఇల్లినోయిస్‌లోని చికాగో నగరంలో మంగళవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులు చుట్టూ కూర్చుని ఉన్న సమయంలో ప్రశాంత వాతావరణం మధ్య ఆయన అంతిమశ్వాస విడిచారు. కుటుంబ సభ్యులు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టం,న్యాయం, సమానత్వం, సమాన హక్కులుకోసం ఆయన మడమతిప్పని పోరాటం చేశారు. అణగారినవర్గాలు, నోరుమెదపి మాట్లాడలేని అమాయకులైన జనానికి గొంతుకగా నిలిచి ఆయన పోరాటం చేశారని, అణగారిన వర్గాలకు గొప్ప సేవలు చేశారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి మరణశిక్ష? : రేపు వెలువడనున్న తీర్పు



**సియోల్:** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుఖ్‌యోల్‌కు మరణశిక్ష విధించాలని ప్రాసిక్యూటర్లు డిమాండ్ చేశారు. ఆయనకు ఎలాంటి తీర్పు విధిస్తారనే విషయం గురువారంనాడే తేలిపోతుంది. సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టురూము 417లో ఆయన మరో రెండు రోజుల్లో దోషిగా నిలబడి తీర్పుకోసం ఎదురుచూస్తారు. మూడు దశాబ్దాల క్రితం ఇదే కోర్టు గదిలో సైనిక నియంత ఛున్ దూ హ్వాన్‌కు న్యాయస్థానం మరణశిక్ష విధించింది.

తర్వాత ఆయనకు క్షమాభిక్ష లభించింది. దక్షిణ కొరియాలో 1997 నుండి ఇప్పటివరకూ ఉరిశిక్షలు అమలు చేయలేదు. ప్రజలు ఎంతో ఆసక్తిగా ఈ తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. దేశంలో ఆకస్మికంగా మార్షల్ లా విధించి, ప్రతిపక్షాలను అణచివేయాలని కుట్రపూరిత ఆలోచనలు చేసిన యోల్ ఆ తర్వాత కొద్దిగంటల్లోనే వెనక్కు తగ్గారు. చివరకు దేశాధ్యక్ష పదవి పోగొట్టుకుని జైలులో మగ్గుతున్నారు. గతంలో ఇలాంటి కేసులు అనేక సంవత్సరాల తరబడి కూడా తేలలేదు. కానీ ఇప్పుడు ఈ కేసులో న్యాయస్థానం మాత్రం కేవలం 14 నెలల కాలంలోనే విచారణ పూర్తిచేసింది.

## కాంగ్రెస్‌కు మరో ఏడు పీఠాలు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ దక్కించుకుంది.కాగజ్‌నగర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ చెందిన షాహిన్ సుల్తానా ఎన్నికయ్యారు. డోర్నకల్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. మున్సిపల్ చైర్ పర్సన్‌గా కొండేటి రాజకుమారి, వైఎస్ చైర్ పర్సన్‌గా మాద లావణ్యను ఎన్నికున్నారు.

**జనగామ, తొర్రూర్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ఉత్కంఠ మధ్య జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. రెండుచోట్ల బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బలాబలాలు సమానంగా ఉన్నాయి. దీంతో అధికారులు లాటరీ తీశారు. లాటరీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్మన్ అభ్యర్థుల పేర్లు రావడంతో ఆ రెండు మున్సిపాలిటీలూ కాంగ్రెస్ ఖాతాలో పడ్డా యి. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సుల్తానాబాద్ మున్సిపాలిటీ చైర్మన్‌గా బిరుదు కృష్ణ, వైస్ చైర్‌పర్సన్‌గా పుష్పలత ఎన్నికయ్యారు. జహీరాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ దక్కించుకుంది. చైర్మన్‌గా యూనుస్ ఎన్నికయ్యారు. ముగ్గురు స్వతంత్రులు, ఇద్దరు ఎంఐఎం సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎంపి సురేష్ షెట్కార్ ఓటు వేశారు. ఇంద్రేశం మున్సిపాలిటీని మాత్రం బిఆర్‌ఎస్ దక్కించుకుంది. చైర్‌పర్సన్‌గా కె. ప్రమీల, వైస్ చైర్మన్‌గా హరీశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.

క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక వాయిదా పడింది.ఇరువర్గాల గొడవతో ప్రత్యేకాధికారి సతీష్ కుమార్ ఎన్నిక వాయిదా వేశారు. కోరం వచ్చినా అధికారులు ఎన్నిక నిర్వహింలేదు. ఎన్నిక చేపట్టాలని బిఆర్‌ఎస్ (10), సిపిఐ (4) సభ్యుల డిమాండ్ చేశారు. మంత్రి వివేక్, ఎంపి వంశీ పార్టీ అభ్యర్థులతో కలిసి బయటకు వెళ్లారు. ఎన్నికల గదిలో బిఆర్‌ఎస్ సభ్యులు తమపై దురుసుగా ప్రవర్తించారని వివేక్ ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించారని బిఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. ప్రమాణ స్వీకారం తర్వాత అధికారులు కావాలని 10 నిమిషాలు విరామం ఇచ్చారని, తమని కిడ్నాప్ చేయాలని కాంగ్రెస్ పథకం వేసిందని ఆరోపించారు. ఎన్నిక జరిగే సమావేశం మంత్రి వివేక్ ప్రసంగించడానికి అధికారులు అవకాశం ఇచ్చారని, బిఆర్‌ఎస్, సిపిఐ బలాన్ని చూసి వివేక్ జీర్ణించుకోలేక పోయారని విమర్శించారు. సజావుగా జరపాల్సిన ఎన్నికలను ఉద్దేశ్యపూర్వకంగానే వాయిదా వేశారని అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోనూ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు వాయి దా పడ్డాయి. రెండో రోజు కోరం లేకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఎస్ఇసి వాయిదా వేసింది. ఎన్నిక పై హైకోర్టు నుంచి స్టే రావడంతో అధికారులు వాయిదా వేశారు. 19 వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కౌన్సిలర్ యాదగిరి కుమారుడు కిడ్నాప్‌పై హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. గురువారంలోపు యాదగిరిని తమ ఎదుట హాజరుపర్చాలని హైకోర్టు ఆదేశించింది. అనూహ్యంగా ఉదయం బిఆర్‌ఎస్ క్యాంపులో కౌన్సిల్ ఎన్నికకు యాదగిరి హాజరయ్యారు. చైర్మన్ ఎన్నిక పూర్తయిన తర్వాత అధికారులకు కోర్టు ఆదేశాలు అందాయి. స్టే కారణంగా బిఆర్‌ఎస్ చైర్మన్ అభ్యర్థికి ధ్రువీకరణపత్రం ఇవ్వలేదు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బిఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన చేశాయి.

**2వ రోజు ఎన్నికలు పూర్తయిన మున్సిపాలిటీలు**

| | | |
|---|---|---|
| యెల్లందు | – | కాంగ్రెస్ |
| సుల్తానాబాద్ | – | కాంగ్రెస్ |
| కాగజ్ నగర్ | – | కాంగ్రెస్ |
| జహీరాబాద్ | – | కాంగ్రెస్ |
| ఇంద్రేశం | – | బిఆర్‌ఎస్ |
| దోర్నకల్ | – | కాంగ్రెస్ |
| తొర్రూర్ | – | కాంగ్రెస్ |
| జనగామ | – | కాంగ్రెస్ |

**కన్నీళ్లు పెట్టుకున్న ఎర్రబెల్లి :** తొర్రూర్ మున్సిపాలిటీ కోల్పోవడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఉద్రిక్తత తలెత్తడంతో దయాకర్ రావును నర్సింహుల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తానేం సమాధానం చెప్పాలని కన్నీళ్లు పెట్టుకున్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పని చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల మధ్య ఘర్షణ కారణంగా ఎన్నిక వాయిదా వేసినట్లురిటర్నింగ్ అధికారి సతీష్ ప్రకటించారు. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రంలోని పురపాలిక సంఘాల్లో 116 పురపాలక సంఘాల చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. సోమవారం ఎన్నిక జరిగిన 105 మున్సిపాలిటీల్లో 81 కాంగ్రెస్ పార్టీ దక్కాయి. బిఆర్‌ఎస్ 18 చోట్ల, బిజెపి ఒక చోట (నారాయణపేట) గెలిచాయి. నాలుగు చోట్ల స్వతంత్రులు (ఆదిలాబాద్, భైంసా, మహబూబాబాద్, జమ్మికుంట) చైర్మన్ స్థానాలు దక్కించుకొంటే, మరోచోట ఫార్వర్డ్‌బ్లాక్ కైవసం చేసుకొంది.

## తారిఖ్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన తొలి సమావేశంలో తారిఖ్ రెహ్మాన్ పార్లమెంటరీ పార్టీ నాయకుడుగా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు మరో 25 మంది ఎంపీలు పూర్తిస్థాయి మంత్రులుగా, 24 మంది సహాయమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇంకా వీరికి శాఖలు కేటాయించలేదు. కాగా సచివాలయం వద్ద కొత్తగా ఎన్నికైన మంత్రులు, సహాయ మంత్రులకోసం 45 టయోటా కాన్రీ, మిత్సుబి లాన్సర్ వాహనాలను సిద్ధంగా ఉంచారు. భారత్ నుండి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సారథ్యా న ప్రతినిధిబృందంతోపాటు పలువురు ప్రపంచ నాయకు ల సమక్షంలో ఈ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు,భూటాన్ ప్రధానమంత్రి షెరింగ్ తోబ్గే,నేపాల్, శ్రీలంక విదేశీమంత్రులతోపాటు అనేక దేశాలకు చెందిన హైకమీషనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రు.

పూర్తిస్థాయి మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినవారిలో 23 మంది గెలిచిన ఎంపీలు కాగా, మరో ఇద్దరు టెక్రోక్రాట్లు (వృత్తినిపుణులు) ఉన్నారు. తారిఖ్ రెహ్మాన్ తర్వాతిస్థానాలలో మీర్జా ఫక్రుల్ ఇస్లామ్, సలావుద్దీన్ అహ్మద్, అమీర్ ఖుస్రు మహమూద్ చౌదరి, ఇగ్బాల్ హసన్ మహమూద్ తుకు, మేజర్ (రిటైర్డ్) హాఫీజ్ ఉద్దీన్ అహ్మద్, డాక్టర్ ఎజెడ్‌ఎం జాహిద్ హుస్సేన్, డాక్టర్ ఖలీలూర్ రెహమాన్, అబ్దుల్ అవల్ మింటూ, మొఫజల్ హుస్సేన్ కైకోబాద్, మిజానూర్ రెహమాన్ మినూ, నితాయ్ రాయ్ చౌదరి, ఖండాకర్ అబ్దుల్ ముక్తాదిర్, అరిఫుల్ హక్ చౌదరి తదితరు లు 25 మంది క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బిఎన్‌పి ఎంపీలు ప్రతిపాదిత రాజ్యాంగ సంస్కరణల మండలికి అనుగుణంగా ప్రమాణ స్వీకారం చేసేందుకు తిరస్కరించారు. ఇంకా అలాంటి రాజ్యాంగ సంస్కరణ మండలి ఏర్పడలేదని, అందువల్ల ప్రమాణస్వీకారం అందు కు అనుగుణంగా చేయాల్సిన అవసరం లేదని బిఎన్ పి ఎంపీలు స్పష్టం చేశారు. ఎన్నికలతో పాటు దేశంలో జులై ఛార్టర్‌పై కూడా ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ మేరకు రాజ్యాంగానికి సంస్కరణలను తీసుకురావాల్సి ఉంది.

**జతియా సంసద్ ఎంపీలుగా ప్రమాణ స్వీకారాలు**

అంతకుముందు దేశ పార్లమెంటు ''జతియా సంసద్'' ప్రమాణ స్వీకారోత్సవ హాలులో ఉదయం 10.43 గంటలకు పార్లమెంటుకు ఎన్నికైన మొత్తం 297 మంది అధికార–ప్రతిపక్ష సభ్యులు ఎంపీలుగా ప్రమాణ స్వీకారాలు చేశారు. బిఎన్‌పి సభ్యులు మినహా మిగిలిన వారు ఎంపీలుగా మొదట ప్రమాణస్వీకారం చేసి ఆ తర్వాత రాజ్యాంగ సంస్కరణ మండలి సభుయలుగా కూడా ప్రమాణస్వీకారం చేశారు. పార్లమెంటులో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు ఖాళీగా ఉన్నందువల్ల రాజ్యాంగానికి అనుగుణంగా ఎన్నికల సంఘం అధికారి ఎఎంఎం నాసిర్ ఉద్దీన్ సభ్యులందరితో ఎంపీలుగా ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. అధికారపార్టీ బిఎన్‌పికి చెందిన 209 మంది ముందుగా ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతిపక్షంలో జమాత్–ఎ–ఇస్లామ్ తరపున 68 మంది ఆయన కూటమిలోని 11 పార్టీలకు చెందిన మరో 12 మంది ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత మధ్యాహ్నం 13వ పార్లమెంటులో కొత్త మంత్రివర్గం ప్రమాణ స్వీకారాలు చేసింది. నేషనల్ సిటిజన్స్ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా బిఎన్‌పి స్థాయిసంఘ కమిటీ సభ్యుడు సలావుద్దీన్ అహ్మద్ మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం ఎవరూ రాజ్యాంగ సంస్కరణ మండలి సభ్యులుగా ఎన్నిక కాలేదని, అలాంటి సంస్కరణ మండలి ప్రస్తుతం లేదని, ఇంకా ఏర్పడలేదని, అందువల్ల తామెవ్వరం ఆ మండలి సభ్యులుగా ఎన్నిక కాలేదని వివరణ ఇచ్చారు. దేశంలో సార్వత్రిక ఎన్నికలతోపాటు రాజ్యాంగానికి సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ దేశ ప్రజలు రిఫరెండం (జులై ఛార్టర్)పై కూడా అనుకూల ఓటు వేశారు. ఈ రిఫరెండం ప్రకారం దేశంలో రాజ్యాంగ సంస్కరణలు కూడా ఇంకా తదుపరి రోజుల్లో ప్రవేశపెట్టాల్సి ఉంది.

**ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న స్పీకర్ ఓంబిర్లా బృందం**

సరికొత్తగా ప్రజాస్వామ్య ప్రయాణం ప్రారంభించిన బంగ్లాదేశ్‌లో 13వ పార్లమెంటు ప్రమాణ స్వీకారోత్సవ కీలక ఘట్టంలో పాల్గొనేందుకు భారత దిగువసభ స్పీకర్ ఓంబిర్లాతో కూడిన బృందం మంగళవారం ఉదయం ఢాకా చేరుకుంది. ఆయనతోపాటు విదేశీమంత్రిత్వశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రితోపాటు పలువురు ఇతర ఉన్నతాధికారులతో కూడిన బృందం భారత వైమానికదళ ప్రత్యేక విమానంలో బయలుదేరి ఢాకాలోని బంగ్లాదేశ్ వైమానికదళ కేంద్రంలో దిగారు. బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల కార్యదర్శి డాక్టర్ నజ్రుల్ ఇస్లామ్, బంగ్లాదేశ్‌లో భారత హైకమీషనర్ ప్రణయ్ వర్మ, భారత్‌లో బంగ్లాదేశ్ హైకమీషనర్ రియాజ్ హమీదుల్లా తదితరులు భారత ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. తర్వాత వారంతా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు దేశాలమధ్యా, ప్రజలమధ్య ఉన్న లోతైన సంబంధాలకు, ప్రజస్వామ్యంపట్ల భారత్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఇది తార్కాణమని ఈ సందర్భంగా భారత విదేశీ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. మొదట తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనుస్ భారత ప్రధాన మంత్రి మోదీని ప్రమాణ స్వీకారోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. మోదీ బదులుగా ఓంబిర్లా బృందం ఈ ఉత్సవంలో పాల్గొంది.

## క్రీడల్లో రాణించడం అభినందనీయం

### ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు క్రికెట్, వాలీబాల్, ఇతర క్రీడల్లో రాణించి బహుమతులను అందుకోవడం అభినందనీయమని, క్రీడల్లో మరింతగా రాణించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ అన్నారు. టిఎన్‌జిఒలు నిర్వహించిన క్రీడల్లో బహుమతులు అందుకున్న క్రీడాకారులను మంగళవారం తన చాంబర్లో కమిషనర్ అభినందించారు.



హైదరాబాద్ టిఎన్‌జిఒల అధ్వర్యంలో 28 శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన వివిధ రకాల క్రీడల్లో ఎక్సైజ్శాఖకు క్రికెట్, వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతులు సాధించారు. మహిళలు ఉద్యోగులుల కూడ టంగఅఫ్వార్, షటిల్, క్యారమ్స్ పోటీల్లో రిణించారు. క్రికెట్ కెప్టెన్ శ్రీకాంత్, వాల్బా ల్ కెప్టెన్ రవి, కోచ్ మూర్తితోపాటు టీఎన్జీవోస్ సంఘం నాయకులు కమిషనర్ కలిసి సాధించిన కప్పులను చూపించారు. కమిషనర్ కమిసిన వారిలో టీఎన్జీవోస్ యూనియన్ ఎక్సైజ్ శాఖ అధ్యక్షుడు మహ్మమద్ నహీమొద్దీన్, ప్రధాన కార్యదర్శి కమలాకర్రావు, ఉపాధ్యక్షుడు బిఎల్ సంతోష్, కోశాధికారి ఎస్ ఎల్ ఎన్ చారీ, మహేశ్వర్రావు జాయింట్ సెక్రటరీలు, క్రీడాకారులు ఉన్నా రు.

## తీర్చిదిద్దుదాం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే గ్లోబల్ కేపబిలి టీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా మారిన హైదరాబాద్ ను ఇప్పుడు అందరం కలిసి సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదామని సిఎం కోరారు. హైదరాబాద్ హైటెక్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన 23వ బయో ఏషి యా–2026 అంతర్జాతీయ సదస్సును మంగళవారం సిఎం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ప్రధానంగా 'టెక్ బయో అన్‌లీష్డ్ ఎఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రపంచస్థాయి సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుంచి ప్రపంచ జీవవైజ్ఞానిక రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతుందని, తెలంగాణ ఎదుగుతోందని, ఈ ఎదుగుదలలో భాగస్వాములు కావాలని సిఎం పిలుపునిచ్చారు.

'జీవవైజ్ఞానిక రంగంలో ప్రస్తుతం వస్తున్న ఆధునిక మార్పులను గమనిస్తే, పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం ఉంది. వివిధ సంస్థలు, కార్పొరేట్లు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. ఆ వాతావరణాన్ని తెలంగాణ అందిస్తుంది. అందుకు హైదరాబాద్ అనుకూలమైనది. బల్క్‌డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచస్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. 'తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి. జిసిసిలను స్థాపించండి. ఆవిష్కరణ కేంద్రాలను నిర్మించండి. మాలిక్యూల్స్, ఔషధాల డిజైన్, క్లినికల్ అనలిటిక్స్‌ను ప్రారంభించండి. ఎఐ ప్లాట్ ఫామ్‌లను, డిజిటల్ తయారీ రంగాలను ముందుకు తీసుకెళ్లండి. అందుకు ప్రభుత్వం, యంత్రాంగం, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయంలో భాగస్వాములుగా ఉంటారు' అని సిఎం అన్నారు. దూరదృష్టి కలిగిన నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలు ఉండటం వల్ల హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు, పరిశోధన, డిజైన్ రంగాల్లో ప్రపంచ కేంద్రంగా ఎదిగిందన్నారు.

తెలంగాణలో గడిచిన రెండేళ్లలో జీవవిజ్ఞాన రంగంలో రూ.73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని, ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా తెలంగాణ నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించామని, జినోమ్ వ్యాలీని విస్తరించామని, అలాగే, ప్రపంచ స్థాయి పరిశోధనలు, ఆవిష్కరణల కోసం వన్‌బయోను ప్రారంభించామని సిఎం చెప్పారు. గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేస్తూ అనేక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని, ఒక బలమైన సంకల్పంతో ఈ పురోగతిని సాధించామని, అందుకు ప్రత్యక్ష నిదర్శనమే బయోఏషియా 2026 సదస్సు నిరద్శనమన్నారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్‌కి జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు2026 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. బయో ఏషియా సదస్సు%2026 సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటి శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ లైఫ్ సైన్సెస్ రంగంలో గ్లోబల్ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిగ్యూటివ్‌లతో భేటీ అయ్యారు.

**ఫ్యూచర్ సిటీలో జిసిసిలకు ఒక ప్రత్యేక జోన్**

ఫ్యూచర్ సిటీలో జిసిసిల కోసం ఒక ప్రత్యేక జోన్‌ను నిర్మించాలని సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులు, కంపెనీలు పెట్టాలని యోచించే గ్లోబల్ ఇన్వెస్టర్లకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. హైదరాబాద్ మహానగరంలో ఇప్పటికే ఎన్నో లైఫ్ సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జిసిసి) లను ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. ఇదే విషయమై మరింత లోతుగా దృష్టి సారించడానికి, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఇన్నోవేషన్ సెంటర్లను సులభతరం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ప్రకటించిన పెట్టుబడుల వివరాలు:** ఫ్రాన్స్‌లో తన ప్రపంచ ప్రధాన కార్యాలయంతో సనోఫీ నుండి విడిపోయిన గ్లోబల్ కన్స్యూమర్ హెల్త్ కేర్ కంపెనీ అయిన ఒపెల్లా హెల్త్ కేర్, దాని జిసిసి కార్యకలాపాలను 42, 000 చదరపు అడుగుల సౌకర్యంతో విస్తరిస్తోంది. వచ్చే ఏడాదిలోపు 500 ఉద్యోగాలను ఈ కంపెనీలను సృష్టించనుంది. జిపిఎఫ్ఎ ఇండోనేషియా విభాగమైన వాక్సిండో యానిమల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్, జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక బిఎస్‌ఎల్3 వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం కోళ్లు, పశువులు, స్వైన్. ఆక్వాకల్చర్ కోసం వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయడంపై దృష్టి పెడుతుంది. ఎఐ, డేటా సైన్స్ కంపెనీగా పేరొందిన ట్రిడెన్స్ ఐఎన్సీ, ఏఐఆధారిత హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ పై కీలక సేవలు అందించిన సంస్థ, తన హైదరాబాద్ కార్యకలాపాలను నిర్వహించాలని ప్రకటించింది. ఈ కేంద్రం సుమారు 18,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండ గా, దీనిలో ప్రపంచ స్థాయి కార్యకలాపాలను నిర్వహించ తలపెడుతున్నది. దీంతో ఎఐ ఆధారిత హెల్త్ కేర్ రంగం లో మరింత అత్యాధునికత రానుంది. భారతదేశ లైఫ్ సైన్సెస్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆర్‌ఎక్స్ ప్రొపెల్లెంట్ హైదరాబాద్ లోని జీనోమ్ వ్యాలీలో భారీ స్థాయిలో ఫార్మాట్ లైఫ్ సైన్సెస్ క్యాంపస్‌ను అభివృద్ధి చేస్తుంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 12 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న 1 మిలియన్ చదరపు అడుగుల అడ్వాన్స్డ్ ల్యాబ్, మౌలిక సదుపాయాలను కలిగి ఉంటుంది. ఇది రానున్న ఆరేళ్లలో మరింత విస్తృతం కానున్నదని బయో ఏషియా సమావేశంలో చర్చించినట్లు సదస్సు నిర్వాహకులు తెలిపారు.


సిపిఐ అగ్రనాయకులు దివంగత కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ సతీమణి నల్లమల కమలాదేవి (87 సంవత్సరాలు) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆమె కుమార్తెలు వనశ్రీ, జయశ్రీలను, వారి కుటుంబ సభ్యులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు.

# వాయిదా పడిన క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక

### కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం.. పోలీసుల లాఠీఛార్జ్

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీలో మంగళవారం నిర్వహించాల్సిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. బిఆర్ఎస్, సిపిఐ, కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య నెలకొన్న తీవ్ర వాగ్వాదంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సభాహాల్‌లో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ తోపులాటకు దిగడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎన్నిక ప్రక్రియలో సభ్యుల మధ్య గందరగోళం నెలకొనడంతో అధికారులు ఎన్నికను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్, సిపిఐ బలపరిచిన అభ్యర్థి మిట్టపల్లి సరిత మాట్లాడుతూ తమకు తగినంత బలం ఉన్నప్పటికీ కాంగ్రెస్ కౌన్సిలర్లు తమపై దౌర్జన్యానికి దిగారని, అధికారులే కావాలని ఎన్నికను వాయిదా వేశారని ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర



కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాల్సిన ఎన్నికలను అడ్డుకోవడం అన్యాయమన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలకు పాల్పడితే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఇరు వర్గాల ఘర్షణతో మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొనడంతో భారీగా పోలీసులను మోహరించారు. తదుపరి ఎన్నిక తేదీని అధికారులు ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, సిపిఐ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

### విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించం
### ప్రకటనల ఆదాయం పెంపుపై కసరత్తు చేయాలి
### పురపాలక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తాను స్వయంగా ప్రక్షాళన పరిస్థితులను పరిశీలించేందుకు వస్తానని తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు ప్రతిరోజూ తెల్లవారుజామున 6 గంటలకు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. ప్రకటనల ద్వారా నగరానికి వచ్చే ఆదాయాన్ని పెంచే దిశగా సమగ్ర విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. నగరంలోని కూడళ్లలో, ప్రధాన ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేసి, వాటిపై ఎలక్ట్రిక్ కేబుళ్లు, సిసి కెమెరాలు, ప్రకటన బోర్డులను సమన్వయంతో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

**ప్రకటనల బోర్డుల ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలి..**

ప్రైవేట్ భూముల్లో మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. నెక్లెస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో కూడా మల్టీలెవల్ పార్కింగ్ సాధ్యతను పరిశీలించాలని తెలిపారు. ప్రకటన బోర్డులు విస్తృతంగా కనిపిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంపై సిఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూరు నగరాల్లో ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని పోల్చి విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే ప్రకటనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, సంక్షేమ కార్యక్రమాల ప్రకటనలకు కనీసం 10 శాతం బోర్డులు కేటాయించాలని సూచించారు. పిపిపి నమూనా సహా ఇతర మార్గాల ద్వారా ఆదాయం పెంపుపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా, సిఎం పలు సలహాలు ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణలో యూనికోడ్ సిస్టమ్ అమలు చేయాలని ఆదేశించారు. మూడు నగర పాలక సంస్థల పరిధిలోని పార్కుల వివరాలు సేకరించి వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**నూతన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్‌లు, డిప్యూటీ చైర్మన్‌లకు శిక్షణ..**

రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్‌లు, డిప్యూటీ చైర్మన్‌లతో త్వరలోనే ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. తాను కూడా సమావేశానికి హాజరై నూతన ప్రతినిధులతో మాట్లాడతానని సిఎం తెలిపారు. ఈ సమావేశంలో సిఎం సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరికమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ముగిసిన ఎన్నికల కోడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు నిర్వహించిన రెండవ సాధారణ ఎన్నికల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో సంబంధిత మున్సిపల్ ప్రాంతాల్లో అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసినట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ ఎన్నికలకు సంబంధించి గత నెల 27వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఆయా పట్టణ ప్రాంతాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, పరిపాలనాపరమైన నిర్ణయాలు ఇకపై యథావిధిగా కొనసాగనున్నాయి.

### ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ కేంద్రంగా

# తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన బయో ఆసియా–2026 సదస్సు సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ,సదస్సులో పారిశ్రామిక వేత్తలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొనడం తెలంగాణకు శుభ సూచికమని తెలిపారు. సాంకేతిక మార్పులు, భౌగోళికఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా లైఫ్ సైన్సెస్ రంగం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కంపెనీలు కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులో, తక్కువ ఖర్చుతో అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ ప్రకారం 2035 నాటికి 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించడం లక్ష్యమని వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేక లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొంతమంది పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అయితే రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న నోవార్టిస్ సంస్థను ముఖ్యమంత్రి అభినందించారని చెప్పారు. ఫ్రాన్స్‌కు చెందిన ఒపెల్లా, అమెరికాకు చెందిన టిడెంట్ ఎఐరూ.300 కోట్ల పెట్టుబడి, ఇక ఆర్ఎక్స్



ప్రొపెలాంట్ వెయ్యి కోట్లు పెట్టుబడి వంటి పలు సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావడం విశేష మన్నారు. జీనోమ్ వ్యాలీని మరింత విస్తరించేందుకు జీనోమ్ వ్యాలీ ఫేజ్–4 ను 100 ఎకరాల్లో అత్యాధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. 2035 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో భారీ పెట్టుబడు లు ఆకర్షించడం ద్వారా ఐదు లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యమన్నారు.

# మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు సిఎం కప్

### ప్రత్యేక యాప్‌ను ప్రారంభించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న రెండో విడత సిఎం కప్ 2025 26 కు సాంకేతిక హంగులు సమకూర్చి క్రీడాకారులకు ఇష్టమైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన సచివాలయంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సిఎం కప్ గేమ్స్‌కు సంబంధించిన 'నీమణి' యాప్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి డాక్టర్ సోని బాలాదేవి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడారంగానికి పెద్ద పీట వేసే లక్ష్యంతో మట్టిలో మాణిక్యాలను గుర్తించే విధంగా తెలంగాణ క్రీడా శాఖ సిఎం కప్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువకులు, విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా మైదానాలకు తరలి రావాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్వహిస్తున్న ఈ



పోటీల్లో దాదాపు నాలుగున్నర లక్షల మంది క్రీడాకారులు గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా స్థాయిలో పాల్గొని అందులోంచి 22,000 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. క్రీడాకారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేసే విధంగా సిఎం కప్ గేమ్స్ పేరిట నీలమణి యాప్ ద్వారా ఏఐ కాల్ సెంటర్ ద్వారా 24 గంటల సమాచారాన్ని క్రీడాకారులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. 44 క్రీడాంశాలు 12 జిల్లాల వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోటీలు విజయవంతం కావాలని ఈ క్రీడలనుంచి మంచి ఛాంపియన్లు వృద్ధిలోకి రావాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు పలువురు పాల్గొన్నారు

**'సిఎం కప్' ప్రారంభ కార్యక్రమానికి సిఎంకు ఆహ్వానం**

ఈనెల 20న గచ్చిబౌలి స్టేడియంలో జరుగనున్న 'సిఎం కప్2026'కు హాజరుకావాలని సిఎం రేవంత్ రెడ్డిని మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివాసేనరెడ్డి, ఎండి సోనిబాలాదేవిలు ఆహ్వానించారు. తెలంగాణలోని పల్లె నుంచి పట్నం వరకు విద్యార్థులు, యువతీ,యువకుల్లో దాగి క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిఎం కప్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మొత్తం 44 రకాల క్రీడలను సిఎం కప్‌లో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వంతో శారీరక దృఢత్వం మెరుగుపడుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. సిఎం కప్‌ను పాఠశాల విద్యనుంచి యూనివర్సిటీ స్థాయి విద్యార్థుల వరకు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు.

**క్రికెట్ కసితో ఆడాలి : మంత్రి వాకిటి శ్రీహరి**

క్రికెట్‌ను కసితో స్వార్థంతో ఆడాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో భారత అండర్19 టాప్ ఆర్డర్ బ్యాటర్ ఆరోన్ జార్జ్ వర్గీస్ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిశారు. మంత్రిని కలిసిన జార్జ్ వర్గీస్‌ను మంత్రి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రికార్డు సృష్టించాలనే లక్ష్యంతో క్రికెట్ ఆడాలని తెలిపారు. 38 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌కు వినూ మన్కడ్ ట్రోఫీని గెలిపించిన కెప్టెన్‌గా, ఆసియా కప్ మ్యాచ్‌లోనే 69 పరుగుల సాధించి రికార్డు నెలకొల్పిన వర్గీస్, భవిష్యత్‌లో మరిన్ని మ్యాచ్‌లో ఆడి భారత క్రీడా ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

# నాలుగు వారాల్లో నిందితుడు లొంగిపోవాలి

### సినీ నటి ప్రత్యూష మరణం కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగు సినీ నటి ప్రత్యూష మరణం కేసులో సుప్రీంకోర్టు కీలకమైన తుది తీర్పును మంగళవారం వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సిద్ధార్థ రెడ్డి వెంటనే లొంగిపోవాలని, గరిష్టంగా నాలుగు వారాల గడువులో సంబంధిత అధికారుల ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.ఈ కేసులో ఇప్పటికే రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. శిక్షను రద్దు చేయాలని లేదా మరింత తగ్గించాలని కోరుతూ సిద్ధార్థ రెడ్డి దాఖలు చేసిన ప్రత్యేక అనుమతి పిటిషన్ (ఎస్ఎల్‌పి)ను సుప్రీంకోర్టు తిరస్కరించింది.నిర్ణీత గడువులో లొంగిపోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని న్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**కేసు నేపథ్యం :** సినీ నటి ప్రత్యూష అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించిన ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో సిద్ధార్థ రెడ్డిపై కేసు నమోదు చేసి విచా



రణ చేపట్టారు. విచారణ అనంతరం ట్రయల్ కోర్టు (సెషన్స్ కోర్టు) నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అయితే ఆ తీర్పును సవాల్ చేస్తూ నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా, కేసును పునర్విచారించిన హైకోర్టు శిక్షను తగ్గించి రెండున్నర సంవత్సరాలకు పరిమితం చేసింది.

**సుప్రీంకోర్టులో తుది పోరు..** హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించిన నిందితుడు తనపై విధించిన శిక్షను పూర్తిగా రద్దు చేయాలని లేదా మరింత తగ్గించాలని కోరాడు. అయితే అన్ని అంశాలను పరిశీలించిన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులో ఎలాంటి లోపం లేదని తేల్చింది. దీంతో హైకోర్టు విధించిన రెండున్నర సంవత్సరాల జైలు శిక్షను యథాతథంగా కొనసాగిస్తూ, నిందితుడి పిటిషన్‌ను కొట్టివేసింది.

**దీర్ఘకాలంగా సాగిన కేసుకు ముగింపు**

సంవత్సరాలుగా కోర్టుల్లో సాగుతున్న ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఈ తీర్పుతో ప్రత్యూష మరణ కేసు మరోసారి ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# 23న మంత్రివర్గ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో '202627' ఆర్థిక సంవత్సర బడ్జెట్ శాసనసభ సమావేశాల నిర్వహణ, జిహెచ్ఎంసి,ఇతర నగర పాలక సంస్థలు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల అంశంపైన చర్చించనున్నారు. ఈ సమావేశంలో శాసనసభ బడ్జెట్ సమావేశాల తేదీని ఖరారు చేయనున్నారు. ఈ నెల 26వ తేదీన బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపులు, కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, పలు అనుమతులు, తదితర అంశాలు కూడా మంత్రి వర్గంలో చర్చకు రానున్నాయి. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ప్రవేవపెట్టనన్న బిల్లులు, పలు తీర్మానాలపై కూడా చర్చించనున్నారు. అలాగే తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలపైన కూడా మంత్రివర్గం సమీక్షించనుంది.

**19న మంత్రివర్గం, ముఖ్య నేతలతో ఎఐసిసి నేతల భేటి**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు, ముఖ్య నాయకులతో ఎఐసిసి అగ్ర నేతలు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించే అవకాశాలు ఉన్నట్టు పార్టీ వర్గాలు బావిస్తున్నాయి. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు,తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికలు, ప్రభుత్వ పనితీరు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, నాయకుల మధ్య సమన్వయ లోపం, మంత్రుల పనితీరు, తదితర అంశాలపై ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ చర్చించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. అలాగే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ఇటీవల ప్రవేశపెట్టిన పలు బిల్లులు, తదితర అంశాలపైన కూడా మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ చర్చించనున్నట్టు తెలుస్తోంది. కాగా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ముఖ్య నాయకులతో ఎఐసిసి అగ్ర నేతలు సమావేశం కానున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ సిఎం,మంత్రులు, ముఖ్య నాయకులతో సమావేశంకానున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# మాకు పూర్తి న్యాయం జరగలేదు

### ప్రత్యూష తల్లి సరోజినీ ఆవేదన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సినీ నటి ప్రత్యూష మరణ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆమె తల్లి సరోజినీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును గౌరవిస్తున్నప్పటికీ తమ కుటుంబానికి పూర్తి న్యాయం జరగలేదని ఆమె మీడియాతో అన్నారు. ప్రత్యూషను అత్యాచారం చేసి చంపారని ఆమె మరో సారి ఆరోపించారు. ఈ కేసు ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్నదని, తన కుమార్తెకు న్యాయం కోసం ఇప్పటికీ పోరాటం కొనసాగుతూనే ఉందని సరోజినీ పేర్కొన్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని తాము ఎప్పటినుంచో కోరుకుంటున్నామని చెప్పారు. తీర్పుతో తాము నిరాశకు గురయ్యామని, ఒక తల్లిగా తన బాధ ఎప్పటికీ తీరదని భావోద్వేగంగా స్పందించారు.అవసరమైతే తదుపరి న్యాయపరమైన చర్యలను కూడా పరిశీలిస్తామని ఆమె తెలిపారు. నా కూతురి కోసం చివరి



వరకు పోరాడుతాను అని సరోజినీ కన్నీటి పర్యంతమయ్యారు.ప్రత్యూష మరణ ఘటన తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో న్యాయం కోసం కుటుంబ సభ్యులు చాలా కాలంగా పోరాటం కొనసాగిస్తున్నారు.


**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
EE-II (56-కొంపల్లి, 59 దుండిగల్ & 60-మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్.

ప్రతిపాదన కోసం అభ్యర్థన కోసం నోటీసు

RFP Notice No.01 /RFP/EE-II (C-56,59 & 60) CMC/2025-2026, Dt.16.02.2026

| క్ర. సం. | కింద పేర్కొన్న పని కోసం ప్రసిద్ధ సంస్థలు/ఆర్గనైజేషన్లు మొదలైన వాటినుండి RFPలను ఆహ్వానించడమైనది. | డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం / డాక్యుమెంట్ సమర్పణ ముగింపు తేదీ ' సమయం | పేరు & అడ్రస్ అధికారి సెల్ నెంబర్ |
|---|---|---|---|
| 1 | 1). సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోన్ కోసం ముఖ గుర్తింపు హాజరు నిర్వహణ వ్యవస్థ అమలు మరియు నిర్వహణ సేవల కోసం 'సేవా ప్రదాత గుర్తింపు' కోసం ప్రతిపాదన కోసం అభ్యర్థన ఆహ్వానించబడింది. | RFP ప్రారంభతేదీ & సమయం 18-02-2026 @11.00 AM సమర్పణ ముగింపు తేదీ & సమయం: 26-02-2026 @11.00AM | RFP ని 26-02-2026 ఉదయం 11.00లకు లేదా అంతకుముందు eprocurement వెబ్‌సైట్‌లో సమర్పించాలి. Cell No. 7995468066 / 7331181426 |

సంబంధిత అధికారి యొక్క అడ్రస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-II,QBZ, CMC మరియు హెడ్‌డ్రాఫ్ట్స్‌మెన్, QBZ, CMC.
పైన పేర్కొన్న పనికి సంబంధించిన మరిన్ని వివరాలను ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ : https: //tender.telangana.gov.in/login.html నుండి పొందగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-II, సర్కిల్-56, 59 & 60, QBZ, CMC

DIPR R.O. No. : 15416-PP/CL/ADVT/1/2025-26, Date: 17-02-2026



**సూపరింటెండెంట్ కార్యాలయం**
**ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, నాగర్‌కర్నూల్.**

//నోటిఫికేషన్ - సీల్డ్ టెండర్లు ఆహ్వానం //


ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, నాగర్‌కర్నూల్ ప్రాంగణంలో ఉన్న స్క్రాప్ సామగ్రి కన్డెం చేసి తొలగించుటకు ఆసక్తి ఉన్న బిడ్డర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

1. **టెండర్ ఫారమ్‌ల విక్రయ తేదీ:** 18-02-2026 @ 10.30 AM
2. **సీల్డ్ టెండర్ ఫారమ్‌ల స్వీకరణ / సమర్పణకు చివరి తేదీ:** 25-02-2026 @ 4.00 PM
3. **సీల్డ్ టెండర్ల ప్రారంభ తేదీ:** 26-02-2026 @ 11:30 AM
4. **సీల్డ్ టెండర్లను తెరవు స్థలం:** సూపరింటెండెంట్ ఛాంబర్, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, నాగర్‌కర్నూల్.

ఆసక్తి గల బిడ్డర్లు రూ.25,000/- (ఇరవై ఐదు వేల రూపాయలు మాత్రమే) refundable EMD ను Demand Draft రూపంలో క్రింది పేరున సమర్పించాలి: "HOSPITAL DEVELOPMENT SOCIETY, GGH, NAGARKURNOOL." కన్డెమ్ చేయబడవలసిన సామగ్రి జాబితా, దరఖాస్తు ఫారమ్‌తో పాటు, కార్యాలయ పని వేళల్లో పొందవచ్చు.
ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, నాగర్‌కర్నూల్ సూపరింటెండెంట్ ఏ కారణం తెలపకుండానే ఏ టెండర్‌ను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి హక్కును కలిగి ఉంటారు.

సం/- సూపరింటెండెంట్, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, నాగర్‌కర్నూల్.

DIPR R.O. No. : 15448-PP/CL/ADVT/1/2025-26, Date: 17-02-2026



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మంగళవారం అసంబ్లీలోని సిఎం ఛాంబర్‌లో కలిసి విజయవాడలో జరగనున్న ఐజెయు ప్లీనరీకి ఆహ్వానించిన ఐజెయు అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి డి.సోమసుందర్, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు

## డాటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయండి

డాటా సెంటర్లపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డాటా సెంటర్లకు వివిధ రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు, వారికి అవసరమైన భూమి, ఇతర వసతులపై రాష్ట్ర సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. డాటా సెంటర్లకు భూ కేటాయింపులో హేతుబద్ధత ఉండాలని సిఎం సూచించారు. వివిధ ప్రాంతాల్లో డాటా సెంటర్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సాగుతున్న భూ సేకరణపైనా అధికారులను సిఎం ఆరా తీశారు. భూ పరిహారం నిర్ణయం విషయంలో ఉదారంగా ఉండాలని అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు. రైతులను పిలిచి మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిహారం నిర్ణయించాల న్నారు. రూ.వేల కోట్లతో పెట్టుబడులు పెట్టే సంస్థలు భూమిపై పెట్టె పెట్టుబడి చాలా స్వల్పమన్నారు. కంపెనీలకు సకాలంలో భూమి, ఇతర వసతులు అందుబాటులో ఉంచితే త్వరగా పనులు పూర్తి చేసుకుంటారని సిఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సిఎం స్పెషల్ సెక్రటరి అజిత్ రెడ్డి, ఐటి శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

## కాలేజీలకు ఎంత ఫీజు బకాయి ఉన్నారో చెప్పండి : హైకోరు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలకు చెల్లించాల్సిన భారీ మొత్తాల వివరాలను పూర్తి గణాంకాలతో అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు సుమారు రూ. 1500 కోట్ల ట్యూషన్ ఫీజు బకాయిల కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినప్పటికీ కావాలనే వాటిని విడుదల చేయడం లేదని పిటిషనర్ల న్యాయవాదులు వాదించారు ఉద్దేశపూర్వకంగానే చెల్లించడం లేదన్న పలు పిటిషన్లను జస్టిస్ ఈవీ వేణుగోపాల్ మంగళవారం విచారించారు. కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకే రూ.55 కోట్లు బకాయి ఉందని న్యాయవాదులు చెప్పారు.

## ‘ఐ బొమ్మ రవి’కి బెయిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినిమాల పైరసీ కేసు నిందితుడు ఇమంది రవి (ఐబొమ్మ)కి హైకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. గతేడాది నవంబర్‌లో అరెస్టయిన రవికి బెయిల్ మంజూరు ఉత్తర్వుల్లో పలు షరతులను విధించింది. హైదరాబాద్ నగరం విడిచి వెళ్లరాదు. సాక్ష్యాలను తారుమారుకు యత్నించకూడదు. సాక్షులను ప్రభావితం చేయకూడదు. రోజూ ఉదయం 11 గంటలకు సైబర్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసుల ఎదుట హాజరుకావాలి. పాస్‌పోర్టు అప్పగించాలి. దేశం విడిచి వెళ్లరాదు. విచారణకు సహకరించాలి.. అని షరతులు విధించింది. సీసీఎస్‌లో నమోదైన పలు కేసుల్లో బెయిల్ ఇవ్వాలంటూ రవి దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కె. సుజన ఈ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేశారు. విచారణ వచ్చే నెల రెండో వారానికి వాయిదా వేశారు.

## కంచె ఎలా వేస్తోరో చెప్పండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒక భూమి, స్థలం ప్రభుత్వానికి చెందినదనే నిర్ణయానికి ఎలా వస్తారో, ఆ భూములకు కంచె ఎలా వేస్తారో చెప్పాలని హైకోర్టును హైకోర్టు వివరణ కోరింది. ఫిర్యాదు అందగానే నోటీసులు ఇవ్వకుండా చర్యలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించింది. బుల్డోజర్ న్యాయం హైడ్రా అందిస్తామంటే కుదరదని చెప్పింది. నగరంలోని గుడిమల్కాపూర్‌లోని 1350 చదరపు గజాల స్థలంలో ఒక షెడ్డును కూల్చివేసి కంచె వేయడాన్ని సవాలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ విచారణ సమయంలో పైవిధంగా హైడ్రాను ప్రశ్నించింది. విచారణను మార్చి 3కు వాయిదా వేసింది.

## ఇబ్రహీంపట్నం ఎన్నికపై స్టే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను నిలుపుదల చేస్తూ హైకోర్టు మంగళవారం స్టే ఆదేశాలిచ్చింది. 19వ వార్డు మెంబర్ యాదగిరికి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, ఆయన కొడుకు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి భార్య వేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. క్యాంప్‌ను బీఆర్ఎస్ నిర్వహించిందని, తర్వాత అందరూ బయటకు వచ్చినప్పటికీ యాదగిరి ఆచూకీ తెలియలేదని, పోలీసులకు ఆకుల యాదగిరి భార్య ఫిర్యాదు చేస్తే ఫలితం లేకపోయిందని పేర్కొంటూ కుమారుడు ఆకుల హరికాంత్ దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిన్ గాడి ప్రవీణ్ కుమార్ బెంచ్ మంగళవారం విచారించింది. ఎన్నికలకు యాదగిరి హాజరయ్యారని, చైర్మన్ ఎన్నిక కూడా జరిగిపోయిందని ఇరుపక్షాల న్యాయవాదులు చెప్పారు. యాదగిరి, ఆయన భార్యలను విచారించి కిడ్నాప్ జరిగిందో లేదో బుధవారం తేల్చుతామని, వారిద్దరూ కోర్టులో హాజరుపర్చేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది.

## జెఇఇ మెయిన్స్‌లో మెరిసిన గురుకుల విద్యార్థులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా మొదటి విడతలో జరిగిన జెఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలో 318 మంది బిసి గురుకుల ఇంటర్ విద్యార్థులు హాజరవ్వగా ఇందులో ఐదుగురు విద్యార్థులు 90 కంటే ఎక్కువ శాతంతో ఉత్తీర్ణత సాధించారు. మరో 28మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ శాతం మార్కులను సాధించారు. బాలికల విభాగంలో ఎ. నిత్య (92.19 ) , సిహెచ్ గాయత్రి ( 91.50), ఎం. సహస్ర (87.69), పి. చరిత(86.20), ఎం. స్నేహ(85.09) ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో ఎం. నరేందర్(91.58), ఆర్ . కౌశిక్ (91.25), బి.మల్లేష్( 90. 50), బి.హరీష్ (89.19), డి.రోహన్(88.05) శాతంతో ఉత్తీర్ణులయ్యారు. గతంలో రెండు సిఒఈలలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తుండగా తమ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పది సిఒఈ లను ఏర్పాటు చేసిందని, లాంగ్ టర్మ్ కోచింగ్ కూడా ఇస్తున్నదని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పరీక్షలు రాసి, మంచి ఫలితాలను సాధించారని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రి పొన్నంతో పాటు, బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ , ఎంజెపిసొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు.

# భారత్–ఫ్రాన్స్ మధ్య అవధులులేని సహకారం

ముంబయిలో మోదీ–మేక్రాన్ చర్చలు

ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యానికి 21 ఒప్పందాలపై సంతకాలు



**న్యూఢిల్లీ/ముంబయి:** ప్రపంచవ్యాప్తంగా అస్థిరత–అనిశ్చితి కొనసాగుతున్న ఈ పరిస్థితులను ప్రతిఘటించేందుకు వీలుగా భారత్–ఫ్రాన్స్‌దేశాలు ఒక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యన్ని ఏర్పాటు చేసుకున్నాయి. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ,ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ముంబైలోని లోక్‌భవన్‌లో మంగళవారం సమావేశమై రక్షణ, వాణిజ్యం, అంత్యత అరుదైన కీలక ఖనిజ వనరులు, ఇతర రంగాలలో సహకారాన్ని మరింత వృద్ధి చేసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. భారత్‌ను అత్యంత విశ్వసనీయమైన భాగస్వామిగా మేక్రాన్ అభివర్ణించారు. రాఫెల్ జెట్స్ దగ్గర నుండి జలాంతర్గాముల వరకూ ఇరు దేశాలూ సహకారాన్ని విస్తరించుకుంటున్నాయన్నారు. ఉగ్రవాదంపై పోరాటాన్ని కొనసాగించేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. మోదీ మాట్లాడుతూ, యూరప్‌తో సంబంధాలకు 2026ను మేలి మలుపు సం వత్సరంగా పేర్కొన్నారు. భారత్–ఫ్రాన్స్ మధ్య అవధులులేని సహకారం కొనసాగుతుందన్నారు. ఈ మేరకు ఇరువైపులా 21 ఒప్పందాలు, పత్రాలపై సంతకాలు జరిగాయి. వీటిల్లో రక్షణ సహకార ఒప్పందం ప్రత్యేకమైనది. ఈ ఒప్పందాలవల్ల రక్షణ, వాణిజ్యం, టెక్నాలజీ, పునర్వినియోగ ఇంధనం, ఆరోగ్యం, కీలక ఖనిజాల రంగాలలో రెండు దేశాల అవసరాలు తీరేవిధంగా సహకారం మరింత వృద్ధి చెందుతుంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు కొనసాగినప్పటికీ ఇరు దేశాలు తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ఇదొక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా రూపుదిద్దుకుంటుంది. ఈ ఒప్పందాలలో అతి ముఖ్యమైనది రక్షణ సహకారం. దాంతోపాటు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఫ్రెంచ్ డిఫెన్స్ దిగ్గజసంస్థ శాఫ్రాన్స మధ్య సంయుక్తరంగంలో భారత్ అవసరాలు తీర్చేందుకు హేమ్మర్ క్షిపణుల ఉత్పత్తులు చేస్తాయి. భారత సైనికరంగానికి ఈ క్షిపణులు ఎంతో అవసరం. అదేవిధంగా భారత సైన్యంలోని అధికారులను, ఫ్రెంచ్ పదాతిదళవ్యవస్థలో అధికారులను పరస్పరం మోహరించుకోవడానికి విడిగా చేసుకున్న రక్షణ సహకార ఒప్పందం వీలు కలిగిస్తుంది. మూడురోజుల పర్యటన నిమిత్తం భారత్‌లోని ముంబై నగరానికి మేక్రాన్ చేరుకున్న కొన్ని గంటల తర్వాత ఆయనతో మోదీ ముఖాముఖీ సంభాషణలు చేయడం ద్వారా ఒప్పందాలు చేసుకున్నారు. రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక సంబంధాలవల్ల ప్రపంచ అనిశ్చిత పరిస్థితులమధ్య ఒక స్థిరత్వానికి వీలు కలిగిస్తాయని నాయకులు ఇద్దరూ పేర్కొన్నారు. తొలుత ముంబైలో మేక్రాన్‌కు ప్రధాన మంత్రి మోదీ స్వాగతం పలికారు. ముంబైలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి (26/11) మేక్రాన్ దంపతులు తాజ్ హోటల్ వద్ద నివాళులు అర్పించారు. తర్వాత నాయకులిద్దరిమధ్యా సంభాషణలు జరిగాయి.

### శక్తిమంతమైన హెచ్–125 హెలికాప్టర్స్ అసెంబ్లింగ్ లైన్ ప్రారంభం

అదేవిధంగా అత్యంత శక్తిమంతమైన ఎయిర్‌బస్ హెచ్–125 హెలికాప్టర్లను నిర్మించడానికి కర్ణాటకలోని వేమగల్‌లో ఏర్పాటు చేసిన విడిభాగాలను అసెంబుల్ చేసే విభాగాన్ని ముంబై నుండి దృశ్యమాధ్యమ పద్ధతిలో మోదీ–మేక్రాన్ ప్రారంభించారు. ఈ అసెంబ్లింగ్ సెంటర్ ద్వారా భారతదేశ గగనతల సామర్థ్యం వృద్ధిచెందడానికి వీలుగా మరిన్ని గగనతల వాహనాలు రాబోయే కాలంలో అందుబాటులోకి వస్తాయి. ‘‘ప్రపంచదేశాలు ఈనాడు అనిశ్చితిలో ఉన్నాయి. అస్థిరతలో కొట్టుమిట్టాడుతున్నాయి, ఇలాంటి వాతావరణం మధ్య భారత్–ఫ్రాన్స్ మధ్య భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి ఒక చోదకశక్తిగా ఉపయోగపడుతుంది. మా రెండు దేశాలు ఉమ్మడి నైపుణ్యాన్ని కొనసాగిస్తాయి, ఫ్రాన్స్‌దేశ నైపుణ్యాన్ని భారతదేశంలో అవకాశాలను సమ్మిళితం చేస్తాం’’ అని ప్రధానమంత్రి మోదీ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. రెండు దేశాలూ చాలా ప్రత్యేకమైన సంబంధాలను పంచుకుంటున్నాయి, వ్యూహాత్మకంగా చూసినప్పుడు ఫ్రెంచ్‌దేశం భారత్‌కు పురాతనమైన భాగస్వామి,ఇప్పుడు ఇప్పుడు దీనికి అధ్యక్షుడు మేక్రాన్‌తో కలిసి అసాధారణస్థాయిలో లోతైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని,సామర్థ్యాన్ని అందిస్తున్నాం, రెండుదేశాలు పరస్పర విశ్వాసం,ఉమ్మడి అవసరాలతో కూడిన ముందుచూపు ఆలోచనలతో ఈనాడు సంబంధాలను స్థిరపరచుకున్నాం, ఇదొక ప్రత్యేకమైన ప్రాపంచిక వ్యూహాత్మక భాగస్వామ్యం’’ అని మోదీ తన మీడియా ప్రకటనలో తెలియజేశారు. ‘‘ఈ భాగస్వామ్యం కేవలం ఒక వ్యూహాత్మకమైనది మాత్రమే కాదు, ఈనాడు నెలకుని ఉన్న అనిశ్చిత, అస్థిర యుగంలో ప్రపంచ సుస్థిరతకు దోహదం చేస్తుంది, పురోగతికి దోహదం చేస్తుంది’’ అని పేర్కొన్నారు. హెచ్–125 హెలికాప్టర్ల అసెంబ్లింగ్ లైన్ ప్రారంభోత్సవాన్ని కూడా మోదీ తన ప్రకటనలో ప్రధానంగా ప్రస్తావించారు. ‘‘ఈనాడు ఈ అసెంబ్లింగ్ లైన్ ప్రారంభోత్సవం రెండు దేశాలమధ్యా లోతైన విశ్వాసానికి ప్రతీక, ఇదొక ఉదాహరణ, ప్రపంచంలో అత్యంత ఎత్తైన హిమాలయాల వంటి పర్వతాలపై ఎగరగల హెలికాప్టర్లను రెండు దేశాలూ తయారు చేస్తున్నాయి, ఇది ఈ రెండు దేశాలకు మాత్రమే ఉన్న సామర్థ్యానికి ఒక చిహ్నం, యావత్ ప్రపంచానికి కూడా వీటిని మేం ఎగుమతి చేస్తాం, మరో మాటలో చెప్పాలంటే రెండు దేశఋలమధ్యా హద్దులేని అసాధారణ సహకారానికి తెరలేచింది, ఈ సహకారం అటు సముద్ర లోతుల్లోకి, ఇటు అత్యంత ఎత్తైన పర్వశ్రేణులపైపైకి కూడా చేరుతుంది’’ అని పేర్కొన్నారు.

### భారత్–యూరప్ సంబంధాల్లో 2026 మేలి మలుపు సంవత్సరం

అదేవిధంగా మోదీ తన ప్రకటనలో రష్యా–ఉక్రేన్ యుద్ధ వివాదాన్ని, పశ్చిమ ఆసియాలో పరిస్థితులు, ఇండో–పసిఫిక్ పరిస్థితులను కూడా ప్రస్తావించారు. భారత్–ఫ్రాన్స్ దేశాలు ప్రజాస్వామ్య విలువలను విశ్వసించాయని, చట్టపరమైన పరిపాలను, బహుముఖ ప్రపంచాన్ని కోరుతున్నాయని పేర్కొన్నారు. 2026వ సంవత్సరాన్ని భారత్–యూరప్ మధ్య సంబంధాల్లో మేలిమలుపుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా భారత్–ఇ.యు వాణిజ్య ఒప్పందాన్ని గుర్తుచేశారు. కేవలం కొద్ది రోజుల క్రితం యూరప్‌తో అతిపెద్ద చరిత్రాత్మకమైన ఒప్పందంపై సంతకం చేశాం, ఇది ఒక అసాధారణమైన ఉత్తేజాన్ని తీసుకువచ్చింది, పెట్టుబడులకు, పరస్పర అవగాహనకు ఊపు ఇచ్చింది,పరస్పర పురో గతికి ఆశలు రేకెత్తించింది అన్నారు. ‘‘ప్రపంచ వ్యవస్థలను సంస్కరించేందుకు మేం ఉభయులం అంగీకరించాం,ప్రపంచ వ్యవస్థలను సంస్కరించినట్లయితే ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో ఎదురవుతున్న సవాళ్ళకు కూడా పరిష్కారాలు లభిస్తాయి, అది ఉక్రేన్ సమస్య కావచ్చు, పశ్చిమ ఆసియా సమస్య కావచ్చు లేదా ఇండో–పసిఫిక్ సమస్య కావచ్చు, మేం శాంతికి మద్దతును కొనసాగిస్తాం, రెండు దేశాలు ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు కట్టుబడ్డాయి, అది ఏ రూపంలో ఉన్నా నివారించాల్సిన అవసరం ఉంది’’ అని మోదీ పేర్కొన్నారు.



## శ్రమకు తగిన ఫలితం దక్కింది

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో సిపిఐ అత్యధిక కౌన్సిలర్లను, కార్పొరేటర్లను గెలిపించడంలో కృషి చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డిలను తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ , కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలోని మఖ్దూంభవన్‌లో మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బురాజమౌళి మాట్లాడుతూ సాంబశివరావు కొత్తగూడెం కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల విజయానికి అహర్నిశలు శ్రమించారని, ఆ శ్రమకు తగిన ఫలితం దక్కిందని తెలిపారు. ఆయన కృషి వల్లన తెలంగాణ రాష్ట్రంలో సిపిఐకి మొదటి సారి మేయర్ పదవి దక్కిందని, ఆ ఘనత సాంబశివరావుకు దక్కుతుందని రాజమౌళి వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు జ్యోతి, సిహెచ్ రాజయ్య, మౌలాలి, శ్రీనివాస్ రెడ్డి, గోపి, రచన, తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు రాష్ట్రంలోని మున్సిపాలిటీలో సిపిఐ అత్యధిక కౌన్సిలర్లు, కార్పొరేటర్లను గెలిపించడంలో కృషిచేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు, సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకటరెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపిన ప్రజాగాయకుడు గద్దర్ కుమారుడు సూర్యం, కోడలు సరితలతో పాటు తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సబ్బు రాజమౌళి, జ్యోతితో పాటు స్టేట్ టీచర్స్ తెలంగాణ యూనియన్ నేతలు అధ్యక్షులు సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి గజేందర్, కరుణాకర్‌రెడ్డి, పోల్‌రెడ్డి, శంకర్‌లు.



కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని సిపిఐ దక్కించుకునేందుకు విశేష కృషి చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావును ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి. సదానందం గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ మంగళవారం కలిసి అభినందించారు. కూనంనేనిని కలిసిన వారిలో ఎస్‌టియు టిఎస్ హెడ్ క్వార్టర్ సెక్రటరీ వై. కరుణాకర్ రెడ్డి, నమస్తే ఉపాధ్యాయ సబ్ ఎడిటర్ మాతంగి శంకర్, అదనపు ప్రధాన కార్యదర్శి టి. పోల్ రెడ్డి, కె. శ్రీనివాస్ ఉన్నారు.



కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు రాష్ట్రంలోని మున్సిపాలిటీలో సిపిఐ అత్యధిక కౌన్సిలర్లు, కార్పొరేటర్లను గెలిపించడంలో కృషి చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావును హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాయంలో మంగళవారం ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్య ప్రసాద్, శ్రీమాన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

## హాస్టళ్లలో ఫైర్ సేఫ్టీపై రాజీ పడొద్దు

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేసవి కాలం దృష్ట్యా నగరంలోని హాస్టళ్ల నిర్వాహకులు అగ్ని ప్రమాదాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సూచించారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అగ్నిప్రమాదాలపై ఫిర్యాదుల నేపథ్యంలో హాస్టళ్లలో ఫైర్ సేఫ్టీపై హైడ్రా అవగాహన కార్యక్రమం నిర్వహించింది. నగరంలోని ఎల్లారెడ్డి గూడ, సంజీవరెడ్డినగర్ ప్రాంతాల్లోని పలు హాస్టళ్లను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘చాలా హాస్టళ్లలో గదులు కిక్కిరిసి ఉన్నాయి. సెల్లార్లలో మెస్‌లు నడుపుతూ, మెట్ల మార్గాలను మూసివేసి గ్రిల్స్ వేయడం ప్రమాదకరం. ఇలాంటి చోట అగ్ని ప్రమాదం జరిగితే ప్రాణనష్టం ఊహించలేం’ అని ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా సూచనలను తూచా తప్పకుండా పాటిస్తామని, విద్యార్థుల, ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యతనిస్తామని హాస్టల్ యజమానుల సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. హాస్టళ్లలో నివసించే విద్యార్థులు, ఉద్యోగార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, ఆర్ఎఫ్ఓలు జయప్రకాష్, డిఎఫ్ఓలు యజ్ఞ నారాయణ, గౌతమ్, ఎడిఎఫ్ఓ మోహన్ రావు, ఇతర అధికారులు, సైబరాబాద్ హాస్టళ్ల యజమానుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### నిర్వాహకులకు కీలక సూచనలు..

- ప్రతి గదిలో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, స్మోక్ డిటెక్టర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- ప్రమాదం జరిగినప్పుడు బయటకు వచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు (రెండో మెట్ల మార్గం లేదా లాడర్లు) ఉండాలి.
- సెల్లార్లను కేవలం పార్కింగ్‌కే వాడాలి, వంట గదులుగా లేదా నిల్వ కేంద్రాలుగా వాడకూడదు.
- సిబ్బందికి ఫైర్ సేఫ్టీ పరికరాల వాడకంపై అవగాహన కల్పించాలి.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ

మార్చి నాటికి లబ్ధిదారుల ఎంపిక పూర్తి

ఓఆర్ఆర్ - ట్రిపుల్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ

మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి , శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల పూర్తిపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. క్యూర్ పరిధిలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వచ్చే మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో స్థలాల గుర్తింపు, లబ్ధిదారుల సంఖ్యపై 10 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. ఈ నెల చివరి నాటికి సొంత స్థలం కలిగిన 28 వేల మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయలన్నారు.

### బహుళ అంతస్తుల ఇందిరమ్మ ఇండ్లు

నగరంలోని మురికివాడల్లో నివసించే వారు జీవనోపాధి నిమిత్తం తమ ప్రాంతాలను వదిలి వెళ్లేందుకు ఇష్టపడటం లేదని సర్వేలో తేలింది. ఈ నేపథ్యంలో, వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే లభ్యతను బట్టి 5 నుండి 10 అంతస్తుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. శిథిలావస్థకు చేరిన జెఎన్ఎన్‌యుఆర్ఎం ఇండ్ల స్థానంలో కూడా కొత్తగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే యోచనలో ఉన్నట్లు మంత్రి తెలిపారు.

### అసంపూర్తి ఇండ్లపై నిర్ణయం

- గత ప్రభుత్వం హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల బాధ్యతను లబ్ధిదారులకే అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది.
- గుర్తించిన లబ్ధిదారులు మిగిలిన పనులను పూర్తి చేసుకోవడానికి అవసరమైన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ మంజూరు చేస్తుంది.
- అనార్హులు, బోగస్ లబ్ధిదారులను ఏరివేసి, రాజకీయాలకు అతీతంగా నిజమైన పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు.
- ఇండ్లు కేటాయించినా నివసించని వారికి నోటీసులు జారీ చేయనున్నారు.

### అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ..

మధ్యతరగతి ప్రజల కోసం ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ (త్రిబుల్ ఆర్) మధ్య ప్రాంతాల్లో గతంలో కెపిహెచ్‌బి తరహాలో అఫర్డబుల్ హౌసింగ్ పథకాన్ని అమలు చేయలన్నారు. ఇందుకోసం నాలుగు ప్రధాన ప్రాంతాల్లో స్థలాలను గుర్తించాలని అధికారులను కోరారు. ప్రతి డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. వాటర్ బోర్డు, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేయాలన్నారు.

## మెదక్ కలెక్టర్‌కు జైలు శిక్ష

అప్పీల్‌కు వీలుగా తీర్పు అమలు సస్పెన్షన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఒక భూమి వివాదంపై దాఖలైన కేసులో తామిచ్చిన ఉత్తర్వులను అమలు చేయని మెదక్ జిల్లా కలెక్టర్, ఐఏఎస్ అధికారి శ్రీరాహుల్ రాజ్‌కు హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రూ.2 వేలను జరిమానా చల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులు జారీ అయినప్పటి నుంచి 4 వారాల్లోగా చెల్లించాలంది. అయితే, ఈ శిక్షపై అప్పీల్ చేసుకునేందుకు వీలుగా నాలుగు వారాలపాటు తీర్పు అమలును నాలుగు వారాలపాటు నిలిపివేసింది. మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల్ సర్వే నంబర్ 284/ఏ/2లో 2.22 ఎకరాల భూ వివాదంలో తమ ఆదేశాల్ని అమలు చేయలేదంటూ కలెక్టర్ శ్రీరాహుల్‌రాజ్‌కు జైలు శిక్ష విధించింది. మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల్ సర్వే నంబర్ 284/ఏ/2లో 2.22 ఎకరాల భూమికి తాను వారసురాలినని, తన పేరిట భూమి వివరాలను నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ నాగవెల్లి లక్ష్మి 2024, ఏప్రిల్‌లో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై కలెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను న్యాయమూర్తి రద్దు చేశారు. లక్ష్మితోపాటు ప్రతివాది నారాయణ, మల్లయ్యలకు నోటీసులు జారీ చేశారు. మరోసారి విచారణ చేయాలని ఆదేశించారు. సేల్‌డీడ్ సాదాబైనా క్రమబద్ధీకరణ చర్యలను పరిశీలించి చట్టప్రకారం తగిన ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకు 3 వారాల గడువు మంజూరు చేశారు. ఈ ఆదేశాలను అమలు చేయలేదంటూ లక్ష్మి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ ఎవిచారణ చేపట్టారు. కోర్టు గతంలో వెలువరించిన ఉత్తర్వులను కలెక్టర్ ఉద్దేశపూర్వకంగా అమలు చేయలేదని, కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని పిటిషనర్‌న్యాయవాది వాదించారు. దీనికి చెందిన రికార్డులను న్యాయమూర్తి పరిశీలించి, ప్రభుత్వం అందజేసిన రికార్డుల్లో తేదీ లేదని గుర్తించారు. పిటిషనర్‌కు నోటీసులు అందినట్లు నిర్ధారణ చేసుకోలేదని కూడా గుర్తించారు. వాట్సాప్ ద్వారా పిటిషనర్‌కు పంపించామని ప్రభుత్వ సహాయ న్యాయవాది చెప్పగా, ఈ విషయాన్ని కౌంటర్‌లో ఎందుకు పేర్కొనలేదని ప్రశ్నించారు. రెండు ఎకరాల భూమి కోసం 51 ఏళ్ల మహిళలను పదేపదే కోర్టుల చుట్టూ తిరిగేలా చేయడాన్ని తప్పుపట్టారు. కలెక్టర్‌కు జైలు శిక్ష విధిస్తూ పైవిధంగా తీర్పు వెలువరించారు.

# ఎఐ సదస్సులో ప్రతినిధులకు ఇక్కట్లు

### కేంద్రమంత్రి అశ్వనీవైష్ణవ్ క్షమాపణ

### 70 వేలమంది ప్రతినిధులకు ఏర్పాట్ల లోపం



**న్యూఢిల్లీ:** గ్లోబల్‌సౌత్‌లో మొదటిసారి భారత దేశం నిర్వహిస్తున్న ఎఐ ఇపాక్ట్ సదస్సు–2026 కు అనూహ్యమైన స్పందన రావడంతో సదస్సు ప్రాంగణం కిటకిటలాడిపోయి ప్రతినిధులకు సదుపాయాలు సమకూర్చడంలో అనేక సమస్యలు తలెత్తాయి. దీంతో సదస్సు రెండోరోజు మంగళవారం కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రతినిధులకు క్షమాపణలు చెప్పారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా భారీ స్పందన వచ్చింది. ప్రతినిధులతో సదస్సు ప్రాంగణం కిటకిటలాడిపోయింది. భారీ ఎత్తున క్యూలైన్లు ఏర్పడ్డాయి. సదస్సు హాలులో అనుసరించాల్సిన పద్ధతులకు సంబంధించిన నిబంధనలు అస్పష్టంగా ఉండ టంతో ప్రతిచోటా ప్రతినిదులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. మొబైల్ డేటా కనెక్టివిటీకి సంబంధించి కూడా అందరికీ సమస్యలు వచ్చాయి. తాము ఊహించినదానికంటే భారీ స్పందన రావడంవల్ల సదస్సు నిర్వహణలో లోపాలు తలెత్తాయని, రాబోయే మూడు రోజుల్లో సదస్యులకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు రాకుండా చాలా సున్నితంగా పరిస్థితులన్నీ కొనసాగేలా ఏర్పాట్లు చేస్తామని మంత్రి వైష్ణవ్ వాగ్దానం చేశారు. అందరికీ క్షమాపణలు తెలియజేశారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న–చాలా తక్కువ అభివృద్ధి చెందిన దేశాలలో మొదటిసారి భారత్‌లోనే ఈ సదస్సు జరుగుతోంది. ఈనెల 20వ తేదీ వరకూ మరో మూడు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుంది. వేలాదిమంది ఈ సదస్సుకు హాజరయ్యారు. ఒక్క సోమవారంనాడే దాదాపు 70,000 మంది ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుగా దీనిని ప్రపంచ మీడియా అభివర్ణించింది. అతి భారీ అంచనాలతో వేలాదిమంది ప్రపంచదేశాల నుండి తరలివచ్చారు. "ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సు..దీనిని వచ్చిన స్పందన అనూహ్యమైనది, మాటల్లో చెప్పలేం, ఈ సదస్సు శక్తిసామర్థ్యాలు ఏమిటో ఇక్కడే చాలా స్పష్టంగా అందరికీ కనిపిస్తున్నాయి, ఇప్పుడు ఈ సదస్సు నిర్వహణను చాలా చక్కగా సాఫీగా సాగిపోయేలా చూస్తున్నాం, ఒక వేళ ఎవరైనా సంస్థాగతంగా మొదటిరోజు ఇబ్బందులు ఎదుర్కొంటే వారందరికీ మేం క్షమాపణలు తెలియజేస్తున్నాం, ఇప్పుడు పరిస్థితులు అన్నీ చక్కబడ్డాయి, సదస్సులో వ్యవహారాలన్నీ సాఫీగా సాగిపోతున్నాయి" అని మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. సమస్యలు పరిష్కరించడానికి, సమస్యలు వినడానికి ఉద్దేశించి ఏర్పాటు చేసిన వార్ రూమ్స్ ఇప్పుడు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, ఏ సమస్యనైనా వారు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని, సమస్యలు ఏమైనా ఉంటే వార్ రూమ్‌లో చెప్పాలని ఆయన ప్రతినిధులకు తెలియజేశారు. వార్ రూమ్‌లో సమస్యలు పరిష్కారం కావడం ద్వారా ఈ సదస్సు మరింత సున్నితంగా, సామరస్యంగా జరుగుతుందన్నారు. అకుంఠ సంస్థల వ్యవస్థాపకులు, గ్లోబల్ టెక్ ప్రతినిధులు, అంతర్జాతీయ ప్రతినిధులతో కిటకిటలాడటంతో ప్రాంగణంలో గందరగోళం తలెత్తింది. దీంతో కొంతమంది వస్తువులు మాయమయ్యాయి. మరికొంతమంది వస్తువులు ఒకచోట నుండి మరోచోటకు మారిపోయాయి. నియోసాపియన్ సిఇఓ ధనంజయ్ యాదవ్ తన వస్తువులు ఎవరో దొంగిలించారని ఫిర్యాదు చేశారు. మొదటి రోజు చాలా ఫిర్యాదులు వచ్చాయి. నీరు లేదని, శుభ్రత లేదని ఫిర్యాదులు వచ్చాయి. తర్వాత దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు.

### ఎఐ సమ్మిట్‌లో నిర్వహణ లోపం..

# దేశానికి తలవంపులు: ఖర్గే



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో ఏర్పడిన గందరగోళం, నిర్వహణ వైఫల్యాలు మోదీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దీని వల్ల అంతర్జాతీయ స్థాయిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆరోపించారు. 'భారతదేశ డిజిటల్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ సమ్మిట్‌ను ఒక గొప్ప వేదికగా ఉపయోగించుకోవాల్సి ఉంది. కానీ మోదీ సర్కార్ పిఆర్ ఆకలి వల్ల తీవ్ర గందరగోళానికి, అస్తవ్యస్త నిర్వహణకు వేదికగా మారింది' అని ఖర్గే విమర్శలు చేశారు. 'భారత్ ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఐదు రోజులపాటు జరగాల్సి ఉంది. అయితే మొదటి రోజైన సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ కేవలం ఫోటోలు ఇవ్వడం కోసం అకస్మాత్తుగా అక్కడకు రావడంతో, వ్యవస్థాపకులు, ప్రదర్శకులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మోదీ రాకతో ఏర్పడిన ఈ గందరగోళం వల్ల డిజీ యాత్ర దారుణంగా విఫలమైంది. ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులు దొంగతనానికి గురయ్యాయి. ఎగ్జిబిటర్స్‌కు కనీసం ఆహారం, నీరు అందించలేదు. చివరకు ల్యాప్‌టాప్‌లు, వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాలను, బ్యాగ్‌లను కూడా నిషేధించారు. డిజిటల్, యుపిఐ చెలింపులకు బదులుగా కేవలం నగదు రూపంలో మాత్రమే పేమెంట్స్ స్వీకరించారు. స్టార్టప్ ఫౌండర్ల నుంచి భారీ మొత్తంలో వసూలు చేసి కూడా, వారికి కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయారు. మోదీ సర్కార్ అసమర్థత కారణంగా మన దేశ అంతర్జాతీయ స్థాయిలో పరాభవాన్ని ఎదుర్కోవాల్సి రావడం అత్యంత దురదృష్టకరం' అని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఇలాంటి భారీ స్థాయి డిజిటల్, టెక్ సమ్మిట్‌లను ఎలా నిర్వహించాలో ఏటా నిర్వహించే బెంగళూరు టెక్ సమ్మిట్ (బిటిఎస్)ను చూసి మోదీ సర్కార్ నేర్చుకోవాలని ఆయన సూచించారు.

**సమ్మిట్ మోదీ ఫోటో షూట్‌లా మారిపోయింది!**

కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. 'క్షఐ సమ్మిట్ పేరుతో జరిగిన ఈ కార్యక్రమం ప్రధాని మోదీ ఫోటో షూట్‌లా మారిపోయింది. ఇందుకోసం ప్రధాన హాల్‌ను ఖాళీ చేయించారు. భద్రతా సిబ్బంది సమ్మిట్‌కు వచ్చిన వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఫౌండర్లు తమ వస్తువులు పోయాయని ఫిర్యాదు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో డబ్బులు కట్టి స్టాల్స్ ఏర్పాటు చేసుకున్న వారిని అక్కడి నుంచి గెంటేశారు' అని ఆరోపించింది. ఒక టెక్నాలజీ ఈవెంట్ అయ్యుండి కూడా ఇంటర్నెట్ సరిగ్గా లేకపోవడంలో చాలా డెమోలు విఫలమయ్యాయని కాంగ్రెస్ విమర్శించింది. మరీ దారుణంగా ఒక డిజిటల్, టెక్ ఈవెంట్‌కు ల్యాప్‌టాప్‌లను, కెమెరాలను నిషేధించడం విడ్డూరంగా ఉందని పేర్కొంది. చివరికి ఫుడ్ స్టాల్స్‌లో కూడా డిజిటల్ పేమెంట్లు చేయడానికి ఒప్పుకోలేదని, కేవలం నగదు రూపంలో డబ్బులు చెల్లించాలని కోరం సిగ్గుచేటని కాంగ్రెస్ విమర్శల వర్షం కురిపించింది.

## మార్చిలో 4 రాష్ట్రాలు, యుటికి ఎన్నికల షెడ్యూల్

### ఏప్రిల్‌లో పలు దఫాలుగా అసెంబ్లీ ఎన్నికలు




**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్, అసోం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలలో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్‌లో జరిగే అవకాశాలున్నాయి. వీటికి సంబంధించి మార్చి మధ్యలో షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని అధికారులు మంగళవారం తెలిపారు. వచ్చే నెలలో ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించి ఏప్రిల్‌లో పలు తేదీల్లో పోలింగ్ నిర్వహించే అవకాశమున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఐదు అసెంబ్లీల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగుస్తుంది. పుదుచ్చేరి ఐదేళ్ల పదవీకాలం జూన్ 15న ముగుస్తుండగా, అసోం మే 20, కేరళ మే 23, తమిళనాడు మే 10 , పశ్చిమ బెంగాల్ మే 7వ తేదీన ముగియనుంది. కాగా, ఇప్పటికే ఎన్నికల సంఘం ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో పర్యటించడం ప్రారంభించింది. ఎన్నికల సన్నద్ధతను అంచనా వేయడానికి ఇప్పటికే అసోంలో ఉర్యటిస్తోంది. గతంలో పశ్చిమ బెంగాల్‌లో గరిష్టంగా అసెంబ్లీ ఎన్నికలు ఎనిమిది దశల్లో జరిగాయి. అసోంలో రెండు దశల్లో, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలలో ఒకే దశలోనే ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు జరగనున్న అసెంబ్లీలలో ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్‌లో భాగంగా ఫిబ్రవరి 14న తుది ఓటర్ల జాబితాను ప్రచురించిన మొదటి రాష్ట్రం పుదుచ్చేరి. తమిళనాడు మంగళవారం తన పోస్ట్ ఎస్ఐఆర్ తుది పోల్ రోల్‌ను ప్రచురిస్తుంది. కేరళ ఫిబ్రవరి 21న ప్రచురిస్తుంది. పశ్చిమ బెంగాల్ తుది ఓటర్ల జాబితా 28న ప్రచురించనుంది.

## ఎఐ ఆవిష్కరణల వృద్ధికి వీలుగానే నియంత్రణలు

### కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధలో నూతన ఆవిష్కరణలు వృద్ధి చెందడానికి వీలుగా తగినన్ని నియంత్రణలు ఉన్నాయి తప్ప అధిక నియంత్రణకోసం వాటిని అమలు చేయడం లేదని కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్ చెప్పారు. న్యూఢిల్లీని భారత్ మండపంలో మంగళవారం జరిగిన అమెజాన్ వెబ్ సర్వీస్ (ఎడబ్ల్యుస్) సింపోజియం–2026లో మంత్రి మాట్లాడుతూ, సాంకేతికంగా వస్తున్న పరివర్తనల ప్రయోజనాల నుండి ప్రతిఒక్కరూ లబ్ధి పొందాల్సిన అవసరం ఉందని అన్నారు. భారతదేశంలో కృత్రిమ మేధ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోందని, వివిధ రకాల అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. నవీన ఆవిష్కరణల వేగం విస్తరించిందని, సర్వసమ్మిళితమైందని, ఇది భారతదేశ శక్తిసామర్థ్యాలను చాటి చెబుతుందన్నారు. విధానపరమన నిబంధనల ప్రకారం ఆవిష్కరణల నుండి లబ్దిపొందడానికి వీలు కలుగుతుందని, మితిమీరిన నియంత్రణలను తాము విధించడంలేదని, నవీన ఆవిష్కరణలు చేయడానికి, వీటి ద్వారా అందరూ ప్రయోజనాలు పొందడానికి ఉన్న నియంత్రణలు సరిపోతాయని మంత్రి చెప్పారు. పునాదిస్థాయిలో సాంకేతికతను, ఆవిష్కరణలను విస్తరించేదాకా విజయం సాధించినట్లు భారత్ భావించబోదన్నారు. ఈ ప్రయోజనాలు కిందిస్థాయిలో అందరికీ అందాలని అప్పుడే భారత్ విజయం సాధించినట్లవుతుందని అన్నారు. కృత్రిమ మేధ పరివర్తనను దిగువన పునాదిస్థాయి వరకూ తీసుకువెళ్ళాల్సి ఉందని, ఉత్పాదకతను అనివార్యంగా పెంచాల్సి ఉందని చెప్పారు. వ్యక్తులు తమ తమ స్థాయిలకు అనుగుణంగా ఆదాయాలు సంపాదించుకుని వాటిని మెరుగుపరచుకోవాల్సి ఉంటుందని, తద్వారా వారు తమ జీవనభృతిని, ప్రమాణాలు పెంచుకుంటారన్నారు. ఈ ప్రయోజనాలు అందరికీ చేరాలని ఆకాంక్షించారు. ఎడబ్ల్యుస్ ఇండియా అండ్ సౌత్ ఆసియా అధ్యక్షుడు సందీప్ దత్తా మాట్లాడుతూ, సాంకేతికతను ప్రజాస్వామ్యీకరించడంపైనే భారతదేశ శక్తిసామర్థ్యాలు ఆధారపడి ఉంటాయన్నారు. ప్రజాస్వామ్యమే భారతదేశ సమాజానికి మూల పునాది అని, సాంకేతికతను ఈ రూపేణా విస్తరించడంపైనే సామర్థ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఛైర్మన్ అవరిందర్ సింగ్ సాహ్ని సదస్సులో మాట్లాడుతూ, ప్రపంచం ఈనాడు ఇంధన పరివర్తన కోసం ఎదురుచూస్తోందని, శక్తిని కొత్తరూపాలలో, నవీన ఆవిష్కరణ రూపాలలో తీర్చిదిద్దడంకోసం సానుకూల దృక్పథంతో ఎదురుచూస్తోందని అన్నారు. భారతదేశం ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా, భవిష్యత్ అవసరాలు తీర్చుకోవడానికి వీలుగా ఇంధన వనరుల్లో స్థిరత్వాన్ని సాధించేదిశగా ప్రయాణం చేస్తోందని, దేవుడు ఈ దేశానికి ఇచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటున్నదని, ఇండియన్ ఆయిల్ వంటి కంపెనీలు దేశంలో ఉన్నాయని ఆయన అన్నారు. ఈనాడు భారతదేశం ప్రతి సంవత్సరం 135 బిలియన్ డాలర్లు విలువైన ముడి చమురును ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నదన్నారు.తమ కంపెనీ ఎ ఐ విప్లవాన్ని ఆశ్రయించిదని అన్నారు. ఖాతాదారుల ప్రవర్తనను తాము అంచనావేస్తున్నామన్నారు. ఎడబ్ల్యుస్, ఇండస్ట్రీ విభాగం నాస్కామ్‌లు ఒక వ్యూహాత్మక సహకారానికి వచ్చినట్లు ఈ సదస్సులో ప్రకటించాయి. 2027 నాటికి ఎ ఐ లో, క్లౌడ్‌లో 2.50 లక్షలమంది నైపుణ్యంగల లెర్నర్స్‌ను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించాయి.

### డియు క్యాంపస్‌లో నెల రోజులు

## నిరసన ప్రదర్శనలు నిషేధం

**న్యూఢిల్లీ :** ఢిల్లీ విశ్వవిద్యాలయం (డియు) క్యాంపస్‌లో బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, నిరసనలను మంగళవారం నుంచి నెల రోజుల పాటు నిషేధించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ ప్రొక్టర్ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ ఉత్తర్వు జారీ చేశారు. ఈ నిషేధం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. క్యాంపస్‌లో అనియంత్రిత ప్రజా సమావేలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, మానవ ప్రాణాలకు ముప్పు కలిగించడం, ప్రజా శాంతికి భంగం కలిగించవచ్చని సూచించే సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రొఫెసర్ కుమార్ తన ఆదేశంలో పేర్కొన్నారు. గతంలో, నిర్వాహకులు తరచుగా నిరసనలను నియంత్రించడంలో విఫలమయ్యారని, దీంతో నిరసనలు తీవ్రమై విస్తృతంగా వ్యాపించాయని, ఫలితంగా విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుండి వచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా డిసెంబర్ 26, 2025న సబ్‌డివిజన్ సివిల్ లైన్స్ అసిస్టెంట్ కమిషనర్ జారీ చేసిన మునుపటి ఉత్తర్వును కూడా ప్రొక్టర్ ప్రస్తావించారు. ఆ ఉత్తర్వు ప్రకారం, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రజా శాంతికి భంగం కలిగించే లేదా ట్రాఫిక్ సజావుగా సాగడానికి అంతరాయం కలిగించే ఏదైనా బహిరంగ సమావేశం, ర్యాలీ, సిట్‌ఇన్, ప్రదర్శన లేదా కార్యకలాపాలు నిషేధించారు. ప్రస్తుత ఉత్తర్వు ఈ ఆంక్షలను పునరుద్ఘాటిస్తుందని, ఒక నెల పాటు అమలులో ఉంటుందని ప్రొక్టర్ చెప్పారు. 13న విశ్వవిద్యాలయం ఉత్తర ప్రాంగణంలో జరిగిన నిరసన సందర్భంగా మహిళా జర్నలిస్ట్, కంటెంట్ సరైటర్‌పై జరిగిన దాడిపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నిషేధం విధించడం గమనార్హం.

### అధిక ఆర్థిక పరిమితులను ఎదుర్కొంటున్నా...

# సంక్షేమం, విద్య, ప్రజాసేవకు పెద్దపీట

### 'విజన్ 2031' ముగింపు సభలో కేరళ ముఖ్యమంత్రి విజయన్



**తిరువనంతపురం:** భారతదేశం వ్యాప్తంగా రాష్ట్రాలు పెరుగుతున్న ఆర్థిక పరిమితులను ఎదుర్కొంటున్నాయని, ప్రజా సేవల పంపిణీ, అభివృద్ధిలో వాటి బాధ్యతలు విస్తరిస్తాయని, అంతర్ ప్రభుత్వ ఆర్థిక ఏర్పాట్లలో అంచనా వేయడం, న్యాయంగా ఉండటం ఎంతో అవసరమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. ఆయన మంగళవారం ఇక్కడ జరిగిన 'విజన్ 2031' అంతర్జాతీయ సదస్సు ముగింపు సభలో ప్రసంగించారు. ప్రజాసేవలను అందించడంలో, అభివృద్ధిని నడిపించడంలో రాష్ట్రాలు నేడు ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయన్నారు. అయితే వాటి ఆర్థిక స్థలం మరింత పరిమితంగా మారిందని సిఎం విజయన్ అన్నారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్ర అనుభవాన్ని ఆయన ఉదహరించారు. అంతర్ ప్రభుత్వ ఆర్థిక ఏర్పాట్లు, రుణ పరిమితులు, కేంద్ర బదిలీల నిర్మాణంలో మార్పులు కొత్త సవాళ్లను సృష్టించినప్పటికీ రాష్ట్రం తన సొంత ఆదాయంలో ఎక్కువ భాగాన్ని స్థిరంగా సమీకరించుకున్నదన్నారు. అంతేకాకుండా బలమైన ప్రజా సేవా పంపిణీని కొనసాగించిందని వివరించారు. ఈ సమస్యను ఘర్షణ భాషలో కాకుండా ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన అంశంగా చూడాలన్నారు. పరిమితులు ఉన్నప్పటికీ కేరళ రాష్ట్రం సంక్షేమం, విద్య, ప్రజా సేవకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తూనే ఉందన్నారు. విద్యార్థులు, కార్మికులు, బలహీన వర్గాలకు మద్దతు ఇచ్చే చర్యలను సామాజిక నిబద్ధతతో సమతుల్యం చేసే ప్రయత్నాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. కేరళ లౌకిక వాదాన్ని కేవలం రాజ్యాంగ సూత్రం మాత్రమే కాదన్నారు. పాఠశాలలు, పరిసరాలు, కార్యాలయాల్లో కనిపించే సజీవ సామాజిక ఆచరణ ముఖ్యమని ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు.కేరళ సమగ్ర ప్రజాసంస్థలు, పరస్పర గౌరవ సంస్కృతి ద్వారా సామాజిక సామరస్యాన్ని అధికంగా పరిరక్షించిందన్నారు. ప్రముఖ ఆర్థికవేత్త, నోబుల్ విజేత అమర్త్యసేన్‌ను ఆయన ఈ సందర్భంగా ఉటంకించారు. ఈ విషయంలో భాగస్వామ్య పాలనకు కేరళ దీర్ఘకాలిక నిబద్ధతను పినరయి నొక్కిచెప్పారు. మరిన్ని సంస్కరణల అవసరాన్ని గుర్తించిన కేరళ ప్రభుత్వం సమగ్ర శాసన నిర్మాణాన్ని తీవ్రంగా పరిశీలిస్తోందన్నారు. 2031నాటికి కేరళ రాష్ట్రం సంపన్నంగా, వినూత్నంగా ఉండాలని, కానీ, అన్నింటికి మించి అది ప్రజాస్వామ్యబద్ధంగా, లౌకిక స్ఫూర్తితో ఉండాలని పినరయి ఆకాంక్షించారు

### రూ. 900 కోట్ల జల్‌జీవన్‌మిషన్ స్కామ్

# దేశవ్యాప్తంగా 15 చోట్ల ఎసిబి దాడులు

### రిటైర్డ్ ఐఎఎస్ అధికారిని ప్రశ్నించిన దర్యాప్తు సంస్థ అధికారులు




**జైపూర్ :** జల్ జీవన్ మిషన్‌లో జరిగిన రూ. 900 కోట్ల కుంభకోణం ఇటీవలి సంవత్సరాలలో రాజస్థాన్‌లో జరిగిన అతిపెద్ద అవినీతి నిరోధక చర్యలలో ఒకటిగా నిలిచింది. మంగళవారం దేశవ్యాప్తంగా 15 ప్రదేశాలలో అవినీతి నిరోధక శాఖ ఏకకాలంలో దాడులు ప్రారంభించింది. తెల్లవారుజామున జరిగిన ఈ ఆపరేషన్ రాష్ట్ర అధికార యంత్రాంగం, రాజకీయ వ్యవస్థలో దిగ్భ్రాంతిని కలిగించింది. రాజస్థాన్‌లోని జైపూర్, బార్మర్, సికార్, జలోర్‌లలో ఎసిబి బృందాలు సోదాలు నిర్వహించాయి. అదే సమయంలో జల్ జీవన్ మిషన్ కుంభకోణంతో సంబంధం ఉన్న సంస్థలను పరిశీలించడానికి బిహార్, జార్ఖండ్‌లలో కూడా దాడులు నిర్వహించారు. ఈ పథకం కింద టెండర్ల కేటాయింపునకు సంబంధించిన పత్రాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు, ఆర్థిక లావాదేవీలను అధికారులు పరిశీలించారు. రిటైర్డ్ సీనియర్ ఐఎఎస్ అధికారి సుబోధ్ అగర్వాల్ కూడా దర్యాప్తులో ఉన్నారు. వర్గాల సమాచారం మేరకు.. ఎసిబి అధికారులు అతని నివాసాన్ని సోదా చేసి, ఆయన పదవీకాలంలో కాంట్రాక్టుల ఆమోదంపై ప్రశ్నించారు. నకిలీ అనుభవ ధృవీకరణ పత్రాల ఆధారంగా ఎంపిక చేసిన కంపెనీలకు అనుకూలంగా కోట్ల విలువైన టెండర్లను సులభతరం చేసినట్లు ఆయన అనుమానిస్తున్నారు. అగర్వాల్‌తో పాటు, అర డజనుకు పైగా వ్యక్తులను విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌ను ఎసిబి డైరెక్టర్ జనరల్ గోవింద్ గుప్తా, అదనపు డైరెక్టర్ జనరల్ స్మితా శ్రీవాస్తవ పర్యవేక్షిస్తున్నారు. అరెస్టు చేసిన వారిలో డికె గుప్తా, నిరిల్ కుమార్, సుశీల్ శర్మ, డికె గౌర్, మహేంద్ర సోని, విశాల్ సక్సేనా, దినేష్ గోయల్, శుభాన్సు దీక్షిత్, అరుణ్ శ్రీవాస్తవ ఉన్నారు. తదుపరి విచారణ తర్వాత కొంతమంది అనుమానితుల అధికారిక అరెస్టులను ప్రకటించవచ్చని అధికారులు సూచించారు. కేసును దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి నాయకత్వం వహిస్తున్న డిఐజి డాక్టర్ రామేశ్వర్ సింగ్, ఎస్‌పి పుష్పేంద్ర సింగ్ రాథోడ్ దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. సోదాల సమయంలో.. ఆరోపించిన డబ్బు జాడను గుర్తించడంలో సహాయపడే ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆర్థిక పత్రాలు, డైరీలు, బ్యాంకు లావాదేవీల రికార్డులను బృందాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దర్యాప్తులో ముందుగా గత అశోక్ గెహ్లోట్ ప్రభుత్వంలోని మాజీ పిహెచ్ఇడి మంత్రి మహేష్ జోషి, అనేక మంది ఇంజనీర్లను ఈ కేసుకు సంబంధించి అరెస్టు చేశారు. జల్ జీవన్ మిషన్ టెండర్లలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అధికారులు, కీలక లబ్ధిదారులపై ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు దృష్టి సారించాయి.


## వన్యప్రాణుల దాడుల్లో 32 మంది మృతి

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో గత రెండేళ్లలో వన్యప్రాణుల దాడుల్లో 32 మంది మరణించగా, 350 మంది గాయపడ్డారు. ఇది కేంద్రపాలిత ప్రాంతంలో మానవజంతు సంఘర్షణ పెరుగుతున్న సవాళ్లను సూచిస్తుంది. జమ్ముకశ్మీర్‌లో గత రెండేళ్లలో వన్యప్రాణుల దాడుల్లో 32 మంది ప్రాణాలు కోల్పోయారని ఎన్‌సి ఎమ్మెల్యే ముబారక్ గుల్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా అటవీ, పర్యావరణ, పర్యావరణ మంత్రి సోమవారం శాసనసభకు లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు. అధికారిక గణాంకాల ప్రకారం, 2023–24లో కేంద్రపాలిత ప్రాంతంలో మొత్తం 9,301 వన్యప్రాణుల దాడులు నమోదయ్యాయి, ఇందులో 18 మంది మరణించగా, 137 మంది గాయపడ్డారు. జమ్ము జిల్లాలో అత్యధికంగా 1,444 దాడులు జరగగా, ఉత్తర కశ్మీర్‌లోని సరిహద్దు జిల్లా కుప్వారాలో 1,173, కిష్త్వార్‌లో 998, బారాముల్లాలో 950, దోడాలో 826, రాంబన్‌లో 756, బండిపోరాలో 750, అనంత్‌నాగ్‌లో 667, పుల్వామాలో 367, ఉధంపూర్‌లో 230, షోపియన్‌లో 224, బుద్గామ్‌లో 218, కుల్గామ్‌లో 135, రాజౌరిలో 110, గండేర్‌బాల్‌లో 92, శ్రీనగర్‌లో 86, పూంచ్‌లో 70 మరియు రియాసిలో 15 దాడులు జరిగాయి. 2023–24 కాలంలో జమ్ముకశ్మీర్‌లో వన్యప్రాణుల దాడిని నివేదించని ఏకైక జిల్లా సాంబా. 2024–25లో కేంద్రపాలిత ప్రాంతంలో మొత్తం 6,360 వన్యప్రాణుల దాడులు జరిగాయి. 14 మంది ప్రాణాలు కోల్పోగా, 213 మంది గాయపడ్డారు. 2024–25లో అత్యధిక దాడులు జమ్ములో 1,341 జరిగాయి. తరువాత రాంబన్‌లో 686, కిష్త్వార్‌లో 673, అనంత్‌నాగ్‌లో 637, దోడాలో 609, పుల్వామాలో 381, ఉధంపూర్‌లో 311, బుద్గామ్‌లో 309, కుప్వారాలో 252, సైపాన్‌లో 219, బారాముల్లాలో 182, కథువాలో 174, బండిపోరాలో 153, కుల్గామ్‌లో 143, గండేర్‌బాల్ , పూంచ్‌లో 82, రాజౌరిలో 80, శ్రీనగర్‌లో 46 జరిగాయి. ఈ సమయంలో జమ్ము ప్రావిన్స్‌లోని సాంబా, రియాసి జిల్లాల్లో వన్యప్రాణుల దాడులు జరిగినట్లు నివేదికలు రాలేదు. రక్షిత ప్రాంతాల లోపల, వెలుపల మానవ–వన్యప్రాణుల సంఘర్షణ ఘటనలను నివారించడానికి, తగ్గించడానికిష నిర్వహించడానికి వన్యప్రాణుల శాఖ సమగ్రమైన, బహుముఖ విధానాన్ని అమలు చేసిందని మంత్రి పేర్కొన్నారు. వన్యప్రాణుల అత్యవసర పరిస్థితులు, ఘర్షణ పరిస్థితులకు నిరంతర ప్రతిస్పందనను అందించడానికి కేంద్రపాలిత ప్రాంతం అంతటా మొత్తం 42 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్‌లలో ట్రాంక్విలైజర్ తుపాకులు, మందులు, క్యాప్చర్ నెట్‌లు, బోనులు, రెస్క్యూ పరికరాలు, వాహనాలు అమర్చబడి ఉంటాయి. తక్షణ చర్య కోసం శిక్షణ పొందిన సిబ్బందిని నియమిస్తారు. మానవ జీవితానికి, ఆస్తికి ముప్పు కలిగించే వన్యప్రాణులను సురక్షితంగా పట్టుకోవడానికి దుర్బలమైన, ఘర్షణకు గురయ్యే ప్రాంతాలలో ప్రత్యేక బోనులు, సంగ్రహ పరికరాలను మోహరించారు. అటువంటి జంతువులను రక్షించి, అవసరమైతే ప్రశాంతపరుస్తారు.

### భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంలో

# రైతుల ప్రయోజనాలు కాపాడాం

### కేంద్ర వ్యవసాయశాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్




**జైపూర్ :** అమెరికాతో భారత్ చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించుకున్నారు. జాగ్రత్తగా పరిశీలించిన తరువాతే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు చెప్పుకొచ్చారు. రైతులకు ఎలాంటి హాని జరగకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని పేర్కొన్నారు. మంగళవారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శివరాజ్‌సింగ్ మాట్లాడారు. 'భారత వ్యవసాయ మంత్రిగా నేను పూర్తి బాధ్యతతో మాట్లాడుతున్నాను. వాణిజ్య ఒప్పందంలో మేము భారత రైతుల ప్రయోజనాలను పూర్తిగా చూసుకున్నాము. భారతదేశ వ్యవసాయ సమాజానికి ఎటువంటి నష్టం జరగకుండా చూసుకోవాలి' అని ఆయన అన్నారు. దిగుమతులపై చౌహాన్ మాట్లాడుతూ దేశానికి అవసరమైన వస్తువులను తీసుకురావాలని అన్నారు. నేటికీ, పప్పుధాన్యాల విషయంలో మనం స్వయం సమృద్ధిగా లేమని, మనకు అవసరమైనది వేరే దేశం నుండి వస్తే, అభ్యంతరం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. భారతదేశం దాదాపు 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ఆపిల్‌లను దిగుమతి చేసుకుంటుందని చెప్పారు. అవి టర్కీ, ఇరాన్ వంటి దేశాల నుండి వస్తాయన్నారు. ఒక లక్ష మెట్రిక్ టన్నులు అమెరికా నుండి వస్తే, అది మన రైతులను ప్రభావితం చేయకుండా చర్యలు తీసుకుంటే ఇక సమస్య ఏమిటి అని అన్నారు. పత్తి అంశంపై మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ కొరతను ఎదుర్కొంటుందని ఆయన అన్నారు. పత్తి ఉత్పత్తి తగ్గినప్పుడు, మనం దిగుమతి చేసుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ రోజూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చౌహాన్ మండిపడ్డారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఉత్పత్తి ఖర్చు కంటే 50 శాతం ఎక్కువగా నిర్ణయించాలని సిఫార్సు చేసిన స్వామినాథన్ కమిటీ నివేదికను అమలు చేయడానికి మాజీ యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యుపిఎ) ప్రభుత్వం ఎందుకు నిరాకరించిందని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. 2006–07లో రికార్డు స్థాయిలో చక్కెర ఉత్పత్తి ఉన్నప్పుడు కాంగ్రెస్ బఫర్ స్టాక్‌ను ఎందుకు సృష్టించలేదని చౌహాన్ అడిగారు. 'గోదాముల్లో వేల టన్నుల ఆహార ధాన్యాలు ఉన్నాయి. సుప్రీం కోర్టు కూడా దానిని పేదలకు పంపిణీ చేయాలని చెప్పింది. కానీ కోర్టు జోక్యం చేసుకోకూడదని యుపిఎ ప్రభుత్వం చెప్పింది' అని ఆయన అన్నారు.80 కోట్ల మంది పేదలకు ఉచిత ఆహార ధాన్యాలను అందిస్తున్నది నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వమేనని చౌహాన్ అన్నారు. రైతులు 'అన్నదాత' అని ఆయన అన్నారు, రైతుల ప్రయోజనాలను ప్రోత్సహించడానికి, సాంకేతికతతో వారిని శక్తివంతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 'రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించడం, తొలగించడం మా ప్రయత్నం. రైతుల సంక్షేమమే ఎన్‌డిఎకు అత్యంత ప్రాధాన్యత అని ఆయన అన్నారు.

## వేడి వల్లే రెండు రికార్డర్లు దెబ్బతిన్నాయ్

### అజిత్ పవార్ విమానప్రమాదంపై పౌర విమానయాన మంత్రిత్వశాఖ నోట్ విడుదల

**ముంబయి :** మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం జనవరి 28వ తేదీన కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పవార్ దుర్మరణం చెందారు. అయితే ఘటనకు సంబంధించి మంగళవారంమ పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారిక నోట్ విడుదల చేసింది. రెండు స్వతంత్ర ఫ్లైట్ రికార్డర్లు అగ్నికి ఆహుతయ్యాయని ధృవీకరించింది. లియర్‌జెట్ 45 విమానం విటి–ఎస్ఎస్‌కె ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) వివరణాత్మక దర్యాప్తు జరుపుతోందని మంత్రిత్వ శాఖ ఆ నోట్‌లో పేర్కొంది. ఎయిర్‌క్రాఫ్ట్ (ప్రమాదాలు, సంఘటనల దర్యా ప్తు) నియమాలు, 2017, అంతర్జాతీయ ప్రమాణాలు, ఐసిఎఒ అనుబంధం 13 సిఫార్సు చేసిన పద్ధతు ల ప్రకారం దర్యాప్తు కచ్చితంగా నిర్వహించనున్నట్లు తెలిపింది. వి మానంలో రెండు స్వతంత్ర ఫ్లైట్ రికార్డర్లు అమర్చబడ్డాయని, ప్రమాదం సమయంలో రెండు రికార్డర్లు చాలా సమయం పాటు తీవ్రమైన వేడికి గురయ్యాయని, దీంతో అగ్ని ప్రమాదం జరిగింది అని నోట్‌లో వెల్లడించింది. ఎల్ 3–కమ్యూనికేషన్స్ తయారు చేసిన డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ (డిఎఫ్‌డిఆర్)ను ఎఎఐబి ఫ్లైట్ రికార్డర్ లాబొరేటరీలో విజయవంతంగా డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొంది.

**పట్టాదారు పాసుబుక్ పోయినది**

సిద్దిపేట జిల్లా మండలం హుస్నాబాద్, హనుమాన్‌నగర్‌కు చెందిన **ముప్పు కొమురవ్వ భర్త రాజయ్య**కు సంబంధించిన తెలంగాణ పట్టాదారు పాస్ బుక్ పోయినది. తెలంగాణ పట్టాదారు **పాసుబుక్ ఖాతా నెంబర్ : 60329, పట్టా పాసు బుక్ నెం. T21100042678** నెం, గల సంబంధిత పట్టాదారు డిసెంబర్ నెలలో వేలేరు నుండి హుస్నాబాద్‌కు బస్‌లో ప్రయాణం చేయుచుండగా పోయినది, ఇట్టి పట్టాదారు పాసుబుక్ దొరికినవారు ఈక్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు
**ముప్పు కొమురమ్మ, భర్త : రాజయ్య,**
ఇంటి నెంబర్ : 10-46/6
గ్రామం : హనుమాన్ నగర్, హుస్నాబాద్,
మండలం : హుస్నాబాద్,
జిల్లా : సిద్దిపేట, పిన్: 505467.
**ఫోన్ నెంబర్ : 9951363318.**

# న్యాయవ్యవస్థలోకి ఎఐ చొరబాటు!

కృత్రిమ మేధస్సు (ఎఐ) సాంకేతికత న్యాయ వ్యవస్థలోకి కూడా చొరబడి, ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఎఐ వాడకం కొన్ని రంగాల్లో సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తే, మరికొన్ని రంగాల్లో అనవసర గందరగోళానికి తావిస్తున్నది. ఎఐ వినియోగంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేయడం, ఈ సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ఎంత వేగంగా, ఎంత లోతుగా వృత్తిపరమైన రంగాల్లోకి చొరబడిందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నది. కొందరు న్యాయవాదులు ఎఐ సాయంతో పిటిషన్లను సిద్ధం చేసుకొని, వాటిని ఏకంగా సుప్రీం కోర్టుకే సమర్పించడం చర్చనీయాంశమైంది. భారతీయ చట్టాల్లో ఎక్కడా లేని వివిధ కేసులను ఎఐ సృష్టించి మరీ ఉదాహరణలుగా పేర్కొనడాన్ని సుప్రీం కోర్టు తప్పుపట్టడం కొత్త సమస్యను తెరపైకి తెచ్చింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంఛుక్‌కు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం సమర్పించిన వీడియోలపై సుప్రీం కోర్టు సందేహాలు వ్యక్తం చేయడం ఈ సమస్య విస్తృతికి మరో ఉదాహరణ. ఈ రెండు సంఘటనల్లోనూ, దేశ అత్యున్నత న్యాయస్థానమే ఆందోళన వ్యక్తంచేయడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. రాబోయే ఒక పెద్ద మార్పుకు సంకేతం. కేవలం సాంకేతిక సౌలభ్యం మాత్రమే కాదు, వృత్తిపరమైన బాధ్యత, నైతిక ప్రమాణాలు, మానవ నైపుణ్యాలపై ఎఐ ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో సూచిస్తున్నది. ఎఐ వినియోగంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం తీవ్రంగా స్పందించడం, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం ముమ్మాటికీ ఒక హెచ్చరికే. నిజానికి కేసులన్నీ ఒకే రీతిలో ఉండవు కాబట్టి, పిటిషన్ల తయారీలో ఎఐ వినియోగం అవసరం లేదు. ఏదైనా ప్రశ్నకు సరైన సమాధానం తెలిసినా, లేకున్నా, ఎఐ ఏదో ఒక జవాబును సిద్ధం చేసి ఇస్తుందనేది నిజం. ఈ క్రమంలోనే లేని కేసులను, తీర్పులు ప్రస్తావించడం, కొన్ని తీర్పులకు తప్పుడు వ్యాఖ్యానాలను ఆపాదించడం వల్ల సమస్య తీవ్రరూపం దాలుస్తున్నది. వాస్తవాలు ఏమిటో తేల్చుకోవటం కోర్టులకు అదనపు భారమవుతుంది. ఇప్పటికే లక్షల సంఖ్యలో కేసులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎఐ సృష్టిస్తున్న సరికొత్త మాయాజాలం ఈ జాప్యానికి మరింత ఆజ్యం పోస్తున్నది. న్యాయవాదులు కేసులను వివరించే రచనా శక్తిని కూడా కోల్పోయే వాతావరణం నెలకొంటున్నది. కృత్రిమ మేధస్సు నేడు ఒక ప్రత్యేక రంగానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, రవాణా, భద్రత, మీడియా, ఆర్థిక వ్యవస్థ వంటి ఎన్నో రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. వైద్య రంగంలో రోగ నిర్ధారణలో ఆల్గోరిథమ్‌లు వేగాన్ని పెంచాయి. వ్యవసాయంలో పంటల అంచనాలు, వాతావరణ విశ్లేషణలు ఖచ్చితత్వాన్ని మెరుగుపరిచాయి. బ్యాంకింగ్‌లో మోసాలను గుర్తించడం సులభమైంది. మీడియా రంగంలో వార్తల స్వయంచాలక రచన సాధ్యమైంది. విద్యారంగంలో వ్యక్తిగతీకరించిన అభ్యాస విధానాలు అభివృద్ధి చెందాయి. ఈ మార్పులన్నీ ప్రయోజనకరమే... ఆశాజనకమే... కానీ, అదే సమయంలో ఎఐ సాంకేతికత కొత్త సమస్యలు సృష్టిస్తున్నది. న్యాయరంగం వంటి అత్యంత కీలకమైన వ్యవస్థలో ఎఐ వినియోగాన్ని జనాంతికం చేయడానికి వీల్లేదు. న్యాయవాదన ఒక కళ. అది కేవలం తీర్పుల నుంచి కొటేషన్లు సేకరించడం కాదు, వాస్తవాలను, చట్టాన్ని, తర్కాన్ని సమన్వయపరచి ఒక నిర్మాణాత్మక వాదనగా మలిచే ప్రక్రియ. ఎఐ సాధనాలు గత తీర్పులను వేగంగా గుర్తించగలవు. కానీ అవి సృష్టించే పాఠ్యంలో కల్పిత తీర్పులు, అసత్యమైన.. అసంబద్ధమైన వివరణలు లేదా తప్పుడు వ్యాఖ్యలు.. వ్యాఖ్యానాలు చొరబడే ప్రమాదం ఉంది. అలాంటి పత్రాలు దాఖలైతే, అవి న్యాయమూర్తులపై అదనపు భారాన్ని మోపుతాయి. ప్రతి వివరణను, ప్రతి ప్రకటనను ధ్రువీకరించుకోవాల్సి వస్తుంది. సమయం వృథా అవుతుంది. న్యాయ వ్యవస్థ సమర్థతను ప్రభావితం చేస్తుంది.

ఎఐ వినియోగాన్ని కేవలం సాంకేతికతకు సంబంధించిన అంశంగా చూడడానికి వీల్లేదు. ఇది నైతిక సమస్య కూడా. వృత్తిపరమైన బాధ్యత న్యాయవాదులపై ఉంటుంది. వారు సమర్పించే ప్రతి పత్రం వారి స్వీయ పరిశీలనతో, బాధ్యతతో రూపుదిద్దుకోవాలి. ఇలాంటి విషయాల్లో కృత్రిమ మేధస్సు సహాయక సాధనం కావచ్చు. అంతేగానీ, పూర్తి బాధ్యతను ఎఐకి అప్పగించడంతో పని పూర్తయినట్టు భావించడం ముమ్మాటికీ తప్పే. మనిషి మేధస్సుకు ఎఐ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు. ఒక న్యాయవాది తన వాదనలోని ప్రతి పదానికి బాధ్యత వహించాలి. ఆ బాధ్యతను యంత్రానికి అప్పగించడం అనేది వృత్తి ప్రమాణాలను దెబ్బతీయవచ్చు. న్యాయస్థానాల్లో ఎఐ వినియోగంపై సుప్రీం కోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలు... అభ్యంతరాలు మిగతా రంగాలకు కూడా వర్తిస్తాయి.

మీడియా రంగంలోనూ కృత్రిమ మేధస్సు చొరబడింది. ఎఐ ఆధారిత రచనల వేగం పెరుగుతున్నది. వార్తల ఖచ్చితత్వం ప్రశ్నార్థకమవుతోంది. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని తయారు చేయడం, డీప్‌ఫేక్ వీడియోలు సృష్టించడం సులభమైంది. రాజకీయ ప్రచారాల్లో కృత్రిమ మేధస్సు వినియోగం ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తుంది. విద్యారంగంలో విద్యార్థులు స్వయంగా రాయకుండా యంత్రాల సహాయంతో ఉపాధ్యాయులు ఇచ్చిన పనిని క్షణాల్లో పూర్తి చేస్తున్నారు. అభ్యాస క్రియ పూర్తిగా ధ్వంసమవుతున్నది. వృత్తిపరమైన రంగాల్లో ఎఐ విస్తృతిని.. వేగాన్ని వాడుకోవడం తప్పుకాదు. విస్తారమైన డేటాను క్షణాల్లో విశ్లేషించగల సామర్థ్యాన్ని గుర్తించి తీరాలి. కానీ, ఎఐ ఇచ్చిందే సత్యమని, అదే ప్రామాణికమని అనుకోవడానికి వీల్లేదు. లేని సమాచారాన్ని కూడా ఉన్నట్టు చూపించడం... అడిగిన ప్రశ్నకు అనుకూలంగా ఉండేలా ఏదో ఒక సమాచారాన్ని అందించడం ఎఐకి కొత్తకాదు. విశ్లేషించుకోకుండా, గుడ్డిగా నమ్మితే, పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. ప్రత్యేకించి న్యాయ వ్యవస్థలో ఎఐ వాడకం ప్రమాదాన్ని ఆహ్వానించడమే. ఒక కల్పిత తీర్పు ఆధారంగా వాదన నిర్మితమైతే, అది నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. తీర్పులను మార్చివేస్తుంది. ఫలితంగా న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం సడలిపోతుంది. సాంకేతికతను పూర్తిగా నిరాకరించడం సాధ్యం కాదు. కానీ దాని వినియోగానికి స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. నియంత్రణ అత్యవసరం. లేకపోతే అన్ని వ్యవస్థలకూ కళంకం తప్పదు. ●



## ఇసి 'తుగ్లక్' కమిషన్

రాష్ట్రంలో ఓటర్ల జాబితాలను విస్తృతంగా తారుమారు చేస్తున్నారు. బిజెపి ఐటి సెల్‌లోని ఒక మహిళా కార్యకర్త బెంగాల్‌లో 58 లక్షల మంది ఓటర్ల పేర్లను ఎఐ ఉపయోగించి తొలగించింది. ఇసి సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తోంది. ఓటర్లను లక్ష్యంగా చేసుకుని, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోంది. బిజెపి సూచనల మేరకు ఇసి పశ్చిమ బెంగాల్ ఓటర్ల పేర్లను సర్ సమయంలో తొలగిస్తోంది. బిజెపిని సంతృప్తి పరచడానికి బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు.'బెంగాల్ ప్రభుత్వ అధికారులను (ఇసి) బాధితులుగా చేస్తే, మేము వారిని 100 శాతం రక్షిస్తాము, పదవీచ్యుతి చెందిన వారిని ప్రోత్సహిస్తాము. రాష్ట్రంలో 'సర్' ఆందోళన, పని సంబంధిత ఒత్తిడి కారణంగా 160 మంది ప్రాణాలు కోల్పోయారు.

\- పశ్చిమ బెంగాల్ సిఎం మమత




## జీవన నాణ్యత పెంపు దిశగా గ్లోబల్ ఎఐ సమ్మిట్

గ్లోబల్ సౌత్, న్యూఢిల్లీ వేదికగా తొలిసారి జరుగుతున్న ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 ఫిబ్రవరి 16–20 వరకు ఐదు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నది. పీపుల్, ప్లానెట్, ప్రోగ్రెస్ (ప్రజలు, భూగ్రహం, ప్రగతి అనే మూడు సూత్రాల ఆధారంగా నిర్వహిస్తున్న ఈ ఎఐ సమ్మిట్–2026లో 30 దేశాలకు పైగా ప్రతినిధులు 700లకు పైగా ప్రతిపాదనలతో పాల్గొంటున్నారు. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్–ఎఐ) సాంకేతికతను పునాదిగా చేసుకొని అభివృద్ధి, పాలన, ప్రజా సేవల అమలులో మెరుగైన విధానాలు అవలంబించడానికి మార్గం సుగమం అయ్యింది. వికసిత్ భారత్–2047 లక్ష్యాలను చేరడానికి ఎఐ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి పరిశోధనలు జరుగుతున్నాయి. న్యూఢిల్లీ భారత్ మండపం వేదికగా జరుగుతున్న ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ, ఇండియా ఎఐ మిషన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా అనబడే సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

**ఇండియాలో ఎఐ టెక్నాలజీ పాత్ర, ప్రాధాన్యం:** భారత ఆర్థిక ప్రగతి వేగాన్ని పెంచడం, మెరుగైన ఫలితాలను పాలనలో సంస్కరణలు చేయడం, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడం లాంటి లక్ష్యాల సాధనలో ఎఐ ప్రక్రియను మరింత లాభదాయకంగా వినియోగించడానికి ఈ వేదిక మార్గాలను సూచిస్తుంది. సమ్మిట్ త్రిసూత్రాల్లో ప్రజలు, భూగ్రహం, ప్రగతి (పీపుల్, ప్లానెట్, ప్రోగ్రెస్)లను నిర్ణయించుకొని చర్చలు జరుపుతున్నది. ప్రజారోగ్యం(టెలీమెడిసిన్, రోగ నిర్ధారణ, ఔషధ ఆవిష్కరణ), వ్యవసాయం గ్రామీణాభివృద్ధి, (వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ ఉత్పత్తులు పెంచడం, రైతుల ఆదాయం పెంచడం), విద్య(అనువాదాలు, 24/7 బోధనలు, అన్ని స్థాయిల విద్యార్థులకు బోధనలు), ఆర్థికం వాణిజ్యం(ఆర్థిక భద్రత, సమ్మిళిత అభివృద్ధి, సేవల్లో దక్షత పెంచడం, బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట), పాలన ప్రజా సేవలు(తీర్పుల అనువాదం, సేవలను అర్హులకు అందించడం, పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన పాలన) లాంటి రంగాల్లో ఎఐని వినియోగించి సమూల సానుకూల మార్పులు చేయడానికి అత్యాధునిక ఎఐ టెక్నాలజీ వాడనున్నారు. ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026లో ప్రధాన గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజెస్ అంశాలుగా ఎఐ ఫర్ ఆల్(అందరికీ ఎఐ), ఎఐ ఫర్ హర్ (మహిళలకు ఎఐ), ఎఐ ఫర్ యూత్ (యువతకు ఎఐ), ఎఐ పరిశోధనలు, భారత ఎఐ పరిశోధకులు(థింక్ ట్రూనర్స్) అనబడే రంగాలను ఎన్నుకున్నారు. ప్రభుత్వ పారదర్శక పాలన, ప్రజా సంక్షేమ సేవల సమర్థవంతమైన అమలు, పరిశోధనలకు ప్రాధాన్యం పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకోవడానికి ఎఐ టెక్నాలజీ ఉపకరించనుందని ఆశిద్దాం.

**(16–20 ఫిబ్రవరి : ఇండియా – ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026 న్యూఢిల్లీలో జరుగుతున్న శుభ సందర్భంగా)**

## సమష్టితత్వమే మానవ విధానం

అంబరాన్నంటే భవంతుల్లో జీవిస్తూ, విశాలమైన గదుల్లో విహరిస్తున్న వర్తమానంలో మనసు గదులు ఇరుకైపోయాయి. నాగరికత పెరిగిందనే భ్రమలో బ్రతుకుతూ, అనాగరికాన్ని పెంచి పోషిస్తున్నాం. పెరిగిన మనిషిలో తరిగిన మనసు అప్యాయతలకు ప్రతిబంధకం విలువలకు తిలోదకం. మనిషిలో స్వార్థ చింతన పెరిగింది. సామాజిక స్పృహ కొరవడింది. విజ్ఞానం పెరిగినా, వికాసం పూజ్యం వివేకం శూన్యం. మానవ మేధస్సు శిఖరాగ్రానికి ఎదిగినా, విచక్షణ అధఃపాతాళానికి అడుగంటింది. విజ్ఞానం స్వలాభానికే తప్ప, సమాజానికి పనికిరావడం లేదు. తరతరాలకు తరగని సంపద కూడబెట్టడంలో ఉన్న శ్రద్ధ కొద్దిపాటి సమయం, ధనం జనం కోసం వెచ్చించడంలో చూపడం లేదు. ధనవంతుల ధోరణి ఒక రకంగా ఉంటే, మధ్య, దిగువ తరగతి ప్రజల ధోరణి మరో రకంగా ఉంటున్నది. కరెన్సీ పరుపులపై పవళించే వారిలో లోభగుణం...దేశంపట్ల శ్రద్ధ చూపితే మాకేంటి లాభం అన్న దుర్గుణం వ్రేళ్ళూనుకు పోయింది. ఈ పూట గడిస్తే చాలన్న ధోరణి పేదవారిని మరింత పేదరికంలోకి నెడుతున్నది. పిట్టను కొట్టి పొయ్యిలో పెట్టే తాత్కాలిక ఆనందం భవిష్యత్తులో జీవిత భద్రతను అంధకార బంధురం చేస్తుంది. మనిషిని మనిషే కాటేసే ఆధునిక కాలంలో పేదల బ్రతుకులు అనునిత్యం నరకతుల్యమే. వాస్తవం తెలుసుకుని బ్రతుకు భద్రతకు మార్గం సుగమం చేసుకోవాలి. 'వర్తమానం' గతం కంటే విరుద్ధంగా నడుస్తున్నది. వర్తమానంలో జరుగుతున్న సంఘటనలు,పెరుగుతున్న అంతరాలకు...తరుగుతున్న మానవ సంబంధాలకు ప్రతీక గా భావించాలి. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలన్న మన పెద్దల మాటలు నడుస్తున్న మానవ చరిత్రకు అద్దం పడుతున్నాయి. ఆధునిక మానవుల్లో ఆటవిక స్వభావం పెరిగింది. నాగరికపు మేలి ముసుగులో అనాగరికం తాండవిస్తున్నది. వసుధైక కుటుంబ భావన బరువైనది. మానవత్వమే కరువైనది. మనసున్న మనుషులు లేని నవనాగరికంలో నా వారు..నా కుటుంబం..అనే రోజులు కూడా అంతరించిపోయి 'చిన్ని నా పొట్టకు శ్రీరామ రక్ష.' అనే కాలం బంధాలను కాటేయడానికి కాల సర్పంలా కాచుకుని కూర్చుంది. మానవ మస్తిష్కంలో తిష్ఠవేస్తున్న నకారాత్మక ఆలోచనలు భవిష్య మానవ జీవిత ముఖచిత్రాన్ని రేఖా మాత్రంగానైనా మన కనుల ముందు మసక వెలుతురులో కనీకనిపించని దృశ్యంలా సాక్ష్యాత్కరింప చేస్తున్నది. సమష్టితత్వమే మానవతత్వం కావాలి. సాటి మనిషిని మనిషిగా చూసే కనీస మానవత్వం మొద్దుబారిన మానవ మస్తిష్కాల్లో అంకురించాలి. మానవీయ విలువలు చిగురించాలి.

సుంకవల్లి సత్తిరాజు, 9704903463

# యుజిసి నిబంధనలపై ఆధిపత్యవర్గాల ఆందోళన



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) తీసుకువచ్చిన 'ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించటం–2026' అనే నిబంధనలకు వ్యతిరేకంగా కొన్ని సామాజిక ఆధిపత్య వర్గాలలో చెలరేగిన ఆగ్రహం, కుల వ్యవస్థను 'గౌరవ ఆరోహణక్రమం, తృణీకరణ అవరోహణ క్రమం' గా బి.ఆర్.అంబేద్కర్ వర్ణించిన విధానాన్ని పునరుద్ఘాటించింది. పాతుకుపోయిన అసమానతలను పరిష్కరించేందుకు సంస్థాగత యంత్రాంగాలు ప్రయత్నించినప్పుడు, ఈ నిబంధనలకు వ్యతిరేకంగా బలమైన ప్రతిస్పందన ఆధిపత్య సామాజిక సమూహాలలో లోతైన అశాంతిని బహిర్గతం చేస్తుంది.

ఎస్‌సి,ఎస్‌టి, ఒబిసి వర్గాలకు చెందిన విద్యార్థులకు, అలాగే మహిళలు, వికలాంగులకు సంస్థాగత పరిష్కారాలను అందించేందుకు ఈ నిబంధనలు రూపొందించారని గుర్తుచేసుకోవాలి. ఈ నిబంధనలు అలాంటి విద్యార్థులు తమ గుర్తింపు కారణంగా వివక్షత లేదా అగౌరవాన్ని ఎదుర్కొన్నప్పుడు ఫిర్యాదులను నమోదు చేసుకోవడానికి వీలు కల్పించాయి. 2026 నిబంధనలు పర్యవేక్షణ కమిటీల ఏర్పాటును తప్పనిసరి చేయడం, అంగీకారం అవసరం లేదనే నిబంధనను ప్రవేశపెట్టడం ద్వారా మునుపటి మార్గదర్శకాల నుండి దూరం జరిగినట్లు చెప్పుకోవచ్చు. విశ్వ విద్యాలయాలు, కళాశాలలకు వీటి అమలును తప్పనిసరి చేశాయి. అమలు చేయాలన్న ఈ ఆదేశం స్థిరపడిన ప్రయోజనాలను తలకిందులు చేసినట్లు కనిపిస్తుంది. గత ఐదు సంవత్సరాలలో ఉన్నత విద్యా సంస్థల్లో కుల ఆధారిత వివక్షకు సంబంధించిన ఫిర్యాదులు 100 శాతానికి పైగా పెరిగాయని అధికారికంగా అంగీకరించబడిన డేటా నేపథ్యంలో ఈ నిబంధనలను రూపొందించారు.

అందుకే, నిబంధనల పట్ల శతృత్వం తమను అందులో మినహాయించినందుకు కాదు, న్యాయం, సమానత్వం అనే రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా ప్రతిఘటనను ప్రతిబింబిస్తుంది. ఉన్నత కులాల విభాగాలు చేపట్టిన ఆందోళన, నిచ్చెనమెట్లలో దిగువ స్థానంలో ఉన్నవారి పట్ల తృణీకరణను సాధారణీకరిస్తూ, ఆధిపత్యవర్గాల హక్కులను రక్షించే వ్యవస్థగా కులంపై అంబేద్కర్ చేసిన విశ్లేషణకు సరిగ్గా సరిపోతుంది.

కుల ఆధారిత తృణీకరణ కాలం, సామాజిక హోదాకు అతీతంగా ఎలా మనుగడ సాగిస్తుందో భారతీయ చరిత్ర తగినన్ని సాక్ష్యాలను అందిస్తుంది. 'మై ప్లాన్ ఆఫ్ క్యాంపెయిన్' అనే శీర్షికతో స్వామి వివేకానంద చేసిన ప్రసంగంలో తనను పుట్టుకతో శూద్రుడిగా పరిగణించినందున సన్యాసిగా మారే హక్కు లేదని చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. 'వారు నన్ను శూద్రుడు అని పిలిస్తే నాకు ఏమాత్రం బాధగా లేదు' అని, అది 'నా పూర్వీకులు పేదలపై చేసిన దౌర్జన్యానికి ఒక చిన్న పరిహారం' అని వివేకానంద అన్నారు.

అదేవిధంగా, 1997లో కె.ఆర్. నారాయణన్ రాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు, అత్యున్నత రాజ్యాంగ పదవికి ఆయన ఎదగడంలో కులం ఎటువంటి పాత్ర పోషించనప్పటికీ, 'తొలి దళిత రాష్ట్రపతి' కావడం ఎలా అనిపిస్తుందని మీడియా వర్గాలు ఆయనను అడిగారు. 'రాష్ట్రపతి అంటే రాష్ట్రపతే' అనే ఆయన ప్రతిస్పందన ఆ ప్రశ్నలోనే నిక్షిప్తమైన పక్షపాతాన్ని బహిర్గతం చేసింది.

ఇటీవల మాజీ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌కు సంబంధించిన ఘటన, రాజ్యాంగ వ్యవస్థతో సంబంధం లేకుండా కుల ఆధారిత తృణీకరణను ఎలా నిర్భయంగా వ్యక్తపరుస్తున్నారో వెల్లడించింది. ఒక న్యాయవాది 'సనాతన్ ధర్మ్ కా అప్‌మాన్ నహి సహేగా హిందూస్తాన్ (సనాతన ధర్మానికి అవమానాన్ని భారతదేశం సహించదు)' అని అరుస్తూ కోర్టులో ఆయనపై బూటు విసిరాడు. ఈ చర్యను కలవరపెట్టే రీతిలో హిందుత్వ పర్యావరణ వ్యవస్థలోని కొన్ని విభాగాలు సంబరాలు జరుపుకున్నాయి. యుజిసి సమానత్వనిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన, హిందుత్వను కులానికి అతీతంగా ఏకీకృత శక్తి అని చెప్పుకోవడంలోని డొల్లతనాన్ని బయటపెడుతుంది. కులం అనేది కేవలం శ్రమ విభజన మాత్రమే కాదు, శ్రామికుల విభజన – శ్రామికులను గ్రేడ్‌లుగా ఏర్పాటు చేసిన వ్యవస్థ అని అంబేద్కర్ హెచ్చరించారు. కులాన్ని నిర్మూలించడానికి బదులుగా, హిందుత్వం సామాజిక సంబంధాలను కఠినమైన, అసమాన నిర్మాణాలుగా స్తంభింపజేయడం ద్వారా ఈ శ్రేణులతో కూడిన నిచ్చెనమెట్ల విధానాన్ని పునరుత్పత్తి చేస్తుంది. ఇది కులరహిత హిందూ సమాజాన్ని కాదు, వారసత్వంగా వచ్చిన ఆధిపత్యం, పరాధీనత చుట్టూ శాశ్వతంగా వ్యవస్థీకృతమైన సమాజాన్ని సృష్టిస్తుంది.

విద్యపై పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన అనేక సిఫార్సులను ముఖ్యంగా విస్తృత సంప్రదింపులు, స్పష్టమైన రక్షణలను నొక్కి చెప్పేవి విస్మరించినందుకు యుజిసి కూడా బాధ్యత వహించాలి. అయితే మూల సమస్య రాజకీయంగానే ఉంది. హిందుత్వం అనేది మతపరమైన వర్గాల మధ్య మాత్రమే కాకుండా హిందూ సమాజంలో కూడా అసమానతను పెంచే భావజాలంగా బహిర్గతమైంది.

అంబేద్కర్ పదే పదే వాదించినట్లు గా, కులం జాతి వ్యతిరేకమైనది, కులాన్ని నిర్మూలించేందుకు సమానత్వాన్ని నిలబెట్టేందుకు ఉద్దేశించిన చర్యలను ప్రతిఘటించడం భారతదేశ రాజ్యాంగ దృక్పథాన్ని ప్రతిఘటించడంతో సమానం.

# అవాస్తవాలు చెబుతున్నదెవరు? పియూష్ గోయలా, రాహుల్ గాంధీనా?



ఎం.కోటేశ్వరరావు

రైతులు నిజంగా అమాయకులే, ముల్లుగర్రతో ఎద్దుముడ్డి మీద పొడవటం తప్పఏమీ తెలియదు,(కొంత మందికి ఇప్పుడు ఎద్దులతో సాగు చేస్తారని తెలియదు, వాటి స్థానంలో ట్రాక్టర్లు, ఇతర పరికరాలు వచ్చాయి) ఏం చెప్పినా తలూపుతారన్న గట్టి విశ్వాసం లేకపోతే మన వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ అలా ఎందుకు మాట్లాడతారు. అమెరికా మన దేశంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మన ఎగుమతులపై 18శాతం దిగుమతి పన్ను విధిస్తారు. అదే బంగ్లాదేశ్‌తో చేసుకున్న అవగాహన ప్రకారం దిగుమతి చేసుకొనే దుస్తులపై అమెరికా ఎలాంటి పన్ను విధించదు. ఈ అంశం మన దేశ వస్త్రపరిశ్రమ,వాణిజ్యవేత్తలలో ఆందోళనకు గురిచేసింది. దాంతో కేంద్ర మంత్రి రంగంలోకి దిగారు.మనకూ అలాంటి సౌకర్యం ఉందన్నారు. ఉంటే అమెరికా జారీ చేసిన ప్రకటనలో ఆ వివరం ఎందుకు లేదు ! అదంతే,మనకా రాయితీ ఎలా వస్తుందంటే మనం కూడా అమెరికా పత్తి దిగుమతి చేసుకుంటే ఎలాంటి పన్నులూ ఉండవని, ఈ అంశాన్ని సంతకాల సమయానికి ఒప్పందంలో భాగంగా చేర్చుతామని చెప్పారు. ఖాళీ చెక్కు మీద సంతకం చేసినపుడు ఎంతమొత్తమైనా రాసుకోవచ్చు. అమెరికాతో అలాంటి అవగాహనకు వచ్చినందున ఇంకా ఇలాంటి వాటిని మరెన్నింటిని చేర్చుతారో ! ఆ నిబంధన రైతాంగానికి నష్టం కదా అంటే కాదని సెలవిచ్చా రు. ఎందుకటా, అమెరికాలో పత్తి పరిమితంగానే పండుతుంది గనుక అన్నారు. ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరిగేందుకు చూస్తున్నారు గనుకనే అడుగడుగునా అనుమానించాల్సిందే. ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తగా పియూష్ గోయల్ కూడా అదే స్థాయిలో విరుచుకుపడ్డారు. ముందు ఎవరేం చెప్పారో ? చూద్దాం !

అమెరికాతో కుదిరిన ఒప్పందంతో వచ్చే ముప్పు గురించి అనేక రైతు సంఘాల ప్రతినిధులు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిసి దానిపై గళమెత్తాలని కోరారు. అదేమీ తప్పు కాదు, అన్ని పార్టీల నేతలను అలా కలిసిన ఉదంతాలు ఎన్నో. కొంత మందిని రప్పించుకొని రాహుల్ నాటకమాడుతున్నారని కేంద్ర వాణిజ్యశాఖ పియూష్ గోయల్ ఆరోపించారు. రైతులు, వస్త్ర పరిశ్రమ వర్గాల్లో భయాన్ని రేపుతున్నారని అన్నారు. వాస్తవాలు తెలియకుండా తన అవివేకాన్ని స్వయంగా బయటపెట్టుకున్నారని, దేశ అభివృద్ధిని దెబ్బతీయాలని చూస్తున్నారని, ప్రతికూల రాజకీయాలకు పాల్పడుతున్నారని కూడా ధ్వజమెత్తారు. '' కఠిన వాస్తవాలు '' అంటూ ఎక్స్‌లో కొన్ని విషయాలను మంత్రి పోస్టు చేశారు. అభివృద్ధి చెందిన 38దేశాలతో కుదుర్చుకున్న తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో ఇప్పుడున్న నాలుగు లక్షల కోట్ల రూపాయల వస్త్ర ఎగుమతులు 45 లక్షల కోట్లకు పెరుగుతాయంటే ఎంతగా వృద్ధి అవకాశాలు ఉన్నాయో, స్త్రీ, పురుషులకు లక్షలాది ఉద్యోగాలు ఎలా వస్తాయో ఊహించుకోవచ్చన్నారు. అమెరికా పత్తి ఉత్పత్తి చాల తక్కువని, స్థానిక అవసరాలకు పోను ఆరుబిలియన్ డాలర్ల విలువగల పత్తి, నూలు ఎగుమతులు చేస్తున్నారని, భారత్ నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువగల పత్తి, నూలును బంగ్లాదేశ్ దిగుమతి చేసుకుంటున్న విషయం రాహుల్‌కు తెలియదని అన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం పాలన సాగించిన రోజుల్లో అమల్లోకి తెచ్చిన సెజ్ చట్టం నిబంధన 27(1) ప్రకారం ఎగుమతి చేసే వస్తువులకు గాను పత్తితో సహా ముడివస్తువులను ఎలాంటి పన్ను లేకుండా దిగుమతి చేసుకోవచ్చని, ఎగుమతుల కోసం సున్నా పన్నుల విధానం తెచ్చిన స్వంత పార్టీ మీదే రాహుల్ గాంధీ దాడి చేస్తున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. అంతకు ముందు రోజు రాహుల్ గాంధీ ఎక్స్ ద్వారా ప్రభుత్వ విధానాన్ని విమర్శించారు. ప్రభుత్వం ఊబిలోకి నడుస్తూ కోట్లాది మందిని దానిలోకి లాక్కుపోతున్నదని పేర్కొన్నారు. పద్దెనిమిది, సున్నా శాతం పన్నులంటూ జనాన్ని ప్రభుత్వం గందరగోళపరుస్తున్నదని అవాస్తవాలు చెప్పటంలో ప్రధాని ఎంతో నిపుణులని, మంత్రివర్గం గందరగోళాన్ని వ్యాపింప చేస్తున్నదని విమర్శించారు. బంగ్లాదేశ్‌కు అమెరికా ఇచ్చిన ప్రత్యేక రాయితీ మనకూ రావాలంటే మనం కూడా అమెరికా పత్తి దిగుమతి చేసుకోవాల్సి ఉందని రాహుల్ పేర్కొన్నారు.పత్తి వివరాలేమిటి, ఎవరు చెబుతున్నది వాస్తవం, ఎవరిది అవాస్తవం !

ప్రపంచ పత్తి ఉత్పత్తి వివరాలను చూస్తే చైనాలో 7.5, భారత్‌లో 5.1,బ్రెజిల్ 4.1, అమెరికాలో 3,పాకిస్తాన్‌లో 1.1మిలియన్ టన్నుల పత్తి పండిందని 2025 అంచనా. బ్రెజిల్‌లో ప్రతి మనిషికి 0.19మి.ట, అమెరికాలో 0.088, చైనాలో 0.052,మనదేశంలో 0.032 మి. టన్నులు ఉంది. ఈ వివరాలన్నీ తెలియకుండానే గోయల్ అమాత్యగిరీ వెలగబెడుతున్నారని అనుకోవాలా? 2024 వివరాల ప్రకారం ప్రపంచంలో 90 లక్షల టన్నుల ఎగుమతి జరగ్గా బ్రెజిల్ 27.74, అమెరికా 24.91, మన దేశం 4.65లక్షల టన్నులు ఎగుమతి చేసింది. రెండవ స్థానంలో ఉన్న మనం అంత తక్కువ, నాలుగవదిగా ఉన్న అమెరికా అంత ఎక్కువ ఎందుకు ఎగుమతి చేస్తున్నట్లు ! మనకంటే ఎక్కువగా పండిస్తున్నప్పటికీ చైనా ఎందుకు దిగుమతి చేసుకొంటోందంటే అక్కడ వస్త్ర పరిశ్రమకు అవసరం, తద్వారా విదేశాలకు ఎగుమతి చేసి లబ్ది పొందుతోంది.మన దేశంలో ఐదు కోట్లకు పైగా కదుళ్లు ఉండగా చైనా పది కోట్లు కలిగి ఉంది, వాటితో అక్కడి జనాభాకు పని కల్పిస్తోంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో నిమిత్తం లేకుండానే పిలుపులు ఇచ్చిన మన మేకిన్, మేడిన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ సంగతేమిటి ? ఒక మౌలిక ప్రశ్న ఏమంటే వస్త్ర ఎగుమతులకు నిజంగా అంత అవకాశం ఉంటే మోడీ సర్కార్ 12 సంవత్సరాలపాటు అలాంటి ఒప్పందాలను ఎందుకు చేసుకోలేదు ? లక్షలాది మందికి ఉపాధి ఎందుకు కల్పించలేదు ?

మన రైతాంగం, పరిశ్రమ బంగ్లాదేశ్ గురించి ఎందుకు భయపడాలి? బంగ్లాదేశ్ ప్రధాన ఉత్పత్తి వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు. అక్కడ పత్తి పెద్దగా పండదు, దిగుమతి చేసుకోవాల్సిందే. ప్రస్తుతం ప్రపంచంలో అదే ఎక్కువగా ఇతర దేశాల నుంచి తెచ్చుకుంటున్నది. వస్త్ర ఉత్పత్తులతో చైనా, భారత్, వియత్నాం వంటి దేశాలను సవాలు చేస్తున్నది. తాజా ఒప్పందం ప్రకారం అమెరికా నుంచి నూలు, పత్తి దిగుమతి చేసుకొని దుస్తులను తమకు ఎగుమతి చేస్తే ఎలాంటి పన్నులు ఉండవు అన్న వెసులుబాటు అమెరికా కల్పించింది. నిజానికి అది తమ పత్తి కొనుగోలు చేయాలనే షరతును రుద్దింది.ఒక దశలో షేక్ హసీనా పదవీచ్యుతురాలు గాక ముందు మన పత్తి, నూలు ఎగుమతుల్లో 70శాతం బంగ్లాదేశ్‌కే జరిగాయి.పైకి ఎన్ని చెప్పినప్పటికీ ఇప్పుడు అక్కడ మనకు వ్యతిరేకమైన బిఎన్‌పి అధికారానికి వచ్చింది. అక్కడి నుంచి అమెరికాకు ఎగుమతి చేసే రెడీమేడ్ దుస్తులలో 70 శాతం అమెరికా ముడి సరకులేఉంటే ఎలాంటి దిగుమతి పన్ను ఉండదు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం పత్తి సంవత్సరం 2025–26(అక్టోబరు నుంచి సెప్టెంబరు వరకు) బంగ్లాదేశ్ 84లక్షల బేళ్ల పత్తి దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది. బ్రెజిల్ నుంచి 19(22శాతం) భారత్ నుంచి 14(15శాతం) బెనిన్ 10.6, కామెరూన్ 6.2, అమెరికా, ఆస్ట్రేలియాల నుంచి 5.95లక్షల బేళ్ల వంతున దిగుమతి చేసుకోవాలని తలపెట్టింది. ఇప్పుడు తాజా ఒప్పందంతో అమెరికా నుంచి దిగుమతులు భారీగా పెరుగుతాయని భావిస్తున్నారు. మన పత్తి కంటే అమెరికా సరకు రేట్లు తక్కువ, ఎందుకని? 2026లో ఒక పౌను(453 గ్రాములు) దూదికి ప్రభుత్వ సాయంగా 55 సెంట్లు, మన నగదులో రు.50 ఇస్తుంది. అంతమొత్తం సబ్సిడీ పొందుతున్న తరువాత ప్రపంచానికి చౌకధరలకు పత్తి ఎగుమతులు చేయకుండా ఎలా ఉంటుంది. పైసా పైసా లాభాన్ని లెక్కవేసుకొనేవారు అమెరికా పత్తికి ఎగబడక చస్తారా ? బంగ్లాదేశీయులు దూరంగా ఉంటారా ? ట్రంప్ విధించిన పన్నులతో మన ఎగుమతిదారులు అమెరికన్లకు చౌకగా దుస్తులు అందించలేకపోతున్నారని అచ్చే దిన్‌కు దూరం చేస్తున్నారనే ''జాలి గుండె '' నరేంద్రమోడీ సర్కార్ అక్కడి నుంచి దిగుమతి చేసుకొనే పత్తిపై 11శాతం పన్ను తగ్గించింది. పొడవు పింజ పత్తిని మాత్రమే దిగుమతికి అనుమతించామంటారు, రెండు తెలుగు రాష్ట్రాలు, దక్షిణాదిన పండేది అదే గనుక మన రైతులకు వెయ్యి నుంచి రెండువేల వరకు నష్టం వచ్చింది, అయితేనేం అమెరికన్లకు తక్కువ ధరలకు దుస్తులను అందించినందుకు మన బిజెపి నేతలు తమ భుజాలను తామే చరుచుకున్నారు. ఇప్పుడు కూడా అమెరికా నుంచి దిగుమతులు చేసుకోవాలని పియూష్ గోయల్ చెబుతున్నారు. అంటే ఈ ఏడాది కూడా పత్తి రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు పూనుకున్నారు. ప్రభుత్వం ఎన్ని సబ్సిడీలు ఇచ్చినా పత్తి సాగు గిట్టుబాటు కావటం లేదంటూ అమెరికన్ రైతులు విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. దాంతో ట్రంప్ ప్రభుత్వం రంగంలోకి దిగి వాణిజ్య ఒప్పందాల్లో తమ వ్యవసాయ ఉత్పత్తులను కొనాల్సిందే అనే షరతులు పెడుతోంది. బ్రెజిల్ నుంచి పత్తి ఎగుమతుల్లో తీవ్ర పోటీ ఎదురుకావటంతో సబ్సిడీలతో రంగంలోకి దిగనుంది.

అమెరికాతో ఒప్పందం గురించి అడుగడుగునా దాగుడుమూతలే,పైకి చెబుతున్నది ఒకటి లోపల మరొకటి జరుగుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి. వివిధ రకాల ధాన్యాల నుంచి అమెరికాలో ఎథనాల్ తయారు చేస్తారు, ఆ క్రమంలో వచ్చే పిప్పి లేదా చెక్కను పశువుల దాణాగా వినియోగిస్తారు. తాజా ఒప్పందం ప్రకారం దాన్ని మనం ఎలాంటి పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలి, అది కోళ్ల ఫారాల యజమానులకు లబ్ది కలిగిస్తుంది, ఫిబ్రవరి పన్నెండున కార్మికుల సార్వత్రిక సమ్మె సందర్భంగా రైతులు మద్దతు ప్రకటించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే ఐదేండ్ల పాటు ప్రతి ఏటా వంద బిలియన్ డాలర్ల అమెరికన్ వస్తువులు, ఇంధనాన్ని కొనుగోలు చేసేందుకు భారత్ అంగీకరించినట్లు తొలుత చెప్పారు. తరువాత మాట మార్చి అంగీకారం కాదు వాంఛిస్తున్నదని సవరించారు. ముందే చెప్పుకున్నట్లు పైకి చెబుతున్నది ఒకటి లోపల జరుగుతున్నది మరొకటి.అమెరికా నుంచి పప్పు ధాన్యాలను కూడా దిగుమతి చేసుంటారని ట్రంప్ యంత్రాంగం ''వాస్తవాల పత్రం''లో చెప్పింది. మన రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో మాట మార్చింది. డిజిటల్ సేవలపై పన్నులు ఎత్తివేసేందుకు మోడీ సర్కార్ అంగీకరించిందని తొలుత ప్రకటించారు. తరువాత దానికి సంబంధించిన పేరాను తొలగించారు. దాని బదులు డిజిటల్ వాణిజ్య సేవల గురించి సంప్రదింపులు జరిపేందుకు అంగీకరించిందని మార్చారు. ఇలా అమెరికా రోజుకొక మాట చెబుతున్నా మోడీ నోరు విప్పటం లేదు, ఇదేమని అడిగిన వారిని అభివృద్ధి నిరోధకులు, దేశ వ్యతిరేకులని ముద్ర వేస్తున్నారు. మార్చి నెలలో సంతకాలు జరుగుతాయని చెబుతున్న ఒప్పందంలో ఇంకెన్ని చేరుస్తారో, మరెన్ని షరతులకు అంగీకరిస్తారో వేచి చూద్దాం .



# వ్యవసాయ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా:** రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న వ్యవసాయ యంత్రాలను పొందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. హాలియా మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం రైతులకు వ్యవసాయ యంత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఆయన రైతులకు అందజేశారు. ఈసందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత రెండు సంవత్సరాలుగా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు.ఇందులో భాగంగా రైతులకు ఎంతో ఉపయోగమైన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తీసుకువచ్చినట్లు ఆయన అన్నారు. హాలియా వ్యవసాయ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా లబ్ధిదారులకు మంజూరైన వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేశామన్నారు. ఇట్టి పథకం ద్వారా రైతులకు ఉపయోగకరమైన కోత మిషన్లు రోటవేటర్లు, గడ్డి యంత్రాలు, స్ప్రేయర్లు లతోపాటు పలు వ్యవసాయ యంత్రాలు 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాలియా నిడమనూరు మార్కెట్ చైర్మన్ లు తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి,అంకతి సత్యం,హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్,మార్కెట్ వైస్ చైర్మన్ కాల్ సాని చంద్రశేఖర్,ఏడిఏ సరిత,బోనో ఫోర్ తెలుగు రాష్ట్రాల అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ షేక్ మహ్మద్ రఫీ,మండల వ్యవసాయ అధికారులు వెంకన్న,మునికృష్ణ పాల్గొన్నారు.

# అత్యంత భక్తిభావంతో సేవాలాల్ జయంతి ఉత్సవాలు : నారాయన్ అమిత్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 23న జరగనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను బంజారా సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని అత్యంత వైభవంగా జరుపుకోవాలని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాలు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన డీఎస్పీ రాజశేఖర్రాజుతో కలిసి పాల్గొని మాట్లాడారు. బంజారాలో అత్యంత భక్తి భావంతో జరుపుకునే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి బంజారా నేతలదేనన్నారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారుల ద్వారా చేయించడం జరుగుతుందన్నారు. ఉత్సవాలు జరిగే రోజు డప్పు వాయిద్యాలు, గిరిజన వేషాధారణ, ర్యాలికి ఎటువంటి ఆటంకం లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటారని అన్నారు. సమావేశంలో తహసీల్దార్లు శ్రీనివాస్, జవహర్లాల్, రాగ్యానాయక్, ఎంపీడీవోలు కరుణాకర్, గిరిజన సంఘం నాయకులు నాగునాయక్, రవినాయక్, ఎర్రనాయక్, మానియానాయక్, సర్పంచ్లు సిద్ధునాయక్, శ్రీహరినాయక్, దాస్యనాయక్, కౌన్సిలర్లు అశోక్నాయక్, సుధాకర్ నాయక్, ఉద్యోగ సంఘాల నాయకులు మాలోతు దశరదనాయక్, కుర్ర కృష్ణ, భాష్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పనులు 65 శాతం పూర్తి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గంలో ఓటరు జాబితా విస్తృత సవరణ(ఎస్ఐఆర్) పనులు 65శాతం పూర్తయినట్లు తహసీల్దార్, నియోజకవర్గ ఎఐఆర్వో పి.శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించిన అనంతరం కార్యాలయంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని మాడ్గులపల్లి, వేములపల్లి, దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలాలు, మిర్యాలగూడ పట్టణంలో 2,41,657 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 1,57,270 మంది ఓటర్లను బీఎల్వోలు ఓటర జాబితాలోని ఓటర్లను సరిచేశారని తెలిపారు. నియోజకవర్గంలోని 300 మంది బీఎల్వోలు, ఆశా వర్కర్లు ఎస్ఐఆర్ 65శాతం చేశారని ఆయన తెలిపారు. మార్చి నెలలో పూర్తి చేస్తారని ఆయన తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్కుమార్, ఆర్ఐ టి.రామకృష్ణలు ఉన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు

## టిఎంయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లయ్య డిమాండ్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆర్టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయు) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుడిగ పుల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి సుంకర శ్రీనివాస్, గౌరోజు అంజయ్యలు డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్టిసి డిపో ఎదుట ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24వ తేదీన తలపెట్టిన ఛలో సెక్రటేరియట్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను నేటికి నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాష్ట్ర జెఏసి ఆధ్వర్యంలో సమ్మె చేసేందుకు సిద్ధంకాగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమ్మె చేయడం వల్ల రవాణా ఆగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారని మీ సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పడంతో నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నామని అన్నారు. కానీ నేటికి ఆర్టిసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఫ్రీ బస్సు రావడం సంతోషకరమైన విషయమన్నారు. అలాగే 2017 పే స్కేల్, 2021 పే స్కేల్ ఇస్తామని, ఆర్టిసి కార్మికులు ఎవరైనా చనిపోతే వారి పిల్లలకు వారి స్థానంలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ఏ ఒక్కటి అమలుకు నోచుకోలేదన్నారు. ఆర్టిసి ఉద్యోగులు ఛలో సెక్రటేరియట్కు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ రీజినల్ కార్యదర్శి ఎస్ఎస్ గౌడ్, డిపో కార్యదర్శి మాచర్ల భాస్కర్, నాయకులు ఎండి గని, చెరుకు వెంకటయ్య, యంలక్ష్మయ్య, రమేష్, అలివేలు, సైదమ్మ, రాజేశ్వరి, సుజాత పాల్గొన్నారు.



# ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకే ఫుట్ పాత్ డివైడర్ తొలగింపు

## చిరు వ్యాపారుల దుకాణాలన్నీ పాత కలెక్టరేట్లోకి తరలింపు..

## వ్యాపారాలు నిర్వహించుకునే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి వెల్లడి




**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంలో భాగంగా జిల్లా కేంద్రానికి గుండెకాయలా ఉన్న ప్రకాశం బజార్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 4 గంటల నుండే ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని లతీఫ్ సాబ్ గుట్ట,ప్రకాశం బజార్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ప్రకాశం బజార్లో ఫుట్ పాత్ పై చిరు వ్యాపారులు,పూలు,పండ్ల వ్యాపారాలు చేసుకునేవారు డివైడర్ మధ్యలో వాటిని ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలు సంభవిస్తున్నాయని చాలా రోజుల నుండి ప్రజలు తన దృష్టికి తీసుకొస్తున్నట్లు తెలిపారు.దీనిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే డివైడర్లను తొలగించి అక్కడ వ్యాపారాలు నిర్వహించుకునే సుమారు 60 నుండి 70 మంది పూలు,పండ్లు,ఇతర చిరు వ్యాపారుల దుకాణాలన్నింటిని జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ కార్యాలయ స్థలంలోకి తరలించడం జరుగుతుందని స్పష్టం చేశారు.అక్కడ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అనువైన స్థలం ఉందని, అంతేకాక పార్కింగ్కి ఇబ్బంది లేదని,ప్రస్తుతం ప్రకాశం బజార్లో 60 నుండి 70 మంది చిరు వ్యాపారులు ఫుట్పాత్పై వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారని, అలాంటి వారందరిని గుర్తించి వారికి పాత కలెక్టర్ కార్యాలయ స్థలంలో వారి షాపు పరిమాణాలను బట్టి 50,70,100 గజాల స్థలాలను కేటాయిస్తామని మంత్రి తెలిపారు. పాత కలెక్టర్ కార్యాలయం స్థలంలో ప్రస్తుతం ఉన్న డీసీఎం పార్కింగ్ ను దేవరకొండ రోడ్ లోని హౌసింగ్ బోర్డ్ స్థలంలోకి తక్షణమే మార్చాల్సిందిగా ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రకాశం బజార్ లోని డివైడర్లను జెసిబిలో సహాయంతో అప్పటికప్పుడే తొలగించే చర్యలను చేపట్టారు.పేదవారికి ఎప్పుడు తాను సహాయం చేస్తానని, పేదల పక్షాన ఉంటానని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.జిల్లా ఎస్పి శరత్చంద్ర పవార్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్, నల్గొండ అశోక్ రెడ్డి, డిఎస్పి శివరామిరెడ్డి, ట్రాన్స్కో, మున్సిపల్, తదితర అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# సౌర విద్యుత్ వినియోగానికి రూ. 944 కోట్లు!

## తెలంగాణ సిఎండి ముషారఫ్ అలీ

## హాలియాలో సౌరవిద్యుత్పై అవగాహన



**ప్రజాపక్షం/హాలియా:** తెలంగాణలోని 81 గ్రామాలకు సౌర విద్యుత్ వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 944 కోట్ల రూపాయలు కేటాయించిందని తెలంగాణ విద్యుత్ సీఎండి ముషారఫ్ అలీ అన్నారు. మంగళవారం సాయంత్రం హాలియాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఎండి ముషారఫ్ అలీ మాట్లాడుతూ తెలంగాణలో మొత్తం 81 గ్రామాలలో ఈ సౌర విద్యుత్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొదట కొండారెడ్డి పల్లి లో ఈకార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే నల్గొండ జిల్లా అనుముల గ్రామాన్ని సోలార్ విద్యుదీకరణకు ఎంపిక చేయబడిందని తెలిపారు. దానికి గృహ జ్యోతి విద్యుత్ వినియోగదారులకు రెండు కిలో వార్ట్స్ సోలార్ ప్యానల్ బిగించబడుతుందని చెప్పారు. ఇది పూర్తిగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అనుముల మండలంలో 605 మంది విద్యుత్ వినియోగదారులకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు.7.5 కిలో మీటర్స్ వ్యవసాయ విద్యుత్తు వినియోగదారులకు అమర్చనున్నామని ఇది కూడా పూర్తిగా ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు వాడుకోగా మిగిలిన విద్యుత్తును అదే నెట్ వర్క్కు కనెక్ట్ చేయబడుతుందని చెప్పారు.వీరు వాడుకోగా మిగిలిన విద్యుత్కు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు.అనుముల గ్రామానికి పూర్తిస్థాయి సౌర విద్యుత్తు అందించేందుకు రూ.44.94 కోట్లు మంజూరు చేసిందన్నారు. అనంతరం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ అనుముల గ్రామానికి పూర్తిస్థాయిలో సౌర విద్యుత్తు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. దీనిని పూర్తిగా వాడుకొని తిరిగి హాలియా మున్సిపాలిటీ కూడా ఇది కనెక్ట్ చేసే విధంగా చూస్తామని అవకాశం వచ్చిన వినియోగదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ ప్రాజెక్టు మొత్తం కూడా రెడ్కో ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో టీఎస్ రెడ్కో అధికారి అనిలా,మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,మార్కెట్ చైర్మన్లు తుమ్మల పల్లి శేఖర్ రెడ్డి,అంకత సత్యం,మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్,విద్యుత్ ఏడి తిరుపతయ్య, ఏఈ ధనుంజయ, ఈఆర్వో పాండు రంగ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో మోడల్ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో మోడల్ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మోడల్ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి పోషక లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకి ప్రత్యేక నూతన ప్రి స్కూల్ సిలబస్ ప్రకారం బోధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు ఓపెన్ చేసి ఫోషన్ ట్రాకర్ ద్వారా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వయో వృద్ధుల మెయింటెనెన్స్ కేసులు, సమస్యలు పరిష్కరించాలని మహిళల పట్ల ఎలాంటి అకృత్యాలు జరగకుండా చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా శిశు సంరక్షణ, ఉమెన్ వెల్ఫేర్, వయో వృద్ధుల గురించి చేయవల్సిన వివిధ విషయాలపై సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్, డ్రింకింగ్ వాటర్, రిపేర్స్ తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె నరసింహారావు, సూపరిండెంట్ జి హుస్సేన్, డిసిపిఓ రవి కుమార్, ఎఫ్ఆర్ఓ బి వినోద్ కుమార్, సంకల్ప జిల్లా కోఆర్డినేటర్ చైతన్య పాల్గొన్నారు.

# దైవ దర్శనానికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు!

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం..



**ప్రజాపక్షం/హాలియా:** తమ బాధలు ఆలకించి ఇన్నాళ్లుగా పడుతున్న కష్టాల నుంచి విముక్తి కల్పిస్తాడని ఆశించి మొక్కుని చెల్లించుకుని వస్తున్నారు. ఆ ఆలుమగలు...మరో 20 నిమిషాలు ప్రయాణిస్తే తమ ఇంటికి చేరుకుంటామనుకునే లోపే ఆదేవుడు లారీ రూపంలో ఆ దంపతులను మృత్యువు ఒడికి చేర్చి శాశ్వత విముక్తి కల్పించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.మంగళవారం సాయంత్రం హాలియా పోలీస్ స్టేషన్ సమీపంలో గల ఎడమకాలు బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన ఎన్నో ప్రశ్నలను లేవనెత్తింది.సంఘటనకు సంబంధించిన వివరాలు కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన ప్రకారం పెద్దవూర మండలం బట్టుగూడెం గ్రామానికి చెందిన పిట్టల వెంకటయ్య (55)భార్య మల్లమ్మ(45)లు గత మూడేళ్ల క్రితం అనుముల మండలం కొట్టాల గ్రామంలో జీవనోపాధి కోసం వెళ్లారు.అదే గ్రామంలో వెంకటయ్య కూతురు కూడా నివాసం ఉంటుంది.అయితే బట్టుగూడెంలో ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా జాతర నిర్వహిస్తుంటారు. ఈక్రమంలో వెంకటయ్య తన గ్రామానికి వెళ్లినట్టు ఉంటుందని అందర్నీ పలకరించి వద్దామని భార్యతో కలిసి బట్టుగూడెం వెళ్లారు.అనంతరం అక్కడ దేవుడు మొక్కు తీర్చుకొని తిరిగి కొట్టాల గ్రామం వెళ్లేందుకు సాయంత్రం బయలుదేరారు. వారు హాల్య పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత ఎడమ కాలువ పై ఉన్న బ్రిడ్జి మీదికి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ వారి మీదుగా వెళ్లిపోవడంతో భార్యాభర్తలిద్దరూ అక్కడే మృతి చెందారు. ఇన్నాళ్లు కష్టసుఖాలలో పాలుపంచుకున్న భార్యాభర్తలు ఇద్దరు కలిసి ప్రమాదంలో దుర్మరణం చెందడం పలువురిని కలచివేసింది. మృతుడు వెంకయ్యకు ము గ్గ రు కుమార్తెలు ఉన్నారు.బంధువుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నిడమనూరు ఎస్సై సురేష్ కుమార్ తెలిపారు.

# సాధారణ ప్రసవాలు పెంచాలి

## నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్ ):** ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల ద్వారా సాధారణ ప్రసవాలను పెంచాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం, పర్వతగిరి ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆరోగ్య ఉప కేంద్రంలోని రిజిస్టర్లను, మందుల స్టాక్, స్టోర్, మరుగుదొడ్లు, పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలలో అన్ని రికార్డులను సరిగా నిర్వహించాలని, మందుల స్టాక్ రిజిస్టర్ ను అప్డేట్ చేయాలని, గర్భిణీస్త్రీలకు ప్రతినెల నిర్వహించే పరీక్షలను సక్రమంగా నిర్వహించి ప్రసవ సమయానికి ప్రసవం జరిగేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలను పెంచాలని,పేద ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన చెప్పారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ఆస్పత్రిలోని మరుగుదొడ్లు తనిఖీ చేశారు. మందుల స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించిన సందర్భంగా ఆయా మందుల వివరాలను, వాటి అందుబాటును, అడిగి తెలుసుకున్నారు. కాగా ఆరోగ్య ఉప కేంద్రం భవనం పై పెచ్చులు ఊగుతున్నాయని, మరమ్మతులు చేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్,డిప్యూటీ డిఎంహెచ్ ఓలు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,డాక్టర్ కృష్ణవేణి,జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మెడికల్ అధికారి రామకృష్ణ, ఎం ఎల్ హెచ్ పి ఊర్మిల, ప్రియదర్శిని, ఆశ, ఏఎన్ఎంలు ఉన్నారు.

# ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు యాదాద్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఘనంగా ఆహ్వానం లభించింది. మంగళవారం ఆలయ చైర్మన్ నర్సింహ మూర్తి, ఆలయ అధికారులు, అర్చక బృందం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న విస్తృత ఏర్పాట్లను ఎమ్మెల్యేకు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, స్వామివారి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించేందుకు ప్రభుత్వం , ఆలయ యంత్రాంగం సిద్ధంగా ఉందని వారు తెలిపారు. ఆలయ అధికారుల ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి సేవలో తరిస్తానని పేర్కొన్నారు. యాదాద్రి క్షేత్ర అభివృద్ధికి , భక్తుల సౌకర్యార్థం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# పాలనలో మంచి దక్షతను సంపాదించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వ అభివృద్ధి ,సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించేందుకు పాలనలో మంచి దక్షతను సంపాదించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ప్రొబేషనరీ గ్రూప్ 1అధికారులకు సూచించారు.మంగళవారం సుమారు 54 మంది ప్రొబేషనరీ గ్రూప్ 1అధికారులు శిక్షణలో భాగంగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో మంగళ బుధ రెండు రోజులపాటు శిక్షణ పొందే నిమిత్తం జిల్లాకు రావడం జరిగింది.ముందుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వారితో సమావేశమైన జిల్లా కలెక్టర్ జిల్లా వివరాలను, తెలియజేశారు.తెలంగాణలోనే నల్లగొండ జిల్లా అతిపెద్ద జిల్లా అని,566 రెవెన్యూ గ్రామాలు,869 గ్రామపంచాయతీలు ఉన్నాయని, 2011 జనాభా లెక్కల ప్రకారం 16 లక్షల 18 వేల జనాభా ఉందని,61 అక్షరాస్యత ఉన్న జిల్లాలో సుమారు 77 ప్రజలు వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని,జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతాలు,నాగర్జున సాగర్ ప్రాజెక్టు కింది కమాండ్ ఏరియాలో ఉండే మిర్యాలగూడ, నాగార్జునసాగర్ వంటి ప్రాంతాలు ఉన్నాయని, మారుమూల గిరిజన ప్రాంతాలలో కమ్యూనికేషన్ సదుపాయాలు కొన్ని గ్రామాలలో ఉన్నాయని తెలిపారు. గ్రూప్ 1 శిక్షణ అధికారులు వారి శిక్షణలో భాగంగా గ్రామాలకు వెళ్లి అధ్యయనం చేసిన అనంతరం ముఖ్యమైన పారామీటర్స్ పై నివేదిక తయారు చేసుకోవాలని,ఇది భవిష్యత్తు పరిపాలనలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలో అమలు చేస్తున్న ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.కాగా 54 మంది శిక్షణ గ్రూపు1 అధికారులు మంగళ బుధ రెండు రోజులపాటు జిల్లాలోని కొండమల్లేపల్లి మండలం చెన్నమనేనిపల్లి,పీఏ పల్లి మండలం ఆర్ఆర్ గూడెం, చింతపల్లి మండలంలోని గొల్లపల్లి,దేవరకొండ మండలం మైనంపల్లి, తూర్పుపల్లి,వేములపల్లి మండలం శెట్టిపాలెం, లక్ష్మీదేవి గూడెం, మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్,యాద్గార్ పల్లిలలో సందర్శించి గ్రామీణ ప్రాంతంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, గ్రామీణ జీవన విధానాన్ని అధ్యయనం చేయనున్నారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు, ఎం సి హెచ్ ఆర్ డి కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

# సిఎం కప్ జిల్లా స్థాయి కరాటే పోటీలకు క్రీడాకారుల ఎంపిక

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సిఎం కప్ 2026 జిల్లా స్థాయి కరాటే పోటీలకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదనంలో మంగళవారం క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా క్రీడల అధికారి వెంకట్ రెడ్డి, ఎస్జిఎఫ్ఐ జిల్లా సెక్రటరీ కిరణ్ కుమార్లు ముఖ్య అతిధులుగా హాజరై ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ వయస్సు ప్రాతిపదికన కెటగిరిలుగా విభజించి బాలబాలికలను ఎంపిక చేశారు. ఈనెల 22, 23 తేదీలలో హైదరాబాద్లోని గచ్చిబౌలిలో జరగనున్న రాష్ట్రస్థాయి సిఎం కప్ 2026లో ఎంపికైన క్రీడాకారులు ఆడనున్నారు. ఈ కార్యక్రమంలో కరాటే జూడో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్, ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ తహెర్పాషా, కరాటే మాస్టర్లు రియాజ్, మాదవిలత, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## కెసిఆర్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** మాజీ సిఎం కెసిఆర్ పుట్టినరోజు సంబురాలు ముషీరాబాద్ అసెంబ్లి సెగ్మెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్, గులాబి శ్రేణులు పాల్గొని కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బిఆర్‌ఎస్ నేతలు రాకేష్ , ముఠా నరేష్, శివ ముదిరాజ్, బింగి నవీన్, గంటా రాజు, బిక్షపతి యాదవ్, సోమ సుందరం , రేషం మల్లేష్, అచ్యుత్‌రెడ్డి, కల్వ గోపి, ఎంఎన్ శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, ముఠా జై సింహా, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కంటోన్మెంట్:** మాజీ సిఎం కెసిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోయిన్‌పల్లిలో కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో బోయిన్‌పల్లి ప్లేగ్రౌండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి కెసిఆర్ జన్మదిన వేడుకలు జరిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తెలంగాణ భవన్‌లో వేడుకలు**

**బంజారాహిల్స్:** బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ జన్మదిన వేడుకలను తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి మహమ్మద్ అలీతో కలిసి బిఆర్‌ఎస్ రాష్ట్ర సినియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్, పాత బస్తికి చెందిన బిఆర్‌ఎస్ నేతలు కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

## మరమ్మతు పనుల పరిశీలన



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** మణికొండ వద్ద ధ్వంసమైన 1200 ఎంఎం డయా పిఎస్ సి గ్రావిటీ మెయిన్ పైప్ లైన్ అత్యవసర మరమ్మత్తు పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు. జలమండలి చేపట్టే మరమ్మత్తులు, పైపు లైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే.. రోడ్డు మరమ్మత్తు పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఇదిలాఉండగా..మరమ్మత్తు పనులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టి, ఉదయం 7 గంటలకు పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. దెబ్బతిన్న పైప్ భాగాన్ని 1150 మిమీ వ్యాసం గల ఎమ్ఎస్ బ్యారెల్‌ను అమర్చడం ద్వారా మార్పిడి చేస్తున్నారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. మరమ్మతులు మంగళవారం సాయంత్రం 7 గంటలలోపు పూర్తయ్యే అవకాశం ఉంది. మరమ్మత్తు పనులు పూర్తయిన అనంతరం నీటి సరఫరాను దశలవారీగా పునరుద్ధరించడం జరుగుతుంది.

## ధర్మపాల విజయం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** విశ్వ బ్రాహ్మణ ధర్మ పీఠం ఆధ్వర్యంలో 120 ఏండ్ల క్రితం బొమ్మకంటి ప్రభాకర కవి రచించిన ధర్మపాల విజయం పునర్ముద్రణ గ్రంధ ఆవిష్కరణ జరిగింది. రాంనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆచార్య గౌరీ శంకర్, సాహితీ వేత్తలు పెదపాటి నాగేశ్వరరావు, జయరాములు, ఆచార్య మసన చెన్నప్ప, కొన్యాలా శివానందం తదితరులు పాల్గొన్నారు.



## డిగ్రీ విద్యార్థుల ఫీల్డ్‌ట్రిప్

**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ ను ఫలక్‌నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్ అనుమతితో డాక్టర్ సుహాసిని, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాబురావు తదితరుల పర్యవేక్షణలో ఏఆర్‌సిఐని విద్యార్థులు సందర్శించడం జరిగింది.




## రెసోనెన్స్ ప్రభంజనం

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్ 2026 (సెషన్1) ఫలితాల్లో నగరంలోని 'రెసోనెన్స్' ప్రభంజనం సృష్టించింది. రికార్డు స్థాయి విజయాన్ని నమోదు చేసింది. ఈ ఫలితాలలో 63 మంది విద్యార్థులు 99 పైగా పర్సంటేజ్ సాధించారు. కార్యక్రమంలో రెసోనెన్స్ విద్యా సంస్థల (తెలంగాణ ఆంధ్రప్రదేశ్) డైరెక్టర్ పూర్ణ చంద్రరావు, రెసోనెన్స్ హైదరాబాద్ కేంద్రాల సిఓఓ మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీయిజాన్ని ఉపేక్షించం

రాజేంద్రనగర్ డీసీపీ ఎస్.శ్రీనివాస్

**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** రౌడీయిజాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని.. ఉక్కుపాదం మోపుతామని రాజేంద్రనగర్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల ఇండ్లలో తనిఖీలు నిర్వహించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. శాంతికి విఘాలం కలిగే పనులకు స్వస్తి పలకాలని.. ప్రవర్తన మార్చుకుని మంచి మార్గంలో నడవాలని హితవుపలికారు. డీసీపీ వెంట ఏసీపీలు, సిఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఆకట్టుకున్న సంగీత విభావరి

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** పరి మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. చిన్ననాటి స్కూల్ మిత్రులు పాటలపై ప్రేమతో గెట్ టుగెదర్‌లో భాగంగా జరిగిన సమావేశంలో పాటలతో సందడి చేశారు. పరిణిత సింగర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.
స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి

# సంగారెడ్డిలో యుబిఎల్ 'ప్రాజెక్ట్ జల శక్తి' ప్రారంభం

రైతులకు అండగా రెండు 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ పానీయాల సంస్థ హీనెకెన్ గ్రూపునకు చెందిన యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యుబిఎల్), తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో తన ప్రతిష్టాత్మక సిఎస్ఆర్ (సిఎస్ఆర్) కార్యక్రమం 'ప్రాజెక్ట్ జల శక్తి'ని ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రైతుల సంక్షేమం, సుస్థిర వ్యవసాయం లక్ష్యంగా పునరుత్పాదక ఇంధనంతో నడిచే రెండు 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' (సిఓఇ)లను ఏర్పాటు చేశారు. మల్కాపూర్, కొత్లాపూర్, గుంటపల్లి, గోపులాపురం, హరిదాస్పూర్, మాలెపల్లి గ్రామ పంచాయతీలను ఈ ప్రాజెక్ట్ కవర్ చేయనుంది. రైతులు, స్థానిక ప్రజలకు మద్దతు అందిస్తూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, భూగర్భ జలాల పెంపు, జీవ వైవిధ్య పరిరక్షణ ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. యూబిఎల్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్



గరిమా సింగ్ మాట్లాడుతూ భారత్ కేర్స్' భాగస్వామ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణనిస్తూ వారి ఉత్పాదకతను పెంచడమే తమ లక్ష్యమని తెలిపారు. సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా రైతులకు నేల, నీటి సంరక్షణపై శిక్షణ ఇవ్వడంతో పాటు పంట ఉత్పాదకత పెంపుపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ కేంద్రాల్లో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేసి, నిజ, సమయ వాతావరణ సమాచారం అందజేస్తున్నారు. అదనంగా మట్టి పరీక్షా ప్రయోగశాలలను కూడా ఏర్పాటు చేశామన్నారు. స్థానిక జల భద్రత బలోపేతం కోసం కొత్త చెక్ డ్యామ్ నిర్మాణం, పాత చెక్ డ్యామ్ పునరుద్ధరణ, మూడు సాగునీటి కాలువల లోతు, వెడల్పు పెంపు పనులు చేపట్టామన్నారు. పర్యావరణ పునరుద్ధరణలో భాగంగా 1,200కి పైగా స్థానిక మొక్కలను నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో యూబిఎల్ సిఎస్ఆర్, ఈఎస్‌జి కమిటీ చైర్‌పర్సన్ గీతూ గిద్వానీ వర్మ, కమిటీ సభ్యురాలు యోలాండా తలామో, గరిమా సింగ్, భారత్ కేర్స్ ట్రస్టీ భౌమిక్ షా, కొత్లాపూర్ సర్పంచ్ పెంటాని ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



## 19న భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ పురస్కారాల ప్రదానం

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** 'భూపతిచంద్ర స్మారక కథానికల పోటీ–2026 పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు, డా.దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించనున్నట్టు అధ్యక్షులు ఎం.ఎల్.కాంతారావు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు సలహామండలి కన్వీనర్‌గా ప్రొ.సి.మృణాళిని, విశిష్ట అతిథిగా ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్, గౌరవ అతిథిగా ప్రముఖ రచయిత మహమ్మద్ ఖదీబాబు, ఆత్మీయ అతిథిగా సినీ దర్శకులు బి.నర్సింగరావు హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపికైన రచయితలకు ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు,తృతీయ బహుమతిగా రూ.6వేలు నగదు అందజేస్తామని తెలిపారు. ఐదుగురు రచయితలకు ప్రోత్సాహక బహుమతులుగా రూ.2వేల నగదు చొప్పున ప్రదానం చేస్తామని తెలిపారు.

## కెసిఆర్‌కు చిరుకానుక... 'మళ్లీ సిఎంను చేయడమే'



బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అందరూ ఐక్యంగా కొట్లాడి, కలిసికట్టుగా కదం తొక్కాలని, మళ్ళీ రాష్ట్రంలో గులాబీ జెండాను ఎగురవేసి, కెసిఆర్‌ను ముఖ్యమంత్రి చేయడమే ఆయనకు ఇచ్చే చిరుకానుక అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. కెసిఆర్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ హాల్‌లో 'కెసిఆర్ ఉద్యమ ప్రస్థానం పదేళ్ల పాలన' అంశంపైన ఏర్పాటు చేసిన డాక్యుమెంటరీ కెటిఆర్, బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు వీక్షించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన సంబురాలు జరిగాయి. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కొంత మంది కెసిఆర్ పట్ల ఇష్టం వచ్చినట్టుగా తూలనాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ మట్టితో మమేకమైన వాడికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వాడికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి అడుగు నడిచిన వాళ్లకి మాత్రమే జాతి అంటే ఏమిటో తెలుస్తుందన్నారు. లాఠీ దెబ్బలు తిన్నోళ్లకు, జైళ్లకు పోయినోళ్లకు, తుపాకులకు ఎదురుపడి నిలబడ్డోళ్లకు జాతి, జాతి అస్తిత్వం అంటే ఏమిటో తెలుస్తుందని, కానీ ఉద్యమకారుల పైన తుపాకులు తీసుకుని ఆ రోజు దాడికి వెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎలా తెలుందని కెటిఆర్ ప్రశ్నించారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని బిఆర్‌ఎస్ కైవసం చేసుకున్నప్పటికీ కౌన్సిలర్లు, చైర్మన్‌ను ఎన్నికలల్లో పాల్గొనకుండా అడ్డుకోవడం దుర్మార్గమని, కొందరు పోలీసులు అధికారపార్టీకి తొత్తులుగా మారి, అన్యాయాన్ని ప్రశ్నించిన నాయకులపైనే లాఠీచార్జీకి దిగడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కెటిఆర్ మండిపడ్డారు.

**కెసిఆర్‌కు ప్రముఖుల జన్మదిన శుభాకాంక్షలు**

మాజీ సిఎం కెసిఆర్‌కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని పలు సామాజిక మాధ్యమ వేదికల ద్వారా పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తెలంగాణ, ఎపి ఉప ముఖ్య మంత్రులు మల్లు భట్టి విక్రమార్క,పవన్ కళ్యాణ్, ఎపి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎపి మంత్రి నారా లోకేష్, తెలంగాణ రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,కొండ సురేఖ, కేంద్ర మంత్రి బండి సంజయ్,టి పిసిసి అధ్యక్షుడు మహేశ్ గౌడ్,మెగాస్టార్ చిరంజీవి,విజయ సాయి రెడ్డి తదితర ప్రముఖులు కెసిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ కెసిఆర్ ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్నికలు ఏవైనా విజయం 'బిసి'లదే



బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికలు ఏవైనా విజయం 'బిసి'లదే అని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ చైర్మన్‌లుగా బిసిలకు 62 శాతం అవకాశం దక్కడం బిసిల సుదీర్ఘ పోరాట ఫలితమేనని వెల్లడించారు. హైదరాబాద్‌లోని బిసి జెఎసి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము చేసిన పోరాటం ఫలితంగానే పల్లె నుంచిA పట్టణం వరకు బిసి భావజాలం బలపడిందని, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని అన్నారు. గ్రామ సర్పంచులుగా బిసిలు 53 శాతం, ఇదే సమయంలో పట్టణాలలో కూడా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా బిసిలు 61శాతం గెలుపొందడం రోజురోజుకు బిసిలలో పెరుగుతున్న రాజకీయ చైతన్యమేనని ఆయన కొనియాడారు. 35 మున్సిపాలిటీలలో బిసి రిజర్వేషన్లతో పాటు జనరల్ స్థానాలలో కూడా 31 మంది మున్సిపల్ చైర్మన్‌లు కాగలిగారని, మొత్తంగా 62 శాతం మున్సిపల్ చైర్మన్‌లు బిసిలకు అవకాశం దగ్గడం చారిత్రాత్మక విజయమన్నారు. రాష్ట్రంలో బిసిల రాజకీయ శకం ఆరంభమైందని, ప్రతి ఎన్నికల్లోను బిసిలు ఓటు చైతన్యంతో సామాజిక రాజకీయ సునామిని కొనసాగిస్తున్నారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బిసిలకు సహకరించిన కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలకు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో బిసి జెఎసి వ ర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి సంఘం జాతీయ అ ధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్‌తో పాటు జాజుల లింగం, గౌడుగు మహేష్ యాదవ్, బొల్లేపల్లి స్వామి, కొప్పుల చందు, బండి గారి రాజు, వెంకట్, అంజమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్, బిజెపి పొత్తునకు మున్సిపల్ ఎన్నికలే తొలిమెట్టు

ప్రజాభవన్ ఎదురుగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్, బిజెపి పొత్తునకు మున్సిపల్ ఎన్నికలు తొలిమెట్టు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బిఆర్‌ఎస్ మద్దతుతోనే బిజెపి రాష్ట్రంలో ఒకటో, రెండో మున్సిపల్ చైర్మన్ పదవులు దక్కించుకుందని, ఈ రెండు పార్టీల పొత్తు అంశంపైన తాను గతంలో చేసిన వ్యాఖ్యలు వాస్తవమనేది మున్సిపల్ ఎన్నికల్లో స్పష్టమైందన్నారు. 'మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని,వృద్ధాప్య,దివ్యాంగ సహా ఇతర పింఛన్లను పెంచాలని, కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇవ్వాలని, యువతులకు స్కూటీలు ఇవ్వాలని' డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి మహిళా విభాగం నాయకులు, మహిళలతో కలిసి హైదరాబాద్, బేగంపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ను కవిత మంగళవారం ముట్టడించారు. అక్కడే కొద్ది సేపు బైఠాయించారు. కొద్దిసేపటి తర్వాత





ప్రజావాణి స్పెషల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్‌తో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ, కరీంనగర్, నారాయణపేట్ లో బిఆర్‌ఎస్ హాజరుకాకపోవడంతోనే బిజెపికి మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులు దక్కాయన్నారు. నారాయణపేటలో జాగృతి నాయకురాలికి దక్కాల్సిన వైస్ చైర్ పర్సన్ పదవిని రెండు పార్టీలు కలిసి రాకుండా చేశాయన్నారు.ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు ఈ బడ్జెట్ లోనే నిధులు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యమకారులు సహా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో సెక్రటేరియట్, అసెంబ్లీని ముట్టడిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణలో రాజకీయ జోక్యం ఉండేలా ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గర్భిణులు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించే అంగన్ వాడీలను యథాతథంగా కొనసాగించాలని కోరారు. కాగా ప్రజా భవన్ ముందు ఆందోళనకు దిగిన పలువురు తెలంగాణ జాగృతి నాయకులను,మహిళలను పోలీసులు అరెస్టు చేశారు.

## గల్ఫ్ ఎన్నారై పాలసీ అధ్యయనం కోసం నిర్మల్ జిల్లా పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పనలో భాగంగా గల్ఫ్ వలసలు, కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఈ నెల 21న నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నట్లు ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్, డాక్టర్ బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి తెలిపారు. ఉదయం సారంగాపూర్ మండలంలోని గ్రామాలను సందర్శించి గల్ఫ్ నుంచి తిరిగివచ్చిన వలస కార్మికులు, గల్ఫ్ కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలు, అనుభవాలపై సమాచారం సేకరించనున్నట్లు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం నిర్మల్‌లో జిల్లా కలెక్టర్, ఎస్‌పితో, కార్మిక, ఉపాధి, మహిళా శిశు సంక్షేమం, విద్యా శాఖ అధికారులు, విద్యావేత్తలు, రిక్రూటింగ్ ఏజెన్సీలు, సామాజిక సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి

ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసి

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బండ్లగూడలోని కేజీ టూ పీజీ ఫాతీమా కాలేజీలో జరిగిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... స్వయం ఉపాధికి మద్దతు ఇవ్వడం.. గృహ.. జీవనోపాధిని బలోపేతం చేయడం ద్వారా మహిళలను సాధికారపరచడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మహిళా సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సమ్మిళిత వృద్ధికి ఎంఐఎం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో మహిళల సామాజిక, ఆర్థిక సాధికారత వైపు పయనించేలా నిరంతర ప్రయత్నాలను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు.

## గ్రామసభే గ్రామ పాలనకు దిశానిర్దేశం




**ప్రజాపక్షం/ఉట్నూర్ :** గ్రామ పాలనలో కీలకమైన పాలకవర్గాలను ఎన్నుకునే పంచాయతీ ఎన్నికలు ఇటీవల ముగిశాయి. గ్రామానికి సంబంధించిన సర్వాధికారాలు గ్రామపంచాయతీకే చెందుతాయి. గ్రామపంచాయితీలో సర్పంచు ప్రథమ పౌరుడు. గ్రామసభల్లో తీసుకునే తీర్మానాలే గ్రామ శాసనాలుగా పరిగణించబడతాయి. పంచాయతీరాజ్ వ్యవస్థలో 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఐదంచెల విధానం అమలులోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా గ్రామ పంచాయతీలకు విశేష అధికారాలు కల్పించబడ్డాయి. గ్రామ అభివృద్ధి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా గ్రామ పాలకవర్గం అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది.

**పరిపాలనా ప్రధాన విధులు :** గ్రామాల్లో రోడ్లు, కాలువలు, వంతెనలు, బావుల నిర్మాణం, వాటి మరమ్మత్తులు చేయించడం, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, ప్రజా ఆరోగ్య పరిరక్షణ వంటి పనులను పర్యవేక్షించడం గ్రామ పంచాయతీ ప్రధాన బాధ్యతలు. అలాగే ప్రాథమిక విద్య అందించడం, సామాజిక ఆర్థిక సంక్షేమానికి కృషి చేయడం, ఆస్తి పన్ను, నీటి సరఫరా, ప్రకటనల వంటి పన్నులను వసూలు చేయడం కూడా గ్రామ పంచాయితీ విధులలో భాగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు లబ్దిదారులను గుర్తించి, వాటి అమలును పర్యవేక్షించడం కూడా ముఖ్యమైన బాధ్యత.

**గ్రామసభ నిర్వహణ :** గ్రామసభలను నిర్వహించడం , అందులో తీసుకునే తీర్మానాలను అమలు చేయడం, గ్రామ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం గ్రామ పంచాయతీ ముఖ్య బాధ్యతలు, ఈ సమావేశాలకు సర్పంచు అధ్యక్షత వహిస్తారు. గ్రామ అభివృద్ధి కోసం చేపట్టిన పనులు, వాటికి అయిన ఖర్చులు, భవిష్యత్తులో చేపట్టబోయే పనులు, పథకాలకు అయ్యే అంచనా వ్యయాలు, ఆదాయ వ్యయ వివరాలను ప్రజల ముందుంచేందుకు గ్రామ సభను నిర్వహిస్తారు. గ్రామసభలో ఆమోదించిన తీర్మానాలు గ్రామ చట్టాలుగా పరిగణించబడతాయి.

## బ్యాంకర్ల నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి


కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/నారాయణపేట:** బ్యాంకర్ల నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం వి.సి.హాల్‌లో డిసిసి సమావేశానికి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా లీడ్ బ్యాంక్ మేనేజర్ వ్యవహరించారు. ఈ సమావేశంలో వార్షిక ప్రణాళికా సంబంధించిన 2025–26 డిసెంబర్ 25తో ముగిసిన త్రైమాసికం సంవత్సరానికి 4204.49 కోట్ల బడ్జెట్ గాను 2431.39 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలైన జన్ సురక్ష పిఎంఎస్‌బివై 20/,436/ ప్రీమియంతో నమోదు చేసుకునినా రెండు లక్షల ప్రమాద బీమా, రెండు లక్షల వ్యక్తిగత బీమా పొందడం ద్వారా జీవిత భద్రత పొందగలరని ఇప్పటివరకు బ్యాంకుల్లో ఖాతాలేనివారు జీరో ఖాతా తెరుచుకోవడం ఈ సదుపాయం పొందవచ్చు అన్నారు. ప్రాధాన్యత రంగాలయిన అగ్రికల్చర్, ఎమ్మెస్ ఎంఈ మరియు అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎన్.ఆర్.ఎల్.ఎమ్, పిఎంఈజిపి స్కీం ల క్రింద త్వరితగతిన అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి నారాయణపేట జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని బ్యాంకులకు సూచించారు. ఈ సమావేశంలో అర్బి ఎల్డిఓ వి.శ్రీనివాస్, నాబార్డ్ డిడిఎం షణ్ముఖ చారి, ఎస్బిఐ సిఎం క్రెడిట్ జఫ్ఫార్ మోహిద్దీన్, యుబిఐ నుండి సిఎం క్రెడిట్ టి.రాజేశ్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకున్నారని ఎల్‌డిఎం విజయ్‌కుమార్ తెలిపారు.

## సిపిఐ నాయకుడు నాగోల్‌కృష్ణారెడ్డి మరణం బాధాకరం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వెల్గొండ గ్రామంలో సిపిఐపార్టీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి మంగళవారం ఉదయం అనారోగ్యంతో మరణించారు. ఈసందర్భంగా సిపిఐరాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ కృష్ణారెడ్డి గతంలో వెల్గొండ గ్రామంలో ప్రజల రాకపోకలకు దారిలేకపోతే దొరలతో, పెత్తందారులతో అనేకమార్లు పోరాటాలుచేసి వెల్గొండ గ్రామానికి దారిని వేయించిన ఘనత కృష్ణారెడ్డిదే. గ్రామంలోని పేద ప్రజలకు ఇళ్లస్థలాలను ఇప్పించి వాళ్లకు ఇండ్లు కట్టించారు. అదేవిధంగా ఆయన గ్రామంలో ఉపసర్పంచ్‌గా పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, సిపిఐరాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి, జిల్లాకార్యవర్గ సభ్యులు ఈర్లచంద్రమౌళి, బిజినేపల్లి మండల పార్టీ కార్యదర్శి పి.కృష్ణాజి, ఎఐటియూసి జిల్లా కార్యదర్శి శివశంకర్, జిల్లా నాయకులు శ్రీను, భూపేష్, శివకృష్ణ, రవి పాల్గొన్నారు.

# సూపర్ –8లో ఆరు జట్లు..

## మాజీ ఛాంపియన్లు ముందంజ వేసేనా?



భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న పురుషుల టి–20 ప్రపంచకప్‌లో అంచనాలు తలకిందులవుతున్నాయి. ఫేవరెట్లుగా బరిలోకి దిగిన జట్లలో కొన్ని అందుకోలేకపోతున్నాయి. లీగ్ దశలో చిన్న జట్లు సంచలన ప్రదర్శనతో గుబులు రేపుతుండమే అందుకు కారణం. హ్యాట్రిక్ విజయాలతో భారత్, లంక, వెస్టిండీస్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్.. సూపర్ 8లో అడుగుపెట్టాయి. అయితే.. మాజీ ఛాంపియన్లు ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మాత్రం టోర్నీ నుంచి నిష్క్రమించేలా ఉన్నాయి. అనూహ్యంగా జింబాబ్వే, అమెరికా రేసులోకి రావడంతో చివరి రెండు బెర్తులు దక్కించుకునేది ఎవరు? అనేది ఆసక్తి రేకిత్తిస్తోంది. పదో సీజన్ పొట్టి ప్రపంచ కప్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు తుది అంకానికి చేరాయి. అదిరే ఆటతో ప్రత్యర్థులకు షాకిచ్చిన ఆరు జట్లు సూపర్ 8 బెర్తులు పట్టేయగా.. చివరి రెండు స్థానాలపై ఉత్కంఠ కొనసాగుతోంది. పెద్ద జట్లు సూపర్ 8లో ఆడడం పక్కా అనుకుంటే.. చిన్నజట్లు సంచలన ప్రదర్శనతో రేసులో నిలిచాయి. గ్రూప్ సి నుంచి వెస్టిండీస్, ఇంగ్లండ్ ముందంజ వేయగా.. గ్రూప్ డీ నుంచి దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ సూపర్ 8 బెర్తు సాధించాయి. గ్రూప్ ఎ నుంచి భారత్, గ్రూప్ బి నుంచి శ్రీలంక మాత్రమే క్వాలిఫై కాగా.. ఈ రెండు గ్రూప్‌ల నుంచి నాకౌట్ బరిలో నిలిచేది ఎవరు? అనేది ఆసక్తిగా మారింది. డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా గ్రూప్ ఏ నుంచి ముందంజ వేసింది. తొలి పోరులో యుఎస్‌ఎపై కాస్త కష్టంగానే నెగ్గిన టీమిండియా.. ఆ తర్వాత నమీబియా, పాకిస్తాన్ పై పంజా విసిరి సూపర్ 8లో అడుగుపెట్టింది. రెండో బెర్తుపై కన్నేసిన పాక్‌కు యూఎస్‌ఏ గట్టిపోటీదారుగా మారింది. చివరి లీగ్ మ్యాచ్‌లో గెలుపొందిన అమెరికా ప్రస్తుతం 4 పాయింట్ల తో, +0.787 నెట్‌రన్ రేట్‌తో రెండో స్థానంలో ఉంది. పాక్ ఫిబ్రవరి 18న తమ చివరి మ్యాచ్‌లో నమీబియాపై గెలిస్తేనే సూపర్ 8లో ఆడుతుంది. లేదంటే.. యూఎస్‌ఏ వరుసగా రెండోసారి నాకౌట్‌కు దూసుకెళ్తుంది.

**ఐర్లాండ్ గెలిస్తే...** గ్రూప్ బి నుంచి ఆతిథ్య శ్రీలంక దర్జాగా సూపర్ 8 చేరింది. పథుమ్ నిశాంక(100 నాటౌట్) సూపర్ సెంచరీతో సోమవారం 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసిన లంక.. 6 పాయింట్లతో ముందంజ వేసింది. తొలి పోరులో ఒమ్న, గత మ్యాచ్‌లో ఆసీస్‌కు షాకిచ్చిన జింబాబ్వే నాలుగు పాయింట్లు, +1.984 నెట్‌రన్ రేట్‌తో రెండో స్థానంలో నిలిచింది. మంగళవారం ఐర్లాండ్ గెలిచిందంటే ఆఫ్రికా జట్టు సూపర్ 8లో అడుగుపెట్టడం ఖాయం.

అదే జరిగితే.. ఐర్లాండ్ మాత్రమే గెలిచి.. వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన మాజీ ఛాంపియన్ ఆసీస్ టోర్నీ నుంచి నిష్క్రమించే అవకాశాలున్నాయి. ఎందుకంటే.. మిచెల్ మార్ష్ సేన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఫిబ్రవరి 20న ఒమన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిని సరే ఆసీస్‌కు 4 పాయింట్లే వస్తాయి. కాబట్టి.. ఐర్లాండ్‌తో జింబాబ్వే ఓడితేనే కంగారూ టీమ్ రేసులో ఉంటుంది.

## ఆస్ట్రేలియా కొంపముంచిన వాన



ఐసిసి పురుషుల టి–20 ప్రపంచకప్‌లో సూపర్8పై ఆశలు పెట్టుకున్న ఆస్ట్రేలియాకు వరుణుడు బిగ్ షాకిచ్చాడు. పల్లెకెలె స్టేడియంలో కుండపోత కారణంగా ఐర్లాండ్–జింబాబ్వే మ్యాచ్ రద్దయ్యింది. ఈ మ్యాచ్ వర్షార్పణం కావడంతో.. మాజీ ఛాంపియన్ ఆసీస్ అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి.. మ్యాచ్ రద్దుతో ఒక పాయింట్.. మొత్తంగా ఐదు పాయింట్లతో గ్రూప్ బి నుంచి జింబాబ్వే జట్టు సూపర్ 8కు దూసుకెళ్లింది. ఐసిసి ఈవెంట్లలో చెలరేగిపోయే ఆస్ట్రేలియా ఈసారి నాకౌట్‌కు ముందే ఇంటిదారి పట్టింది. పేస్ దళంలో అనుభవజ్ఞులైన ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్వుడ్ లేకపోవడం.. టాపార్డర్ వైఫల్యం, నిలకడలేమి.. ఆ జట్టు పాలిట శాపంగా మారాయి. జింబాబ్వే చేతిలో 23 పరుగుల తేడాతో.. శ్రీలంకపై 8 వికెట్ల తేడాతో ఓడడం మిచెల్ మార్ష్ నేతృత్వంలోని కంగారూ జట్టు నాకౌట్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చాయి. మంగళవారం కొలంబోలోని పల్లెకెల్ స్టేడియంలో ఐర్లాండ్ చేతిలో జింబాబ్వే ఓడితే ఆసీస్‌కు అవకాశం ఉండేది. కానీ.. వర్షం కారణంగా ఐర్లాండ్ జింబాబ్వే మ్యాచ్ రద్దయ్యింది. వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో టాస్ వేయకుండానే ఆటను రద్దు చేసి ఇరుజట్లకు చెరొక పాయింట్ కేటాయించారు. దాంతో.. 5 పాయింట్లతో ఆఫ్రికా జట్టు ముందంజ వేయగా.. మూడింటా ఒకేఒక మ్యాచ్ గెలిచిన ఆసీస్, ఐర్లాండ్ టోర్నీ నుంచి వైదొలిగాయి. చివరి మ్యాచ్‌లో ఒమన్‌పై ఆస్ట్రేలియా గెలుపొందినా 4 పాయింట్లతో మూడో స్థానంలో నిలుస్తుంది. కాబట్టి.. జింబాబ్వే నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఆఫ్రికా టీమ్ ఈసారి సికిందర్ రజా నాయకత్వంలో సంచలన ప్రదర్శనతో సూపర్ 8లో అడుగుపెట్టడం విశేషం.

## సూపర్-8లోకి న్యూజిలాండ్



**చెన్నై:** టి–20 వరల్డ్ కప్‌లో మంగళవారం కెనడాతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కివీస్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్ అర్ధ శతకాలు బాదారు. చెన్నైలో జరిగిన గ్రూప్ డి మ్యాచ్‌లో తొలుత కెనడా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. భారతీయ సంతతికి చెందిన కెనడా బ్యాటర్ యువరాజ్ సమ్రా తన బ్యాటింగ్‌తో హోరెత్తించాడు. 65 బంతుల్లోనే 110 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 11బౌండరీలు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. యువరాజ్ సమ్రా దూకుడుతో కెనడా నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 రన్స్ చేసింది. సమ్రా, బజ్వా మధ్య తొలి వికెట్కు 116 పరుగులు భాగస్వామ్యం ఏర్పడింది. భారీ టార్గెట్‌ను న్యూజిలాండ్ ఈజీగా ఛేజ్ చేసింది. కేవలం 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకున్నది. రవీంద్ర 39 బంతుల్లో 59 రన్స్, ఫిలిప్స్ 36 బంతుల్లో 77 రన్స్ చేశారు. మూడో వికెట్‌కు అజేయంగా ఆ ఇద్దరూ 146 రన్స్ జోడించారు. ఈ గెలుపుతో కివీస్ వరల్డ్ కప్ సూపర్ 8లోకి వెళ్లింది.

మహిళ

# కౌమార దశలో బి12 కీలకం..




ఇటీవల వెలువడిన 'పుణె రూరల్ ఇంటర్వెన్షన్ ఇన్ యంగ్ అడోలసెంట్స్' ('ప్రియ') ట్రయల్ అనుసరణ అధ్యయన ఫలితాలు, కౌమార దశలో విటమిన్ బి12సప్లిమెంటేషన్ చేయడం ద్వారా, ఎపిజెనెటిక్ మార్గాల ద్వారా నవజాత శిశు ఆరోగ్యం మెరుగుపడుతుందని స్పష్టంగా చూపించాయి. ఈ పరిశోధన పోషణ, తరం నుండి తరానికి వ్యాపించే ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక మానవ వనరుల అభివృద్ధి పరంగా చాలా ప్రాధాన్యత కలిగి ఉంది. 'ప్రియ' ట్రయల్‌ను 2012 నుంచి 2020 వరకు పుణె మేటర్నల్ న్యూట్రిషన్ స్టడీ (పిఎంఎన్‌ఎస్)లో భాగంగా నిర్వహించారు. భారతదేశంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, విటమిన్ బి12 లోపం విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఈ అధ్యయనం రూపకల్పన చేసింది. కౌమార దశలో ఉన్న యువతలో విటమిన్ బి12 స్థాయిలను మెరుగుపరిస్తే, భవిష్యత్తులో వారి పిల్లలలో కనిపించే మెటబాలిక్, పోషక సంబంధిత ప్రమాదాలను తగ్గించగలమా? అనే విషయాన్ని అంచనా వేయడమే ఈ అధ్యయన ముఖ్య ఉద్దేశం. ఈ అధ్యయనంలో పాల్గొన్న కౌమార వయసు బాలికలకు శరీరానికి అవసరమైన మోతాదులో విటమిన్ బి12 సప్లిమెంటేషన్ ఇచ్చారు. తరువాత వారు తల్లులైనప్పుడు పుట్టిన శిశువుల ఆరోగ్య సూచికలను పరిశీలించారు. ముఖ్యంగా నియోనేటల్ పాండరల్ ఇండెక్స్ (బరువు–ఎత్తు నిష్పత్తి) పై దృష్టి సారించారు. ఈ సూచిక గర్భస్థ శిశువు పెరుగుదల, ప్రారంభ జీవన పోషణ స్థితిని తెలియజేస్తుంది. ఫలితాల ప్రకారం, కౌమార దశలో విటమిన్ బి12 తీసుకున్న తల్లుల శిశువుల్లో పాండరల్ ఇండెక్స్ చాలా మెరుగ్గా ఉంది. అంటే, శిశువులు తగిన బరువు, శరీర నిర్మాణంతో పుట్టారు. ఇది గర్భంలోనే మెరుగైన పెరుగుదల జరిగిందని, అలాగే ప్రారంభ జీవితంలో మంచి ఆరోగ్యానికి పునాది పడిందని ఈ ఫలితం సూచిస్తుంది. ఈ ప్రభావం ఎపిజెనెటిక్ మార్పుల ద్వారా చోటు చేసుకున్నదిగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంటే, డిఎన్ఎ క్రమాన్ని మార్చకుండా, జన్యు వ్యక్తీకరణను ప్రభావితం చేసే మార్పులు విటమిన్ బి12 ద్వారా ఏర్పడతాయి. ఈ పరిశోధన ఫలితాలు, ప్రభుత్వ విధానాల పరంగా కూడా కీలకంగా మారాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న ఐరన్–ఫోలిక్ యాసిడ్ (ఐఎఫ్ఎ) సప్లిమెంటేషన్ కార్యక్రమాల్లో, శారీరక అవసరాలకు తగిన మోతాదులో విటమిన్ బి12ను కూడా చేర్చాలని ఈ అధ్యయనం బలంగా సూచిస్తోంది. ముఖ్యంగా కౌమార దశలోని యువతీ యువకులు, ప్రసవ సామర్థ్య వయసులోని మహిళలకు ఇది ఎంతో అవసరం. దీని ద్వారా దీర్ఘకాలిక ప్రజారోగ్యం మెరుగుపడటంతో పాటు, దేశ మానవ వనరుల శక్తి కూడా బలోపేతం అవుతుంది. విటమిన్ బి12 (సయానోకోబాలమిన్) ఒక నీటిలో కరిగే విటమిన్. మన శరీరం దీనిని స్వయంగా తయారు చేసుకోలేదు. ఇది సూక్ష్మ జీవుల ద్వారా ఉత్పత్తి అవుతుంది మరియు ప్రధానంగా మాంసం, పాలు, గుడ్లు వంటి జంతు ఆధారిత ఆహారాల ద్వారా లభిస్తుంది. ఇది ఎర్ర రక్తకణాల తయారీ, డిఎన్ఎ సంశ్లేషణ, అలాగే మెదడు, నాడీవ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి ఇది అత్యంత అవసరం. భారతదేశంలో విటమిన్ బి12 లోపం చాలా ఎక్కువగా కనిపిస్తుంది. ప్రధానంగా ఆహారంలో తగిన మోతాదులో జంతు ప్రోటీన్ లేకపోవడం దీనికి కారణం. ఈ లోపం వల్ల రక్తహీనత (అనీమియా), నాడీ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కొన్ని సందర్భాల్లో, ఇంట్రిన్సిక్ ఫ్యాక్టర్ లోపం వల్ల శరీరంలో బి12 శోషణ సరిగా జరగకపోవడం కూడా కారణమవుతుంది. మొత్తానికి, 'ప్రియ' ట్రయల్ ఫలితాలు, కౌమార దశలో సరైన పోషణ, ముఖ్యంగా విటమిన్ బి12 వంటి సూక్ష్మ పోషకాలు, భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయని శాస్త్రీయంగా నిరూపించాయి.

## పెరుగుతున్న ప్రొటీన్ పౌడర్ల వాడకం



నేటి ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న ప్రపంచంలో ప్రోటీన్ పౌడర్లు ఒక సాధారణ పోషక అనుబంధంగా మారాయి. జిమ్‌కు వెళ్లే మహిళలే కాకుండా, ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ బాధ్యతల మధ్య సమతుల్యం పాటించే మహిళలు, అలాగే వయస్సు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకునే వారు కూడా ప్రోటీన్ పౌడర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే మార్కెట్లో లభించే విభిన్న రకాల ప్రోటీన్ పౌడర్ల మధ్య మహిళలకు సరైన దాన్ని ఎంపిక చేసుకోవడం అంత సులువు కాదు. ఎందుకంటే మహిళల శరీర అవసరాలు పురుషుల కంటే భిన్నంగా ఉంటాయి. హార్మోన్ల మార్పులు, ఎముకల ఆరోగ్యం, గర్భధారణ, పాలిచ్చే దశ, వయస్సుతో పాటు కండరాల శక్తి తగ్గడం వంటి అంశాలు మహిళల పోషక అవసరాలను ప్రత్యేకంగా ప్రభావితం చేస్తాయి. మహిళలకు సరైన ప్రోటీన్ పౌడర్‌ను ఎంచుకునే ముందు కొన్ని ముఖ్యమైన విషయాలను గమనించాలి. మొదటగా ఒక్క సర్వింగ్‌లో ఎంత ప్రోటీన్ అందుతోందన్నది కీలకం. బరువులు ఎత్తే వారు లేదా అధిక వ్యాయామం చేసే మహిళలకు ఎక్కువ ప్రోటీన్ అవసరం కావచ్చు. గర్భిణీలు, పాలిచ్చే మహిళలు, మెనోపాజ్ దశలో ఉన్నవారికి కూడా ప్రోటీన్ అవసరం కొంత పెరుగుతుంది. ప్రోటీన్ వనరు కూడా చాలా ముఖ్యం. వీ ప్రోటీన్‌ను గోల్డ్ స్టాండర్డ్‌గా భావిస్తారు. ఇందులో అన్ని అవసరమైన అమినో ఆమ్లాలు ఉంటాయి మరియు శరీరం త్వరగా గ్రహిస్తుంది. లాక్టోస్ సమస్య ఉన్న మహిళలకు వీ ఐసోలేట్ లేదా హైడ్రోలైజేట్ మరింత అనుకూలం. మొక్కల ఆధారిత ప్రోటీన్లు – పీ, రైస్, సోయా, హెంప్ వంటివి – వెగన్ మహిళలకు లేదా పాల పదార్థాలు తీసుకోలేని వారికి మంచి ఎంపిక. ఒక్కో మొక్క ప్రోటీన్‌లో కొన్ని అమినో ఆమ్లాలు తక్కువగా ఉండవచ్చు కాబట్టి, మిశ్రమ ప్లాంట్ ప్రోటీన్లు మరింత మెరుగైన ఫలితం ఇస్తాయి. కొలాజెన్ ప్రోటీన్ చర్మం, కీళ్ల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది కానీ ఇది పూర్తి ప్రోటీన్ కాదు. కాబట్టి దీన్ని ఇతర ప్రోటీన్లకు పూరకంగా మాత్రమే ఉపయోగించాలి. కాసిన్ ప్రోటీన్ నెమ్మదిగా జీర్ణమవుతుంది కాబట్టి, రాత్రి పడుకునే ముందు తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. మహిళల ఆరోగ్యానికి తోడ్పడే అదనపు పోషకాలు ఉన్నాయా లేదా అన్నదీ పరిశీలించాలి. కాల్షియం, ఐరన్, విటమిన్ డి, మాగ్నీషియం వంటి పోషకాలు మహిళల్లో కొరతగా ఉండే అవకాశముంది. కొన్ని ప్రోటీన్ పౌడర్లలో ఇవి కలిపి ఉంటాయి. జీర్ణక్రియ మెరుగుపడేందుకు ప్రొబయోటిక్స్, డైజెస్టివ్ ఎంజైమ్స్ కలిగినవి కూడా మార్కెట్లో లభిస్తున్నాయి. అయితే అవసరం లేని మూలికలు లేదా హార్మోన్లపై ప్రభావం చూపే పదార్థాలు ఉన్నాయా లేదా అన్నది జాగ్రత్తగా చూడాలి. శుభ్రమైన లేబుల్ మరియు భద్రత కూడా చాలా ముఖ్యమైన అంశాలు. అధిక చక్కెర, కృత్రిమ రంగులు, ఫ్లేవర్లు, అవసరం లేని ఫిల్లర్లు ఉన్న పౌడర్లను వీలైనంతవరకు నివారించాలి.

# కార్పొరేట్‌లకు విద్యారంగం అప్పగింత

**ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ధ్వజం**

**ఘనంగా ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా మహాసభ**




**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ విద్యారంగాన్ని కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ ఆడిటోరియంలో ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా రెండవ మహాసభకు జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) హన్మకొండ జిల్లా 2వ మహాసభలు కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై సభను ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ అధ్యక్షత వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు ఎఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే దిశగా కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ప్రతి ఏటా విద్యారంగానికి కేటాయించే నిధుల్లో కోతలు విధిస్తూ ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ప్రవేశపెట్టి, ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందని ద్రాక్షగా మారుస్తున్నారన్నారు. విద్యారంగంలో మతపరమైన భావజాలాన్ని చొప్పించి విద్యను కాషాయీకరణ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది రాజ్యాంగ విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యతిరేక విధానాలు, విద్య ప్రైవేటీకరణ, విద్య కాషాయీకరణ, నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలును ఎఐఎస్ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోరాటాలు చేయాలన్నారు. విద్య అందరికీ హక్కు అనే రాజ్యాంగబద్ధ సూత్రాన్ని కాపాడేందుకు విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సభలో ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు కర్రె బిక్షపతి మాట్లాడుతూ దేశంలో శాస్త్రీయ విద్యా విధానాన్ని బలపరచడం అత్యవసరమన్నారు. సమ సమాజ స్థాపనకు విద్యే ప్రధాన ఆధారం అన్నారు. విద్య వాణిజ్య వస్తువుగా కాకుండా సామాజిక బాధ్యతగా ప్రభుత్వాలు భావించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, వేర్పుల చరణ్, జక్కుల భానుప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ జ్యోతి, కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు సిపతి వినయ్, కె.చరణ్‌తో పాటు జిల్లావ్యాప్తంగా విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.



# పోడు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



**సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా వినతి**

**ప్రజాపక్షం/పాల్వంచ :** పోడు సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్న పోడు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా కోరారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండల పరిధి మందెరికలపాడు, సత్యనారాయణపురం (మొండికట్ట ) సారెకల్లు, కారెగట్టు, ప్రభాత్ నగర్ (రెడ్డిగూడెం), ఉల్వనూర్, రేగులగూడెం తదితర ప్రాంతాల పోడురైతుల సమస్యలపై యానంబైల్, చాతకొండ రేంజ్ పరిధి వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి బాబును మంగళవారం కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు రైతులను ఇబ్బందులకు గురిచేయ చేయకుండా మానవీయ కోణంలో చూడాలన్నారు. 2023 సంవత్సరంలో సర్వే చేసిన భూములలో ట్రెంచ్ తీయొద్దన్నారు. 30, 40 సంవత్సరాలుగా పోడు సాగుచేసుకొంటున్న పేద రైతుల భూములను లాక్కోవడాన్ని విరమించుకోవాలని కోరారు. అనంతరం పోడు రైతులతో మాట్లాడుతూ పాత భుముల్లోనే సాగు చేసుకోవాలన్నారు. కొత్తగా పోడు నరకే ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి విశ్వేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు నిమ్మల రాంబాబు, వైఎస్.గిరి, వేములపల్లి శ్రీనివాసరావు, చిల్లా క్రిష్ణ, చెన్నయ్య, శర్వ రాజేష్, బి.మోహన్, ఉప సర్పంచ్ కె.నాగరాజు, సారయ్య, గండికోట దేవేందర్, సంపత్, మడకం క్రిష్ణ, భీమా, రాజు, చిన్న వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అన్యాయం చేయొద్దు

**ఇంటిని కూల్చివేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలి**

**సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్**

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఇండ్లు లేని నిరుపేదలకు అన్యాయం చేయొద్దని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అధికారులను కోరారు. ఘట్‌కేసర్ మండలం మహేశ్వరనగర్ కాలనీలోని కాచవాని సింగారం గ్రామంలో ఇంటిని కూల్చిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ నేతలు కోరారు. మంగళవారం సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఎసిపి మోహన్‌కుమార్‌ను కల్సి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ సర్వే నంబర్‌లో గత 30 ఏళ్ల నుండి పలువురు పేద కుటుంబీకులు సొంత నివాసాలు ఏర్పరచుకొని ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో ఈ నెల 10న స్థానికంగా ఉంటున్న ఫర్హానా బేగం ఇంటిపై భాస్కర్‌గౌడ్ అనే వ్యక్తి ట్రాన్స్‌జెండర్లుగా ఉన్న గూండాలతో దాడి చేసి ఇంటిని ధ్వంసం చేశాడన్నారు. ఈ విషయంపై బాధితురాలి చేసిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోకపోవటం విచారకరమన్నారు. ఇప్పటికైనా దాడి చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితురాలికి న్యాయం చేయాలని ఉమామహేష్ కోరారు. తమ పార్టీ పేద కుటుంబ బాధితులకు అండగా ఉంటుందన్నారు.



# నేటినుంచి ఎఐఎస్‌ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలు

## ముస్తాబైన నిజామాబాద్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎఐఎస్ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలకు నిజామాబాద్ నగరం ముస్తాబైంది. నగరంలో 18–20 వరకు మహాసభలు జరుగనున్నాయి. మహిసభల సందర్భంగా నగరంలోని ప్రధాన కూడళ్ల లో ప్లెక్సీలు, ఎఐఎస్ఎఫ్ తోరణాలు ఏర్పాటు చేశారు. మహాసభలు జరిగే టిటిడి కళ్యాణ మండపం వద్ద విద్యార్థులకు, నాయకులకు స్వాగతం పలుకుతూ ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు సుభోద్, సహాయ కార్యదర్శి కుశాల్‌తో పాటు రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లెక్సీలు ఆకర్షణగా నిలిచాయి.

మంగళవారం జిల్లా కేంద్రలోని టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్ఎఫ్ అని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై నిరంతర ఉద్యమిస్తున్న విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని మణికంఠరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు విద్యార్థి లోకం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 18 నుండి 20 వరకు జిల్లాకేంద్రంలో జరిగే ఎఐఎస్ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో అధికారం లో బిజెపి ప్రభుత్వం తరగతి గదుల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతూ విద్యార్థులను రాజకీయంగా ఓట్ల కోసం వాడుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభలకు సిపిఐ నాయకులు హాజరు కానున్నారని, మహాసభల విజయవంతానికి విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమా వేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు రఘురాంనాయక్, సుబోద్, కుశాల్, సంజయ్, కార్తీక్, అనూష్, కిషోర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## హైకోర్టు స్టేతో ఆగిన ఇబ్రహీంపట్నం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** హైకోర్టు అదనపు జడ్జి దేశాల మేరకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ ఆపి వేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డిఓ అనంతరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్డిఓ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ మంగళవారం జరగాల్సి ఉండగా 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిని కిడ్నాప్ చేశారని ఆయన కుమారుడు ఆకుల హరికాంత్ హైకోర్టును ఆశ్రయించి హెబియస్ కార్పస్ వేయటంతో, హైకోర్టు సూచన మేరకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఆపాలని ఫోన్‌లో అధనపు జడ్జి సమాచారం ఇవ్వటంతో ఎన్నికల ప్రక్రియ ఆపివేసినట్లు పేర్కోన్నారు. సమావేశంలో తహసీల్ధార్ సునితా,మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ పాల్గోన్నారు.

## లక్ష్మీదేవిపల్లి రాజర్వాయర్ నిర్మాణంలో జాప్యం వద్దు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో జాప్యం ఎందుకు చేస్తున్నారో ప్రభుత్వం చెప్పాలని పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఈనెల 18న నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవచారి మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను ఎన్నికల హామీగానే చూస్తున్నారే తప్పా నిర్మాణ పనుల్లో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదని మండిపడ్డారు. సాగునీరు లేక షాద్‌నగర్ ప్రాంతం వర్షదార పంటల సాగుపైనే జీవనం సాగిస్తున్న ప్రజలకు సాగునీరు అందిస్తారేమోననే ఆశలో ఓట్లు వేసి గెలిపిస్తుంటే హామీని అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సదస్సుకు మేదావులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు సహకారం



**ప్రజాపక్షం/షాబాద్:** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు సహకారం అందిస్తామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీంభరత్, హోఫ్ పౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఎస్ కార్డెన్‌లో జర్నలిస్టు కదుమురి రాములు సంస్మరణ సభ నిర్వహించారు. షాబాద్ జర్నలిస్టు సభ్యులు, కుర్మ సంఘం మండల అధ్యక్షుడు మద్దూర్ పాండు ఇతర కుల సంఘాల నాయకులు, రాజకీయ నేతల సహాయ సహకారంతో సేకరించిన రూ.8 లక్షల రూపాయల చెక్కును రాములు సతీమణి అలువేలుకు వారు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, జర్నలిస్టులు సలీం, రెడ్డిమోని యాదయ్య, గోపాల్, రాంచేంద్రయ్య, దేశలమల అంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన



**ప్రజాపక్షం/కొందుర్గు:** పంచాయతీ రాజ్ చట్టంపై ప్రజాప్రతినిధులు అవగాహన పెంచుకోవాలని కొందుర్గు ఎంపిడిఒ లక్ష్మీ అనురాధ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు పంచాయతీ రాజ్ చట్టంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిఓ విజయ్‌కుమార్ పాల్, సూపరిండెంట్ గణపతి, వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/షాబాద్:** గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ కమలమ్మ చెన్నయ్య అన్నారు. షాబాద్ మండల పరిధిలోని బొడంపహడ్ గ్రామానికి వెళ్ల రోడ్డును వార్డు సభ్యులతో కలిసి మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మట్టి వేసి డోజర్‌తతో గుంతలు మూసివేస్తున్నట్లు వివరించారు. గ్రామంలో మంచినీటి సమస్య, విద్యుత్ దీపాలు, సీసీ రోడ్లు పనులు చేపటేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆనంద్, శ్రీనివాస్, నర్సింలు తదితరులు ఉన్నారు.

## మునిసిపాలిటీ అభివృద్ధికి పనిచేద్దాం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం కలిసి కట్టుగా పని చేద్దామని మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్‌ను డివిజన్‌లోని వివిధ మండలాల నుండి వచ్చిన యువత పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, ఇందుకు ప్రజలందరు సహాకరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి పథకాన్ని ఇంటింటికి తీసుకువెళ్ళడంతోపాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అదేశాల మేరకు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటిలోని వార్డులు అభివృద్ధికి పూర్తిగా వెనుకబడి పోయాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

# నేర పరిశోధనలో పోలీసు జాగిలాలు కీలకం

ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్

ఘనంగా పోలీస్ జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు జాగిలాలు కేవలం జంతువులు మాత్రమే కావని, నేర పరిశోధనలో పోలీసులకు అత్యంత నమ్మకమైన, క్రమశిక్షణ కలిగిన భాగస్వాములని ఇంటెలిజెన్స్ చీఫ్, అదనపు డిజి విజయ్‌కుమార్ కొనియాడారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటిఎ) వేదికగా 25వ బ్యాచ్ పోలీస్ జాగిలాలు, వాటి హ్యాండ్లర్ల పాసింగ్ అవుట్ పరేడ్ మంగళవారం ఘనంగా జరిగింది. ఎనిమిది నెలల పాటు సాగిన కఠినమైన, శాస్త్రీయ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 105మంది హ్యాండ్లర్లు, 76జాగిలాలు విధుల్లో చేరడానికి సిద్ధమయ్యాయి. ఈ బృందంలో తెలంగాణకు చెందిన 42 జాగిలాలు, బీహార్ సిఐడి చెందిన 30, సిఐఎస్ఎఫ్‌కు చెందిన 4 జాగిలాలు ఉన్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పరేడ్‌లో ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ....జాగిలాలకు, హ్యాండ్లర్లకు మధ్య ఉన్న అవగాహనను బట్టి శిక్షణ మెరుగ్గా ఉంటుందన్నారు. నేరస్థులను వేటాడటం, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను గుర్తించడం మరియు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని, వీటి రాకతో పోలీసు శాఖ సామర్థ్యం మరింత పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణను సమర్థవంతంగా నిర్వహించిన ట్రైనింగ్ అకాడమీ అధికారులను సిబ్బందిని అడిషనల్ డిజిపి అభినందించారు. కార్యక్రమంలో ఐఎస్‌డబ్ల్యూ ఒఎస్‌డి వి.బి.కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ 2004లో ప్రారంభమైన ఈ శిక్షణ కేంద్రం నేడు దేశస్థాయిలో అత్యుత్తమ ప్రమాణాలతో పోలీస్ శిక్షణ సంస్థగా గుర్తింపు పొందిందని ప్రకటించారు. ఇప్పటివరకు ఈ అకాడమీ ద్వారా వివిధ రాష్ట్రాలకు చెందిన 919 పోలీస్ జాగిలాలు, 1310 మంది హ్యాండ్లర్లకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. 67వ మరియు 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లలో తెలంగాణ పోలీస్ విభాగం వరుసగా ప్రథమ స్థానంలో నిలిచి బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకోవడం ఇక్కడి శిక్షణ నాణ్యతకు నిదర్శనమని గుర్తుచేశారు. జాగిలాల కోసం ప్రత్యేకంగా 650 గజాల 'కెనైన్ ఆల్ఫాక్షన్ పార్క్', అత్యాధునిక వెటర్నరీ ఆస్పత్రి ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ ఐజిపి కార్తికేయ, ఎస్‌పిలు అపూర్వరావు, కరుణాకర్, చక్రవర్తి అకాడమీ ట్రైనింగ్ కన్సల్టెంట్ మాణిక్ రాజ్ తదితరులు పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారు.

### మహిళల ఆర్థిక సాధికారతకు

# ఉమెన్ సేఫ్టీ వింగ్ ముందడుగు

డబ్ల్యుఎస్‌డబ్ల్యు అదనపు డిజి చారుసిన్హా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పడే దిశగా తెలంగాణ పోలీసు విభాగంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ కీలక ముందడుగు వేసిందని డబ్ల్యుఎస్‌డబ్ల్యు అదనపు డిజి చారుసిన్హా తెలిపారు. మహిళలు నడిపే మొబిలిటీ సేవలకు ప్రోత్సాహం అందించేందుకు షేరి మొబైల్ ఎల్‌ఎల్‌పి సంస్థతో అవగాహన కుదుర్చుకున్నామన్నారు. ఈ ఒప్పందం ద్వారా ''మహిళల ఆధ్వర్యంలో రవాణా జీవనోపాధి ప్రయోగాత్మక ప్రాజెక్ట్‌హైదరాబాద్'' కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కింద అర్హులైన మహిళలకు డ్రైవింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల వినియోగానికి అవకాశం కల్పిస్తారని తెలిపారు. తద్వారా డ్రైవర్‌లు, వాహన నిర్వాహకులుగా ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఉందని అధికారులు తెలిపారు. ఈభాగస్వామ్యం ఆర్థిక లావాదేవీలకు సంబంధించినది కాకుండా సహకార రూపంలో కొనసాగుతుందని వెల్లడించారు. శిక్షణ పొందిన మహిళలకు బిగ్యాస్ ఎలక్ట్రిక్ వాహనాల ప్రాప్తి సులభం చేయడంతో పాటు పర్యావరణహిత రవాణా విధానాలను ప్రోత్సహించనున్నారు. హైదరాబాద్ నగరంలో మహిళల ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్వయం సమృద్ధి దిశగా ఇది సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ ఒప్పందంపై చారుసిన్హా, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, మహిళా భద్రత విభాగం సంతకం చేశారు. మహిళల భద్రతతో పాటు వారి జీవనోపాధి అభివృద్ధికి ఈ కార్యక్రమం కీలకంగా మారుతుందని ఆమె తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణకు వైద్యశిబిరాలు దోహదం

డిఎంహెచ్ఒ డాక్టర్ కె.లలితాదేవి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఆరోగ్య పరిరక్షణలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఎంతోగానో దోహదపడతాయని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డిఎంహెచ్ఒ డాక్టర్ లలితాదేవి నేతృత్వంలో జిహెచ్‌ఎంసి శేర్లింగంపల్లి జోన్ పరిధిలోని హాఫీజ్‌పేట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత బాలల హృదయ వ్యాధుల స్క్రీనింగ్ శిబిరం అపోలో హాస్పిటల్ సహకారంతో నిర్వహించారు. శిబిరంలో చిన్నారులకు ప్రత్యేక వైద్య బృందం ద్వారా హృదయ సంబంధిత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జోనల్ జిహెచ్‌ఎంసి కమిషనర్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీభా, జిల్లా మాస్ మీడియా అధికారి కె.శ్రీనివాసులు, 108,102 అంబులెన్స్ బృందాలు పాల్గొన్నారు. శిబిరంలో ఉదయ సంబంధిత సమస్యలు, క్లెఫ్ట్ లిప్ సమస్యలు ఉన్నట్టు గుర్తించిన పిల్లలకు అపోలో హాస్పిటల్ సమన్వయంతో అవసరమైన శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె లలితాదేవి మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి ప్రత్యేక శిబిరాలు ఉపయోగకరమైనవి, తల్లిదండ్రులు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో అవసరమైన చోట ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం చర్యలు కొనసాగుతున్నాయని ఆమె వివరించారు.

## టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలు కొనసాగించాలని వినతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను కొనసాగించాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ తోపాటు ఆర్‌డిఒ, తహసీల్దార్ కార్యాలయలలో పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్‌లు మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం సిసిఎల్ఎ కార్యాలయం నుండి జారీ చేసిన మెమో ప్రకారం రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయన్నారు. ఈ ఉద్యోగంపై తమ కుటుంబాలు ఆధారపడి ఉన్న నేపథ్యంలో తమ సేవలను యాధావిధిగా కొనసాగించాలని వారు కోరారు. కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లు రమేష్, రాజు, అనిల్, శ్రీనివాస్, పరమేశ్వర్, సుజాత, కామాక్షి, వనజతో పాటు కలెక్టరేట్, ఆర్‌డిఒ, ఆపరేటర్లు పాల్గొన్నారు.

# మానవ కేంద్రిత సాంకేతికతపై దృష్టి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** స్వదేశీ డిజైన్, మానవ కేంద్రిత సాంకేతికతపై దృష్టి సారించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట్ పరిధిలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సిబిఐటి)లో జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక ఉత్సవం "సుధీ–2026"ను కలెక్టర్ హరి చందన దాసరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆవిష్కరణలు, డిజైన్‌లు సమాజ అవసరాలను తీర్చే విధంగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిష్కారాలు కేవలం సిద్ధా సిద్ధాంత పరిమితిలోనే కాకుండా, అమలు సాధ్యమైనవి, వ్యయపరంగా అందుబాటులో ఉండేలా, స్థిరత్వంతో కూడినవిగా రూపుదిద్దుకోవాలన్నారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆవిష్కరణలు చేయాలని సూచించారు. "డిజైన్ ఫర్ ఇండియా"భావనతో యువత ముందుకు రావాలని, స్వావలంబన, సుస్థిర అభివృద్ధికి తోడ్పడే సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. సాంకేతికత మనుషులను భర్తీ చేయదని, అయితే నిరంతర అభ్యాసం , నైపుణ్యాల మెరుగుదల అవసరమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు నేర్చుకునే ధోరణిని అలవర్చుకోవాలని సూచించారు. సాంకేతిక అభివృద్ధిలో నైతిక విలువలు, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె తెలిపారు. సాంకేతికత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ఆవిష్కరణాత్మక ఆలోచనలను వ్యాపార రూపంలో అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం "సుధీ2026 సావనీర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల డీన్ ప్రొఫసర్ ఎ.కృష్ణయ్య , సిబిఐటి ప్రిన్సిపల్ ప్రొఫసర్ సి.వి.నరసింహులు, ఇన్ఫోమైండ్స్ డిజిటల్ అండ్ ఐపీ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రవికుమార్ మేడూరి, అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణకు గుర్తింపు తెచ్చిన మహనీయుడు కెసిఆర్








**ప్రజాపక్షం /రంగారెడ్డి :** తెలంగాణ కోసం అహర్నిశలు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కెసిఆర్‌అని మీర్‌పేట సర్కిల్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా సీనియర్ నాయకులు అర్కల భూపాల్‌రెడ్డితో కలిసి జిల్లెలగూడ చెరువు కట్ట మీద గల కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి 101 కొబ్బరికాయలను కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, పారిశుద్ధ కార్మికులకు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు బొక్క రాజేందర్ రెడ్డి, భూపేష్‌గౌడ్, శ్రీను నాయక్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దీప్లాల్ చౌహాన్, సునీత, బీరప్ప, అంజయ్య, రమేష్, విజయ్, మోహన్‌నాయక్, సాయికుమార్, అనిల్ కుమార్ యాదవ్, రాజ్ కుమార్, ధనలక్ష్మి, రామకృష్ణ, యాదగిరి, జ్ఞానేశ్వర్, హేమునాయక్, జంగారెడ్డి, జంగయ్య గౌడ్, హనుమంతరావు, రామన్, స్వర్ణలత, నిర్మల రెడ్డి, బిందు, భాస్కర్, చరణ్ బసప్ప, భరత్, పూర్ణచందర్ రెడ్డి, సాయికుమార్, సాయి చరణ్, అర్జున్ పాల్గొన్నారు.


**ఫరూఖ్‌నగర్:** తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన మహనీయుడు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బిఆర్‌ఎస్ కార్యాలయంలో కెసిఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కేశంపేట, కొందుర్గు, నందిగామ, జిల్లేడు చౌదరిగూడ మండలాల్లో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వి.నారాయణరెడ్డి, ఆకుల శ్రీశైలం, రాజావరప్రసాద్, రాజ్యలక్ష్మి , ఈట గణేష్, పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్ పాల్గొన్నారు.

**కొత్తూరులో..** కొత్తూరు మండల కేంద్రంలో కెసిఆర్ జన్మదినం పురస్కరించుకొని కేక్ కట్ చేసి అభిమానులు, కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో ఎమ్మె శ్రీలత సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మెండే కృష్ణ, తీగాపూర్ సర్పంచ్ జయప్రద జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మాదారం నరసింహా, అనిత శ్రీనివాస్ గౌడ్, సోమ్లానాయక్, మాధవి గోపాల్‌రెడ్డి, చంద్రకళ రాజేందర్‌గౌడ్, నేతలు జోగు బాల్‌రాజ్, కేబుల్ వెంకటేష్, కర్రోళ్ల లక్ష్మయ్య, విష్ణుమూర్తి, రవినాయక్ పాల్గొన్నారు.

**హయత్‌నగర్ :** తెలంగాణ కోసం అహర్నిశలు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కెసిఆర్ అని బిఆర్‌ఎస్ నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం నాగోల్ చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకల ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు అనంతుల రాజారెడ్డి, నాగోల్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, ప్రశాంత్‌గౌడ్, సతీశ్ యాదవ్, చంద్రశేఖర్ ఆజాద్, శిల్పరెడ్డి, చింతలపాటి రమేష్, రాజు, చిత్రాల జగదీష్, పోచంపల్లి రాజేందర్‌రెడ్డి, సుధాకర్ చారి, కట్ట ఈశ్వరయ్య, డప్పు వినోద్, శ్యాంసుందర్‌రెడ్డి, నర్సింగ్,కాటేపాక రవి, శంకర్, శ్యామల యాదగిరి, యాదిలాల్, గుత్తా భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్, సుధాకర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

**జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో...** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలను మన్సూరాబాద్‌లో జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కెసిఆర్ జన్మదినం సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి పరీక్షల అనంతరం అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్‌రెడ్డి, బిఆర్‌ఎస్ యువ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, సిద్దగాని నర్సింహా గౌడ్, చెంగల్ చంద్ర మోహన్, సతీష్ దుర్గారావు, రవి తదితరులు పాల్గొన్నారు.







## జంగమ్మను పరామర్శించిన తెలంగాణ మున్సిపల్ సంఘ నాయకులు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి తల్లి వనంపల్లి జంగమ్మ ఫిబ్రవరి 12న వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడ్డారు. ఆమె ప్రస్తుతం మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర కోశాధికారి ఉజ్జిని హరినాథ్‌రావు, మేడ్చల్ జిల్లా మున్సిపల్ సంఘం అధ్యక్షులు చర్లపల్లి రాములు, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సంఘం మండల కార్యదర్శి కమలమ్మ, అనిల్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి జంగమ్మను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు వైద్యులను జంగమ్మ ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జంగమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి స్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అవసరమైన సహాయం అందించేందుకు సంఘం తరపున అండగా ఉంటామని తెలిపారు.

## విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 281 డివిజన్ రంగారెడ్డి నగర్ (గాంధీ నగర్)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు శాకీర్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో విద్యను సక్రమంగా నేర్చుకుని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

అదేవిధంగా పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యను తెలుసుకుని పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయుల మరింత కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఉన్నటువంటి మౌలిక వసతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయ బృందం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## క్రికెట్ కిట్టు అందజేత

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఎఎస్ రావు నగర్ డివిజన్‌కు చెందిన యువ క్రికెట్ క్రీడాకారుడు హ్రేయన్ష్ వర్ధన్‌రెడ్డికి మరింత ప్రోత్సాహం అందించేలా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంజరీ ప్రవీణ్ కరిపే ఆధ్వర్యంలో క్రికెట్ కిట్టును ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. యువత క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు తన సహకారం ఎప్పుడు ఉంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.




## పాక దైవాధీనంకు ఘన నివాళులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** సింగరేణిలో విధులు నిర్వహించి సీనియర్ మేనేజర్‌గా పదవీ విరమణ పొందిన పాక దైవాధీనం అకాల మరణంతో వారి ఆత్మకు శాంతి కలగాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, దైవాధీనం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ దైవాధీనం మరణంతో మనందరి హృదయాలు కలత చెందాయని వారి జీవిత భాగస్వామికి రావలసిన పెన్షన్ కొరకు అసోసియేషన్ తరపున సహాయ పడతామని తెలిపారు. పాక దైవాధీనం పలు సామాజిక సేవ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారని వారి కుటుంబ సభ్యులు మనో నిబ్బరం కోల్పోకుండా ఉండాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజన్ ఈదుల కొమరయ్య, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె బీరయ్య, మల్లయ్య, లక్ష్మి నారాయణ, ప్రభాకర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పర్లి వైజ్‌నాథ్ – సికింద్రాబాద్ సెక్షన్‌లో భద్రతా తనిఖీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని పర్లి వైజ్‌నాథ్–సికింద్రాబాద్ రైల్వే సెక్షన్‌లో విస్తృత భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ గోపాలకృష్ణన్ ఆర్ సహా సీనియర్ అధికారులు పాల్గొన్నారు. తనిఖీలు పర్లి వైజ్‌నాథ్ అమృత్ స్టేషన్‌తో ప్రారంభమయ్యాయి. స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, ప్రాంగణం, నిర్వహణ పనులను సమీక్షించిన జనరల్ మేనేజర్ లోకో రన్నింగ్ రూమ్‌ను కూడా పరిశీలించారు. భద్రతా రిజిస్టర్లు, ప్రొవిజన్ స్టోర్, కిచెన్ తదితర అంశాలను తనిఖీ చేసి సిబ్బందికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. రన్నింగ్ సిబ్బందితో మాట్లాడి ఆహారం నాణ్యత, మెనూ వివరాలు తెలుసుకున్నారు. అమృత్ స్టేషన్ పథకంలో రూ.24.35 కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని కూడా పరిశీలించారు. బీదర్ అమృత్ స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను సమీక్షించిన ఆయన, 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెన, లిఫ్టులు, స్టేషన్ ఆవరణ అభివృద్ధి వంటి సౌకర్యాల పురోగతిని పరిశీలించారు. వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను సందర్శించి స్థానిక హస్తకళల ప్రోత్సాహంపై విచారించారు. సిబ్బంది లాబీలో భద్రతా విధానాలపై చర్చించి వాటిని కచ్చితంగా పాటించాలని సూచించారు. లెవల్ క్రాసింగ్ గేట్ నెం. 34E వద్ద గేట్‌మ్యాన్‌తో మాట్లాడి విధి నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. జహీరాబాద్, వికారాబాద్ స్టేషన్లలో కూడా రూ.24.35 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.

పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణ సమయంలో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



## రంజాన్ మాసం ప్రారంభంలో మక్కా మసీదును సందర్శించిన సజ్జనార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ మంగళవారం చార్మినార్ వద్ద ఉన్న చారిత్రక మక్కా మసీదును సందర్శించారు. చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీతో కలిసి ఆయన మసీదు ప్రాంగణం, పరిసర ప్రాంతాలను పరిశీలించి, అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రంజాన్ మాసంలో ప్రార్థనల కోసం విచ్చేసే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు, పురానీ హవేలీలోని కొత్వాల్ హౌస్లో ముస్లిం మత పెద్దలతో ఆయన భేటీ అయ్యారు. నెల రోజుల పాటు కొనసాగే రంజాన్ వేడుకల భద్రతా ఏర్పాట్లపై వారితో సుదీర్ఘంగా చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి ఎస్ఎం విజయ్ కుమార్, చార్మినార్ జోన్ డిసిపి ఖరే కిరణ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి–చాక్లెట్స్ మిక్సింగ్..

**✻ గంజాయి చాక్లెట్ కలిపిన తండాయి రూ.150/–**

**✻ మాములు తండాయి రూ.50/–**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిన్న మొన్నటి వరకు గంజాయి చాక్లెట్ల అమ్మకాలు చూసాం. తాజాగా..గంజాయి చాక్లెట్స్‌ను పాలతో కలిపి తండాయిలో కలిపి రూ.50కి అమ్ముతున్న తండాయిని రూ. 150 అమ్మకాలు జరుపుతున్న వ్యక్తిని ఎస్‌టిఎఫ్ ఎ టీమ్ లీడర్ అంజిరెడ్డి సిబ్బంది కలిసి పట్టుకున్న ఘటన ఉప్పుగూడ చార్మినార్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోవెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్



ఆగ్రాకు చెందిన బి. వికాష్ శర్మ అనే వ్యక్తి గత కొంతకాలంగా చూడి బజార్ నుంచి బేగం బజార్ మధ్యంలో తండాయి అనే పాలు అమ్మకాలు జరుపుతాడు. వేడి చేసి చల్లార్చిన పాలల్లో ఐస్, డ్రైఫూట్స్ తయారు చేసిన పాలను తండాయి పేరుతో రూ. 50 ఒక గ్లాస్ అమ్మకాలు జరుపుతుంటాడు. వేసవిలో చల్లదనంతో పాటు గంజాయి చాక్లెట్లను మిక్స్ చేసిన తండాయి పాలను రూ.150 అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ ఎ టీమ్ లీడర్ అంజిరెడ్డి సిబ్బంది కలిసి వికాస్ శర్మ ఇంట్లోలో తనిఖీలు నిర్వహించారు. వికాస్ ఇంట్లో 1920 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ చాక్లెట్లలో 9.60 కిలోల గంజాయి మిక్సింగ్ అయినట్లు గుర్తించారు. ఒక్కొక్క గంజాయి చాక్లెట్‌లో 5 గ్రాముల గంజాయి మిక్సింగ్ చేసినట్లు నిందితుడు అంగీకరించారు. ఈ చాక్లెట్లను ఆగ్రా నుంచి తెప్పించారు. ఈ చాక్లెట్ల గిరాకి ఎక్కువగా హోలీ సందర్భంగా అధికంగా ఉంటుందని ఎక్కువ మొత్తంలో గంజాయి చాక్లెట్లను తెప్పించాడని నిందితుడి విచారణలో వెల్లడయ్యింది.నిందితుడిని, బైక్‌ను, గంజాయి చాక్లెట్లను చార్మినార్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు అంజిరెడ్డి తెలిపారు.

## ఎక్కువ జింక్ కలిగిన వరి వంగడంపై అవగాహన




**ప్రజాపక్షం / ధారూర్ :** భారతీయ వరి పరిశోధనా సంస్థ ద్వారా కొత్త వరి వంగడం బయోఫ్లోరిఫైడ్ ధాన్ 48 రకాన్ని ఆవిష్కరించామని, శాస్త్రవేత్తలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ బ్రజేందర్‌లు పేర్కొన్నారు. మంగళవారం ధారూర్, గురుదోట్ల రైతువేదికలలో రైతు అవగహనా సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కొత్త వరి వంగడం ధాన్ 48లో తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్, ఎక్కువ జింక్ కలిగి ఉన్నాయని తెలిపారు. భారతీయ భూములలో ఎక్కువశాతం జింక్ లోపం కలిగి ఉన్నాయని, ఈ భూమిలో పండించే పంటలలో జింక్ లోపం ఉందని తెలిపారు. ఈ ధాన్యాల ద్వారా మానవులకు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు.

తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ వలన గ్లూకోజ్ లేటుగా విడుదల వలన షుగర్ వ్యాధివారికి లాభదాయకమని సూచించారు. జింక్ ఎక్కువ ఉండటం వలన పిల్లల్లో ఎదుగుదల చక్కగా ఉండి ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని అన్నారు. రైతులు పోషక విలువలపై అవగహన కలిగి ఉండి కొత్త రకం ధాన్ 48 వరి వంగడాన్ని సాగుచేయాలని సూచించారు.

ఈ రకం వరి తెగుళ్లను తట్టుకొని ఎక్కువ దిగుబడిని ఇస్తుందని తెలిపారు. రైతులకు అవగహనకోసం 200 మంది గిరిజన రైతుల కు 20కేజీల విత్తనాలు, భూసార పరీక్ష కిట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం , ఎడిఏ వెంకటేశం, ఎఒలు సూర్యప్రకాశ్, సందీప్‌లు, ధారూర్, రాంపూర్ సర్పంచ్‌లు, ఎఇఒలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నేత కెసిఆర్ : ఎమ్మెల్యే కృష్ణారావు



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్రం సాధ్యమయ్యేలా ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నేత కెసిఆర్ అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కెసిఆర్ 72వ జన్మదిన వేడుకలు బోయిన్‌పల్లి డివిజన్ లో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మహిళల సాధికారత కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు.



**దుండిగల్‌లో:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గండిమైసమ్మలోని బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ 72 కిలోల కేక్‌ను కట్ చేశారు. అనంతరం కెసిఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

**కుత్బుల్లాపూర్‌లో :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ లాస్ట్ బస్‌స్టాప్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర సాధకులు, బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తల మధ్య ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ జగన్ ముఖ్య అతిథిగా విచ్చేసి, కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.



## కామ్రేడ్ సాయిలు అకాల మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** సిపిఐ, ఏఐటియుసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు కామ్రేడ్ సాయిలు అకాల మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకరరావు అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో మల్లాపూర్‌లోని సుభాష్‌నగర్‌లోని ఆయన నివాసానికి మంగళవారం వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ నేతగా, కార్మిక సంఘ నాయకుడిగా సాయిలు మల్లాపూర్ ప్రాంతంలో జరిగిన పలు ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల గురించి పోరాడిన ఆయన మృతి పట్ల మండల పార్టీ తీవ్ర సంతాపాన్ని తెలియచేస్తోందని, ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరు ధర్మేంద్ర, సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఎఐటియుసి నేతలు శ్రీనివాస్, నాగేష యాకూబ ఎల్లయ్య, ఆనంద్, సాయిలు, వెంకట్, మహేష్, తదితరులు ఆయనతో పాటు ఉన్నారు.

## 19న 'భూపతి చంద్ర స్మారక కథానికల' పోటీ పురస్కారాల ప్రదానం

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** 'భూపతిచంద్ర స్మారక కథానికల పోటీ–2026 పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు, డా.దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించనున్నట్టు అధ్యక్షులు ఎం.ఎల్.కాంతారావు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు సలహామండలి కన్వీనర్‌గా ప్రొ.సి.మృణాళిని, విశిష్ట అతిథిగా ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్, గౌరవ అతిథిగా ప్రముఖ రచయిత మహమ్మద్ ఖదీబాబు, ఆత్మీయ అతిథిగా సినీ దర్శకులు బి.నర్సింగరావు హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపికైన రచయితలకు ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు,తృతీయ బహుమతిగా రూ.6వేలు నగదు అందజేస్తామని తెలిపారు. ఐదుగురు రచయితలకు ప్రోత్సాహక బహుమతులుగా రూ.2వేల నగదు చొప్పున ప్రదానం చేస్తామని తెలిపారు.

## మహిళ హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

**ప్రజాపక్షం/వికారాబాద్ రూరల్ :** మండల పరిధిలోని గ్రామ శివరులో ఒక గుర్తు తెలియని మహిళ మృతుదేహం లభ్యం కాగా తిమ్మాపురం మాదవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వికారాబాద్‌టౌన్ ఎస్ఐ అనిత కేసు నమోదు చేశారు. బాధితురాలు చేవెళ్ల గ్రామానికి చెందిన ఎర్రోల్ల అనుసుజాగా గుర్తించి ఆధారాలతో నిందితుడు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి గ్రామానికి చెందిన తలారి బాబు అని గుర్తించి అరెస్టు చేసి పక్కా ఆధారాలతో కోర్డులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్ నిందితుడికి జీవితకాల శిక్షతోపాటు రూ.5,000 జరిమాన విధించారు. జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరస్తులకు శిక్షలు పడేలా చేయడంలో అధికారుల కృషి అభినందనీయం అన్నారు.

## సుధీర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నేతలు



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లి పెద్ది సుధీర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రతాప్ సింగారం గ్రామంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేసి సుధీర్ రెడ్డికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని సుధీర్ రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్, పోచారం అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కీసర గుట్ట డైరెక్టర్ సగ్గు అనితశ్రీనివాస్, మాజీ సహకార బ్యాంక్ డైరెక్టర్ కొంతం అంజిరెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, మాజీ కౌన్సిలర్ బొక్క సంగీత, మల్లేష్, కుతాడి రవీందర్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**చర్లపల్లిలో:** మేడ్చల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మలిపెద్ది సుధీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు దమ్మాయిగూడ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పంగ హరిబాబు, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నిన్న గృహిణి... నేడు ప్రథమ పౌరురాలు





**ప్రజాపక్షం/పరిగి :** నిన్నటి వరకు ఇంటర్మీయట్ పూర్తి చేసి ఇంటికే పరిమితమైన సామాన్య మహిళగా కుదుముల రజిత వెంకటేష్ పరిగి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజల ఆశీర్వాదంతో 16 వ వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీనుండి పోటీ చేసి విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ , బిఆర్ఎస్ పార్టీలుప్రతిష్టాత్మకంగా తీసుకున్న పరిగి మున్సిపల్ చివరికి కాంగ్రెస్ పార్టీమున్సిపల్ పై జెండ ఎగురవేశరు. పరిగి మున్సిపల్ లో ప్రారంభం నుంచి నువ్వా నేనా అనే రీతిలో కాంగ్రెస్ ,బిఆర్ఎస్ పార్టీలో పోరు కొనసాగింది. కాంగ్రెస్ పార్టీకి స్వతంత్ర అభ్యర్థుల మద్దతు ,ఎమ్మెల్యే ఎక్స్‌ఫీసియో ఓటుతో మున్సిపల్‌చైర్ పర్సన్ స్థానం దక్కించుకున్నారు.

**పరిగి మున్సిపల్ వైస్ చైర్మన్ గా మూడవత్ హనుమంతు :** పరిగి మున్సిపల్ ఏర్పటు కాకముందు పరిగి మండలం నజీరాబాద్ గ్రామం హనుమాన్ గంటి తాండ లో సామన్య బీద కుటుంబం లో జన్మంచిన ముడవత్ హనుమంతు, ఉపసర్పంచు సేవేలక్ష్యంగా ఎన్నుకున్నాడు. అనంతరం పరిగి మున్సిపాలిటీలో ఏర్పాడ్డాక రెండవసారి మున్సిపాలిటీ ఏర్పాడ్డాక రెండవ సారి మున్సిపాలిటీలో నూతనంగా మరో మూడవ వార్డులను ఏర్పాటు చేశారు. ముడోవార్డు నుండి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కండువాకప్పుకుని కాంగ్రెస్ పాలకవర్గానికి మద్దుతు తెలిపి యున్సిపల్ వైస్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు.

# నోటీసులు మాత్రమేనా? చర్యలు ఎప్పుడు..?

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ మండలంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ అనుమతులకు మించి తరగతులు నిర్వహిస్తున్నాయన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. 7, 8వ తరగతుల వరకు మాత్రమే అనుమతి పొందిన పాఠశాల లు 9, 10వ తరగతులను కొనసాగించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.విద్యాశాఖ నియమాల ప్రకారం అదనపు తరగతులు ప్రారంభించాలంటే ముందస్తు అనుమతి, తగిన మౌలిక వసతులు, అర్హత గల ఉపాధ్యాయులు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరి. కానీ ఇవన్నీ పక్కనబెట్టి విద్యార్థుల అడ్మిషన్లు చేపట్టడం ఎంతవరకు సమంజసం. ఒక పాఠశాల అనుమతితో బ్రాంచిల పేరుతో మరో చోట పాఠశాలలు నిర్వహిస్తున్న ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలు హాల్ టికెట్లు, మెమోలు వేరే పాఠశాలల పేరుతో 10వ తరగతి పరీక్షల సమయంలో అనుమతిలేని పాఠశాలలు ఇతర గుర్తింపు పొందిన పాఠశాలల ద్వారా పరీక్షలు రాయించడంతో, హాల్ టికెట్లు మెమోలు విద్యార్థులు చదవని పాఠశాలల పేరుతో రావడం తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా కాదా?

**సిలబస్ పై మోసం..?**

రాష్ట్ర సిలబస్‌కు మాత్రమే అనుమతి ఉన్న పాఠశాలలు సెంట్రల్ సిలబస్ అమలు చేస్తున్నట్లు ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది స్పష్టంగా విద్యాశాఖ మార్గదర్శకాలకు విరుద్ధమని అధికారులు చెబుతున్నారు.

**నోటీసులు సరిపోతాయా..?**

ఇప్పటికే కొన్ని పాఠశాలలకు నోటీసులు జారీ చేసినప్పటికీ, కఠిన చర్యలు లేకపోవడం గమనార్హం. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై గుర్తింపు రద్దు వంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టే ఇలాంటి అక్రమాలపై తక్షణమే సమగ్ర తనిఖీలు నిర్వహించి, కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు,స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** మహిళ పాదాలపై బస్సు ఎక్కడంతో గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని నాగార్జున నగర్ శుభోదయ కాలనీకి చెందిన చిట్యాల లక్ష్మి (64)మంగళవారం మధ్యాహ్నం తన ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కే సమయంతో డ్రైవర్ నిర్లక్ష్యంతో బస్సును కదిలించడంతో కిందపడగా ఆమె పాదాలపై నుండి వెళ్లగా తీవ్ర గాయాలయ్యాయి.

సంఘటన స్థలంలో ఉన్న వ్యక్తి కుమారుడు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న కుమారుడు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
18-02-2026
www.prajapaksham.in

దర్శకుడు అభిషేక్ నామా రూపొందిస్తున్న చిత్రం 'నాగబంధం' పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్ ఇటీవల విడుదలైంది. కేవలం 24 గంటల్లోనే 20 మిలియన్‌కు పైగా వ్యూస్ సాధించి, దేశవ్యాప్తంగా ట్రెండింగ్ చార్ట్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. .

రీల్

## 'సెయాన్' ఫస్ట్ లుక్ రిలీజ్



వర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న కొత్త చిత్రం 'సెయాన్'. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివ కార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. .రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సెయాన్ అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఫ్యామిలీ డ్రామాగా నిలిచేలా ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్, విజువల్స్ మేళవింపుగా ఈ సినిమా రూపొందుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శివకార్తికేయన్ డివైన్ లుక్‌లో కనిపిస్తున్నారు. ధోతీ, విభూతి, రుద్రాక్షలతో సంప్రదాయానికి దగ్గరగా కనిపిస్తూ, చేతిలో వంపు ఉన్న కత్తి ఆయన ప్రశాంతత వెనుక దాగిన శక్తిని సూచిస్తోంది. వెనుకన కనిపించే నెమలి రెక్కలు, చుట్టూ ఉన్న నెమళ్లు మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ పాత్రకు మిథికల్ ఆరా అందిస్తున్నాయి. ఈ చిత్రంలో శివకార్తికేయన్ పవర్ ఫుల్, డైనమిక్ పాత్రలో కనిపించనున్నారు.రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకత. మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది.

## 'హే బల్వంత్' లాంటి సినిమా కోసం ఎదురుచూశాను



కథానాయకుడు సుహాస్

నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే బల్వంత్' ( హే భగవాన్ చిత్రం టైటిల్ మార్పు) అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హీరో సుహాస్ మంగళవారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. భగవాన్ అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది. కాబట్టి టైటిల్ మార్చాలని సెన్సార్ వారు సూచించడంతో హేబల్వంత్‌గా మార్చాం. సినిమాలో నరేష్ క్యారెక్టర్ పేరు బల్వంత్. సినిమా టైటిల్‌తో పాటు కాన్సెప్ట్‌ను కూడా సెన్సార్ వాళ్లు పరిగణలోకి తీసుకున్నారు. చిన్నప్పటి నుంచి బిజినెస్ చేయాలని అనుకుంటాడు. నాన్న బిజినెస్ చేయాలని అనుకుంటాడు. అప్పుడు అతనికి ఎదురైన పరిణామాలు ఏమిటి? నాన్న బిజినెస్ ఏమిటి? ఇలా సినిమా పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌గా, నా పాత్ర కూడా వినోదాత్మకంగా ఉంటుంది. నా కెరీర్‌లో సినిమా ఓకే కాగానే పూర్తిచేసి చాలా త్వరగతిన విడుదల చేస్తున్న సినిమా 'హే బల్వంత్' సినిమా కూడా ఎంతో క్వాలిటీగా ఉంటుంది. నా కెరీర్‌లో మళ్లీ ఇంత ఫాస్ట్‌గా సినిమా జరుగుతుందా అనిపించింది. విజయం కోసం ఎదురుచూడటమే.. బాధగా అనిపిస్తుంది. కానీ వెంటనే తదుపరి సినిమాకు రెడీ అవుతున్నాను. ఈ సినిమాపై అందరికి నమ్మకం ఉంది. వంశీ నందిపాటి గారు మాకు ఈ సినిమాకు ఎంతో ధైర్యం ఇస్తున్నారు. వరుస ఫెయిల్యూర్స్ తరువాత అందరూ కంట్రోల్‌గా ఆలోచించి చేయమని అన్నారు. ఇంట్లో మా శ్రీమతి కూడా చెప్పింది. అందుకే మంచి సినిమాలు చేయాలని కొంత బ్రేక్ ఇచ్చి 'హే బల్వంత్' చేశాను. ఈ సినిమాపై చాలా నమ్మకం ఉంది. మండాడి మూవీలో విలన్ తమిళ్ సినిమా. సినిమా రిజల్ట్ తరువాత తమిళంలో బిజీ అయ్యే అవకాశం ఉంది. నేను వెయిట్ చేసిన లుక్ అండ్ క్యారెక్టర్ అది. అంబాజీ పేట సినిమా చూసి ఈ సినిమా కోసం నన్ను అప్రోచ్ అయ్యారు. తమిళ సినిమాల్లో విలన్ పాత్రలో చేస్తున్నాను. చాలా డిఫరెంట్ లుక్, ఆ లుక్‌ను ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే టెన్షన్ ఉంది. నేను పూర్తి శాటిస్‌ఫాక్షన్‌గా ఉన్నాను. ఈ సినిమా హిట్ అయితే అది ఇంకా పెరుగుతుంది. అందరూ సినిమా మీద ఫుల్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. పెద్ద విజయం రాబోతుంది. ఈ సినిమా మా వైఫ్ కూడా చూసి ఫుల్ ఎంజాయ్ చేసింది. ఇలాంటి సినిమాలు కదా నువ్వు చేయాల్సింది అంది. కార్తీక్ సుబ్బరాజు బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్నాను. ఆయన కథ అందిస్తున్నాడు. వాళ్ల అసోసియేట్ దర్శకుడు. తెలుగులో కొన్ని కథలు వింటున్నాను.త్వరలోనే ఫైనల్ అవుతాయి.

## రొమాంటిక్ లవ్ స్టోరీ 'వాట్సప్ నరేష్'



కావ్య కళ్యాణ్ రామ్.. 'కొత్తపోరడు' ఫేమ్ అన్వేష్ మైఖేల్ జంటగా 'వాట్సప్ నరేష్' అనే చిత్రం రాబోతోంది. సివిలి సినిమా బ్యానర్ మీద భాగ్యలక్ష్మి చింత నిర్మించిన ఈ చిత్రానికి సివి విశాల్ దర్శకత్వం వహించారు. యూత్ ఫుల్, ఫీల్ గుడ్ లవ్ ఎంటర్టైనర్‌గా రానున్న ఈ మూవీకి సంబంధించిన రెండో గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. 'ఎట్ల నడుస్తుంది డేటింగ్ లైఫ్' అని హీరో అడగడం.. 'మొన్ననే చెప్పిన కదా నాకు ఇష్టం లేదని'.. అని హీరోయిన్ సంభాషణతో గ్లింప్స్ ఓపెన్ చేశారు. 'నువ్వెప్పుడూ డేట్స్‌కి వెళ్లలేదా?'.. అని హీరోయిన్, 'వెళ్లిన సెట్ అవ్వడం లేదు' అని హీరో 'ఏ.. ఏ..' అని హీరోయిన్ అడగడంతో వారి సంభాషణ మరింత ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఇక చివరకు 'మీ ఇంట్లో కాస్ట్ పిచ్చి ఏమైనా ఉందా?'.. అంటూ కులం గురించి మాట్లాడుకున్న సంభాషణ ఎంతో ఫన్నీగా ఉంది. ఈ గ్లింప్స్ లెంగ్త్ ఎక్కువ అయినా కూడా ఆ ఫీల్ మాత్రం ఎక్కడా మిస్ కాలేదు. బ్యాక్ గ్రౌండ్ లో వినిపించిన 'అయోమయంగా సాగుతున్న పయనమే ఇదా' అనే పాట ఎంతో హాయిగా, వినసొంపుగా ఉంది. ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతాన్ని అందిస్తున్నారు. రీసెంట్ గానే సైక్ సిద్ధార్థ్ మూవీకి ఇతను సంగీతాన్ని అందించాడు. విప్లవ్ నైషదం ఎడిటర్‌గా పని చేస్తున్నారు. వేదరామన్ శంకరన్ కెమెరామెన్‌గా వర్క్ చేస్తున్నారు. అన్వేష్ మైఖేల్, కావ్య కళ్యాణ్‌రామ్, కె సాయి సంతోష్, ఉత్రశీ మురళి, సంతోష్ నందివాడ, ప్రియాంక రవిరు, మధు, పద్మ, బొమ్మకంటి రవీందర్, సునందన, మాల పార్వతి, కిరణ్ కుమార్ తదితరులు నటిస్తున్నారు.

## సైలెంట్ హిట్‌గా 'నిలవే'



దర్శకుడు వి.సముద్ర

సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కే వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. శ్రేయాసి సేన్ హీరోయిన్‌గా నటించగా, హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. పిఓవి ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కే వెన్నం నిర్మించారు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న విడుదలై అద్భుతమైన రెస్పాన్స్ ను తెచ్చుకుంది. బిగ్గెస్ట్ మ్యూజికల్ లవ్ డ్రామాగా అందరి ఆదరణ అందుకుంది. ఈ సందర్భంగా మంగళవారం రామానాయుడు స్టూడియోలో సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత, గీత రచయిత చంద్రబోస్ వీడియో బైట్ ద్వారా స్పందిస్తూ బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచిందని చెబుతూ టీమ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకు లు వి సముద్ర మాట్లాడుతూ. ఈ వాలెంటైన్స్ డేకి విడుదలైన ఆరేడు చిత్రాల్లో 'నిలవే' సక్సెస్‌ఫుల్ టాక్ తెచ్చుకుంది. డీసెంట్ కలెక్షన్స్‌తో సైలెంట్ హిట్‌గా నిలిచింది. ఇందులోని హీరో హీరోయిన్ భవిష్యత్తులో కచ్చితంగా సూపర్ స్టార్స్ అవుతారు అన్నారు. హీరో సౌమిత్ మాట్లాడుతూ మూడేళ్ల కష్టమే ఈ సినిమా. ఆడియెన్స్ ముందుకు తీసుకు రావడానికి మూడేళ్లు పట్టింది. ఇ ప్పుడు ఆడియెన్స్ నుంచి వస్తోన్న రెస్పా న్స్ చాలా సంతోషాన్ని ఇస్తుంది. అని అన్నారు. హీరోయిన్ శ్రేయాసి సేన్ మాట్లాడుతూ ప్రతి పాత్రలో నన్ను న మ్మి న సౌమిత్‌కు థ్యాంక్స్ అని చెప్పారు. దర్శకుడు సాయి కే వెన్నం మాట్లాడుతూ మూ డేళ్ల క్రితం మొదలైన ఈ జర్నీ ఇక్కడవరకు వచ్చింది. ఈ మూవీ మేకింగ్‌లో చాలా విషయాలు నేర్చుకున్నా.నిర్మాత రాజ్ అల్లాడ భార్య మాధురి మాట్లాడుతూ సినిమా చూసిన వారంతా కొత్త వాళ్లు తీసినట్టు లేదని చెబుతున్నారు. ముఖ్యంగా మ్యూజిక్ మా మూవీకి మరింత ప్లస్ అయ్యింది. నిర్మాత రాజ్ అల్లాడ మాట్లాడుతూ మంచి స్పందన వచ్చింది. చక్కటి మ్యూజికల్ లవ్ స్టోరీ. కొత్తవారైనా అందరూ బాగా నటించారు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంగీతం దర్శకుడు కళ్యాణ్ నాయక్ పాల్గొన్నారు.

## రూ.5.42 కోట్ల వసూళ్లు చేసిన 'కపుల్ ఫ్రెండ్లీ'




సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన లేటెస్ట్ సూపర్ హిట్ మూవీ 'కపుల్ ఫ్రెండ్లీ' బాక్సాఫీస్ వద్ద స్టడీ కలెక్షన్స్ తో దూసుకెళ్తోంది. ఈ హార్ట్ టచింగ్ ప్రేమ కథ మూడు రోజుల్లోనే 5.42 కోట్ల రూపాయల వసూళ్లను దక్కించుకుంది. ఈ సినిమాకు రెబల్ స్టార్ ప్రభాస్, స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ వంటి స్టార్స్ ప్రశంసలు అందిస్తున్నారు. మూవీ టీం చేస్తున్న ప్రమోషనల్ టూర్ కూడా ప్రేక్షకుల్లోకి సినిమాను బాగా తీసుకెళ్తోంది.'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెపట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మించింది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేశారు.

## 'మరకతమణి 2' షూటింగ్ ప్రారంభం



2017లో విడుదలై తన మ్యాజికల్ కాన్సెప్ట్, కామెడీతో ఫాంటసీ కామెడీ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న చిత్రం మరకతమణి. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా సీక్వెల్ 'మరకతమణి 2' ప్రారంభమైంది. ఈ చిత్రం షూటింగ్ నిన్న చెన్నైలో జరిగిన పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. హీరో కార్తీ క్లాప్ కొట్టగా, హీరో ఆర్య, దర్శకుడు వెంకట్ ప్రభు కెమెరా రోలింగ్, యాక్షన్ అంటూ షూటింగ్ ప్రారంభించారు. యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీతో అనుబంధం వున్న అనేక మంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ప్యాషన్ స్టూడియోస్, దంగల్ టీవీ, ఆర్‌డిసి మీడియా, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, గుడ్ షో బ్యానర్‌లపై సుధన్ సుందరం, మనీష్ సింఘాల్, దుర్గారం చౌదరి, దేవ్ & కెవి దురై నిర్మిస్తున్న ఈ చిత్రానికి గత బ్లాక్ బస్టర్ 'మరకతమణి'కి దర్శకత్వం వహించిన ఎఆర్‌కె శరవణ్ దర్శకత్వం వహిస్తున్నారు. మరకతమణి 2లో ఆది పినిశెట్టి, సత్యరాజ్, ప్రియా భవాని శంకర్, నిక్కీ గల్రానీ పినిశెట్టి, మునిష్కాంత్, ఆనందరాజ్, డానీ, అరుణ్‌రాజా కామరాజ్, మురుగానందం కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాంకేతిక విభాగంలో ధిబు నినన్ థామస్ సంగీతాన్ని అందిస్తుండగా, పీవీ శంకర్ సినిమాటోగ్రఫీ, ఎన్‌కే రాహుల్ ఆర్ట్ డైరెక్షన్, తిరుమలై రాజన్ ఆర్ ఎడిటింగ్, రాజేష్ కన్నన్ డైలాగ్స్, పీసీ స్టంట్స్ యాక్షన్ నిర్వహిస్తున్నారు. : ఆది పినిశెట్టి, సత్యరాజ్, ప్రియా భవానీ శంకర్, నిక్కీ గల్రానీ పినిశెట్టి, మునిష్కాంత్, ఆనందరాజ్, డానీ, అరుణ్‌రాజా కామరాజ్, మురుగానందం. తదితరులు నటిస్తున్నారు.

# సవాల్‌గా తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఒక్క సీటుతో సరిపెట్టుకోబోమని, పది నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించి, అసెంబ్లీలో తమ సంఖ్యా బలాన్ని పెంచుకుంటామని, ఇందుకు వామపక్ష, ప్రజాతంత్ర పార్టీలతో కలిసి ముందుకు సాగుతామని కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. కొత్తగూడెంలో అనేక ఇబ్బందులు పెట్టినప్పటికీ తాము పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కాంగ్రెస్‌తోనే కలిశామని, భవిష్యత్తులో పొత్తు కొనసాగడమా? లేదా? అనేది కాంగ్రెస్ చేతిలోనే ఉన్నదని కూనంనేని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో మగ్దూం భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ్మా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంతో కలిసి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కొత్తగూడెం మొదటి కార్పొరేషన్ ఎన్నికల్లో అపూర్వగట్టం ఆవిష్కరించబడిందని, మొదటి మేయర్‌గా కమ్యూనిస్టు కావడం, అందులోనూ సాధారణ వ్యక్తి, ఆటోడ్రైవర్‌ను మేయర్ చేయడం పట్ల పేద, శ్రామిక, కార్మిక వర్గాలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సిపిఐ, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి చతుర్ముఖ పోటీలో సిపిఐ ఒంటరిగానే 22 స్థానాలను తాము బలపర్చిన ఒక ఇండిపెండెంట్ స్థానాన్ని గెలుచుకున్నామని, కాంగ్రెస్ 22 స్థానాలను, ఆ పార్టీ మద్దతుతో సిపిఐ(ఎం) ఒక స్థానం, బిఆర్ఎస్ 8, బిజెపి ఒక స్థానాన్ని దక్కించుకున్నాయని వివరించారు. వెంకట్

గతంలో బిఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలు కమ్యూనిస్టులకు ఏదో మద్దతునిచ్చినట్టుగా హావభావాలను ప్రదర్శిస్తాయని, గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొత్తగూడెంలో కాంగ్రెస్ కంటే సిపిఐకి రెండు వేల ఓట్లు ఎక్కువగా వచ్చాయని, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ, కాంగ్రెస్‌కు సమానంగా ఓట్లు పోలయ్యాయని వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ ఒకే స్థానానికి పరిమితమైందని, సిపిఐ 9 వార్డులలో గెలిచిందని, మొదటి నుంచి సిపిఐ ఒంటరిగానే గెలుస్తుందన్నారు. బిఆర్ఎస్ మేయర్, డిప్యూటీ మేయర్, మరో ఐదారు ఆఫర్లు ఇచ్చినప్పటికీ తాము జాతీయ, రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సర్దుబాటులో ఉన్నామని, జిల్లా విషయం వచ్చే సరికే

అనేక ఇబ్బందులు పెట్టినప్పటికీ సిఎం, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి చౌరవతో పొత్తు కుదిరిందన్నారు. ఎన్నికలకు ముందు సర్దుబాటు కుదరకపోయినా తాము ఒక సవాల్‌గా తీసుకుని ప్రజాక్షేత్రంలో తాము ఏమిటో రుజువు చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకత్వంలో కమ్యూనిస్టులతో పొత్తును విచ్ఛిన్నం చేసుకుందామనే ఆలోచన లేదని, అందులో భాగంగానే కొత్తగూడెంలో కాంగెస్ ముందుకు వచ్చిందన్నారు.

### కొత్తగూడెంలో బిజెపి ఎక్కడుంది?

కమ్యూనిస్టుల పని అయిపోయిందని, పరాన్న జీవులని, తోక పార్టీలని, ఎవరిపైనో ఆధారపడుతారని చెబుతున్నారని, కమ్యూనిస్టులు ఎక్కడ అని తమను ప్రశ్నిస్తున్న బిజెపి ఇంతకు కొత్తగూడెంలో బిజెపి ఎక్కడ ఉన్నదని కూనంనేని సాంబశివరావు నిలదీశారు. కమ్యూనిజానికి, కమ్యూనిస్టులకు పుల్‌స్టాప్ ఉండబోదని, ఇది నిరంతర ప్రక్రియ , నిరంతర పోరాటం అని అన్నారు. గతంలో జాతీయ, ఉమ్మ డి ఎపిలో బిజెపి స్థానం ఏమిటని ప్రశ్నించారు. అజ్ఞానులు మాత్రమే కమ్యూనిస్టులు ఎక్కడ అని మాట్లాడుతారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీకి వందేళ్ల చరిత్ర



ఉన్నదని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీ సజీవంగానే ఉన్నదన్నారు. కార్పొరేట్ రాజకీయాలను తట్టుకుని నిలబడడం కష్టమని, ఎలక్టోరల్ రంగంలో తాము వెనుకపడొచ్చన్నారు. రైతాంగం, శ్రామిక, కార్మిక, ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసే కమ్యూనిస్టులను ప్రజలు ఆదరిస్తున్నారని, ఏడారిలో ఓయాసిస్, కారు చీకటిలో కాంతిరేఖ తరహా కొత్తగూడెం ఎన్నిక అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నల్లగొండలో 4 వార్డులను, రామగుండంలో సత్యం అనే యువకుడు వెయ్యి ఓట్లతో విజయం సాధించారని తెలిపారు. గతంలో సిపిఐకి 20 స్థానాలు ఉంటే, ప్రస్తుతం 41 స్థానాలలో సిపిఐ గెలిచిందని, గ్రామ పంచాయతీలో గతంలో 75 స్థానాలు ఉండగా, 101 స్థానాలను గెలిచామని కూనంనేని తెలిపారు.

### రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తాం

సిపిఐని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని, అందుకు తమ సర్వ శక్తులనూ ఒడ్డుతామని కూనంనేని సాంబశివరావు అన్నారు. పది నియోజకవర్గాలను ఎంపిక చేసి, ప్రత్యేక దృష్టి పెడుతామని, మిగిలిన నియోజకవర్గాల్లో కూడా పార్టీని విస్తరిస్తామన్నారు. ప్రజలు కమ్యూనిస్టుల పట్ల ఆదరణ చూపిస్తున్నారన్నారు. వామపక్షాల ఐక్యత కోసం ప్రయత్నిస్తామని కానీ ఎన్నికల సమయంలో కొన్ని సందర్భాల్లో సీట్ల సర్దుబాటు కూదరకపోవచ్చని, ఇలాంటి అన్ని సమస్యలకూ అన్ని కమ్యూనిస్టు పార్టీల విలీనం ఒక్కటే పరిష్కారమని కూనంనేని అన్నారు. తాము త్యాగం చేశామని, ధైర్యంగా పోరాటం చేశామని, గెలువాలనే లక్ష్యం పెట్టుకుని గెలిచామని, ప్రస్తుతం తాము సరైన వైఖరిని తీసుకున్నామని, ఇలాగే ముందుకు వెళ్తామని కూనంనేని స్పష్టం చేశారు.

### అరాచకాలకు పాల్పడిన పోలీసులు

కొత్తగూడెంలో పోలీసులు అరాచకంగా వ్యవహారించారని, ఎర్ర చొక్కా వేసుకున్నవారిని ఆ చొక్కను విప్పించారని, కేతన్‌పల్లిలో ఎర్ర చొక్క వేసుకున్న ఒక ఓటరును పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లనివ్వలేదని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరాచకాలకు పాల్పడిన పోలీసులను ప్రభుత్వం కూడా నియంత్రించాలని, ఇది పోలీసు రాజ్యం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛగా ప్రజల అభిమానంతో గెలిచేందుకు ప్రయత్నించాలని, ప్రతిపక్షాలను బెదిరించేందుకు పోలీసుల జోక్యం ఎందుకని ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఒక ఇన్‌స్పెక్టర్ తన వద్ద ఉన్న తుపాకీని చూపించి నామినేషన్ ఉపసంహరించుకోవాలని బెదిరించడం గర్హనీయమన్నారు. స్నేహం, స్నేహమేనని, పొత్తులు పొత్తులేనని, కానీ అన్యాయం జరిగితే మాత్రం చెప్పాల్సిందేనని, చాలా చోట్ల ఇదే జరిగిందని కూనంనేని అన్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ ఎన్నికల్లో పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటుందని, ఇది సరైన పద్ధతికాదని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమైనవన్నారు.



## రాజకీయ ప్రతిపాదికనే : పల్లా

(మొదటి పేజీ తరువాయి)

ఏ రాజకీయ పార్టీతో సీట్ల సర్దుబాటు చేసుకుంటామో, ఫలితాలు వచ్చిన తర్వాత కూడా అదే రాజకీయ పార్టీకి మద్దతునిస్తామని, పదవుల కోసం ఇతర రాజకీయ పార్టీలతో వెళ్లబోమని, అది నైతికత కాదని స్పష్టం చేశారు. గతంలో బిఆర్ఎస్ అప్రజాస్వామికంగా వ్యవహరించిందని అందరూ విమర్శించారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ కూడా అదే పద్ధతిలో వెళ్లకుండా ప్రజాస్వామ్యయూతంగా ముందుకు సాగాలని సూచించారు. కొత్తగూడెం మేయర్ పదవిని గెలుచుకోవడం దేశ వ్యాప్తంగా సంతోషం కలిగించిందన్నారు. గతంలో వామపక్షాలన్నీ ఖమ్మం జిల్లా సమితి ఎన్నికలలో పోటీ చేసి జిల్లా పరిషత్‌ను గెలుచుకున్నప్పటికీ ఎక్స్ అఫిషియో సభ్యుల పేరుతో నాటి అంజయ్య ప్రభుత్వం కమ్యూనిస్టులకు సమితి అధ్యక్ష పదవి రాకుండా చేశారని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో కూడా ఒంటరిగానే పోటీ చేశామని, కాంగ్రెస్ పార్టీ చొరవ తీసుకోలేదని, అందుకే ఒంటరిగా పోటీచేశామని, నల్లగొండ జిల్లాలోనే చాలా వరకు కాంగ్రెస్‌తో సర్దుబాటు కుదిరిందని ఆయన వివరించారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే భారత కమ్యూనిస్టు పార్టీ మొదటి సారి మేయర్ స్థానాన్ని దక్కించుకున్నదన్నారు.1995లో ఉమ్మడి ఎపిలో వామపక్షాలు ఉమ్మడిగా పోటీ చేసి విజయవాడ కార్పొరేషన్‌కు తొలి మేయర్‌గా సిపిఐ నేత టి.వెంకటేశ్వర్ రావు ఎన్నికయ్యారని, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెంలో మూడ్ గణేష్ మేయర్‌గా ఎన్నికయ్యారని వివరించారు.

## అక్షర చిట్‌ఫండ్, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే విధంగా చర్యలు

**తెలంగాణ చిట్ ఫండ్ కంపెనీ, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం డిమాండ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్షర చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ఆర్థిక మోసాలను విచారించి, సంబంధిత చిట్‌ఫండ్ కంపెనీ యాజమాన్యాలపైన కఠినమైన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేసే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ చిట్ ఫండ్ కంపెనీల బాధితుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం గౌరవ అధ్యక్షురాలు పశ్య పద్మ, ప్రధాన కార్యదర్శి వజ్రాల అరుణ, విజయలక్ష్మి పండిట్, కొండారెడ్డి, లలిత ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణకు వినతి పత్రాన్ని సమర్పించారు. వరంగల్ కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా 60కి పైగా బ్రాంచ్‌లతో కార్యకలాపాలు నిర్వహించిన అక్షర చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్,అక్షర టౌన్‌షిప్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల చేతిలో మోసపోయిన బాధితులకు వెంటనే వారి డబ్బులను తిరిగి ఇప్పించేందుకు తగిన చర్యలను తీసుకోవాలని కోరారు. అక్షర చిట్‌ఫండ్ యజమాని పేరాల శ్రీనివాస్ రావు, సంస్థల ఎండి, సిఇఒ పేరాల శ్రీనివాస్ రావు నమోదిత, నమోదు చేయని చిట్లను నిర్వహించి వేలాది మంది కస్టమర్లను చేర్చుకుని 18 శాతం రాబడి (ఆర్ఓఐ ) పేరుతో ప్రైజ్డ్ సబ్‌స్క్రైబర్ల డబ్బును సిస్టర్ కన్సర్న్ కంపెనీల డిపాజిట్ స్కీములు, భూ అడ్వాన్స్ పథకాలలో మళ్లీంచారని వారు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా సంస్థకు చెందిన వినియో గదారులకు ఆ సంస్థ చెల్లింపుల విషయంలో పూర్తిగా విఫలమైందని, ఆ సంస్థ డైరెక్టర్లపై వందకు పైగా పోలీసు కేసులు నమోదయ్యాయని,20కి పైగా నాన్‌బెయిలేబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని, యాజమాన్యం ప్రస్తుతం పరారీలో ఉందని ప్రతినిధి బృందం తెలిపింది. చిట్ రిజిస్ట్రార్ సంస్థకు చెందిన ఎఫ్‌డిఆర్లు, మార్టిగేజ్ ఆస్తులను రిలీజ్ చేయకుండా హోల్డ్‌లో పెట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఎఫ్‌డిఆర్‌లను, మార్టిగేజ్ ఆస్తులను విడుదల చేస్తున్నట్టు తమకు విశ్వసనీయ సమాచారం అందుతుందని వారు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ విషయాన్ని తాము ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి,భారత రాష్ట్రపతికి నివేదించామని, అయినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వేలాది బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని వారు కోరారు.

### అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులను ప్రభుత్వ స్వాధీనం చేసుకుని, డిపాజిట్ దారులకు తక్షణమే డబ్బులు చెల్లించి,బాధితులను ఆదుకోవాలని తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవ అధ్యక్షులు, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులు పశ్య పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుల సమస్యల పరిష్కారానికి అధికారులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని, కంపెనీ ఫౌండర్ డైరెక్టర్లు, వారి కుటుంబ సభ్యులు, బినామీ పేర్లపైన ఉన్న మొత్తం ఆస్తులను తక్షణమే అటాచ్‌మెంట్ చేయాలని, ఆర్థిక మోసాలను విచారించి, సంబంధిత చిట్‌ఫండ్‌కంపెనీ యాజమన్యంపైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ, వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ అగ్రిగోల్డ్ యాజమాన్యం రియల్ ఎస్టేట్ వెంచర్లలో ప్లాట్ల కొనుగోలు చేసిన వారందరికీ రిజిస్ట్రేషన్ చేశారని, ఆ స్థలాలను వారికే స్వాధీనం చేయాలన్నారు. అగ్రిగోల్డ్ మోసాల వల్ల చనిపోయిన కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారాన్ని చెల్లించాలని, అగ్రిగోల్డ్ ఆస్తులన్నీ బాధితులకు చేరేందుకు సమయం పడుతుందని, అందుకే బాధితుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారి సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుభూతితో అర్థం చేసుకోవాలని, మానవతా దృక్పథంతో తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేసినవారు, చేయించిన ఏజెంట్లు మొత్తం దాదాపు 5 లక్షలు ఉంటారని, వారి మొత్తం డిపాజిట్లు రూ 500 కోట్ల వరకు ఉంటాయని,తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ఆస్తులు రూ.1000 కోట్లకు పైగా ఉంటాయని వారు తెలిపారు. అగ్రిగోల్డ్ ఆస్తులను కొంతమంది ఆక్రమించుకున్నారని, వారికి వారే బదిలీ చేసుకున్నారని, డిపాజిట్లు కూడా ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొన్నదని, కోర్టులలో కేసులు నడుస్తున్నాయని వారు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com